epaper.vaartha.com WWW.VAARTHA.COM

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

: fb.com/vaartha Digital హైదరాబాద్

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

9-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 68 పేజీలు: 10+4 వెల: 6.50



## భారీగా పడిపోయిన ముడిచమురు ధరలు

26 డాలర్లు తగ్గిన బ్యారెల్ ధర

116 నుంచి 91 డాలర్లకు చేరిక



## దలాల్ స్ట్రీట్‌లో పండుగ

సెన్సెక్స్ 2,946 పాయింట్లు లాభం

నిఫ్టీ 890 పాయింట్లు వృద్ధి

హోర్ముజ్ జలసంధి తెరిచేందుకు ఇరాన్ గ్రీన్‌సిగ్నల్

మధ్యప్రాచ్యంలో స్వర్ణయుగం రాబోతోంది: ట్రంప్

సీజ్ ఫైర్‌ను స్వాగతించిన భారత్

పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి తొలి అడుగు అని వ్యాఖ్య..



# శాంతిమంత్రం

## అమెరికా- ఇరాన్ మధ్య రెండు వారాలు కాల్పుల విరమణ

అమెరికా, ఇరాన్‌ల మధ్య 40వ రోజుకు చేరిన యుద్ధ జ్వాలలు ఎట్టకేలకు చల్లారాయి. ఇరాన్‌పై జరిపే భారీ సైనిక దాడుల నుంచి ట్రంప్ వెనక్కి తగ్గి, రెండు వారాల షరతులతో కూడిన కాల్పుల విరమణను ప్రకటించారు. ఈ నిర్ణయానికి, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికీ మార్గం సుగమమైంది. ఈ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా ఉపశమనాన్ని కలిగించింది.

వివరాలు లోపలి పేజీల్లో...



## ఇస్లామాబాద్ వేదికగా

# రేపు చర్చలు

పక్షం రోజులు కొనసాగే అవకాశం

జెడి వాన్స్ నేతృత్వంలో అమెరికా బృందం

ఇరాన్ తరపున బాఘేర్ బృందం చర్చలకు రెడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** పశ్చిమాసియాలో దాదాపు 40 రోజులుగా సాగిన యుద్ధానికి తెరదించుతూ ఇరాన్ అమెరికా మధ్య తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు విధించిన డెడ్‌లైన్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండు వారాలపాటు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. దాంతోపాటు ఇరాన్‌పై దాడులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఇరాన్ పంపిన 10 >>2

## రెపోరేట్లు యధాతథం

పశ్చిమాసియా ఉద్రిక్తతలే కారణం

5.25 శాతం వద్దనే రెపోరేట్ల స్థిరీకరణ



## థియేటర్లపై వినోదపు పన్ను

రద్దయిన ట్యాక్స్ సర్కార్ పునరుద్ధరణ?

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సినిమా థియేటర్లలో ఎంటర్ టైన్ మెంట్ ట్యాక్స్ వసూలుకు రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. గత ప్రభుత్వం రద్దు చేసిన వినోదపు పన్నును పునరుద్ధరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వినోదపు పన్ను వసూలు



చేయడానికి కావాల్సిన విధి విధానాలను రూపొందించాలని అధికార్లకు ఆదేశాలు ఇచ్చింది. థియేటర్లతో పాటు, అమ్యూజింగ్ పార్కులు, ప్రభుత్వం గుర్తించిన ఇతర కార్యక్రమాలకు సైతం వినోదపు పన్ను వసూలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారవర్గాల సమాచారం. ఇందుకు గాను పట్టణ, స్థానిక సంస్థల్లో ఉన్న అవకాశాలను పరిశీలించడంతో పాటు, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను సైతం అధ్యయనం >>2



బుధవారం హైదరాబాద్‌లో పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# ఖర్చుగా కాదు

## భాగస్వామ్యంగా చూడండి

ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి

అవసరమైన సహకారం అందిస్తాం

కంపెనీల ప్రతినిధులతో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్8:** సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని, వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధారెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్‌రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, వితితిదీతిలీ ఫౌండేషన్ నుంచి పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు

## మామునూరు ఎయిర్‌పోర్టుకు మూడు నెలల్లో శంకుస్థాపన

ఆదిలాబాద్‌లో డిఫెన్స్ విభాగం ఆధ్వర్యంలో విమానాశ్రయం నిర్మాణం

కేంద్రమంత్రులు జి.కిషన్ రెడ్డి, కె. రామ్మోహన్ నాయుడు

**హైదరాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం కేంద్రమంత్రులు జి.కిషన్ రెడ్డి, కె. రామ్మోహన్ నాయుడు ఢిల్లీలోని కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి అధికారిక నివాసలో >>2

# జనగణన సులువు

డిజిటల్ విధానంలో ఇల్లు, సౌకర్యాల వివరాలను నమోదు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:** జనగణన అధికారుల ప్రమేయం లేకుండానే ఇంట్లో నుండే డిజిటల్ విధానంలో సొంతంగా ప్రతి ఒక్కరూ జనగణన వివరాలను నమోదు చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈ నెలలో ప్రారంభమైన జనగణనలో భాగంగా తొలిదశలో హౌజ్ లిస్టింగ్ (ఇంటి వివరాలు), హౌజింగ్ సెన్సెస్ (ఇంట్లోని సౌకర్యాల) వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. అందు కోసం వెబ్ సైట్ సందర్శించాలని సూచించారు. బుధవారం జాతీయ రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణాంకాల కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్, జాయింట్ డైరెక్టర్ దీరజ్ జైన్ తోపాటు ఆ విభాగానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు న్యూఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసానికి విచ్చేశారు. జనగణనలో భాగంగా తొలిదశలో చేపడుతున్న హౌజ్ లిస్ట్, హౌజింగ్ సెన్సెస్ వివరాలను వివరించారు. తొలిదశలో లోకేషన్ డిటైల్స్, ఒక కుటుంబం ఉండే ఇల్లు, ఆఫీస్, సౌకర్యాల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనుండే స్వీయ ఎన్యుమరేషన్‌ను నమోదు చేసుకునేందుకు వెబ్ సైట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ డిజిటల్ విధానంలో సొంతంగా తన ఇల్లు, ఇంట్లోని సౌకర్యాల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. తద్వారా భారత అభివృద్ధిని మరింత వేగవంతం చేసి, వికసిత భారత్ లక్ష్య సాధనకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. హోంమంత్రి అమిత్‌షా మార్గదర్శకత్వంలో ఈమహత్తరజాతీయ కార్యక్రమాన్ని >>2



బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

## నాదర్‌గుల్ భూముల్లో వాటా దక్కలేదనే

# నాపై నిందలు

వారి అవినీతి చిట్టా ప్రభుత్వం దగ్గరుంది..

అసత్యాలు ఆపకుంటే ఖబడ్దార్.. తప్పులను నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా..

హరీష్ ఆరోపణలపై మంత్రి పొంగులేటి మండిపాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్8:** కెటిఆర్,హరీశ్‌రావులపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'మీ అవినీతి చిట్టా అంతా ప్రభుత్వం దగ్గర ఉంది. త్వరలో అన్నీ బయటకు వస్తాయి. మీ తాటాకు చప్పుళ్లకు భయపడం ఖబడ్దార్ అని హెచ్చరించారు. నాదర్‌గుల్ భూముల విషయంలో బీఆర్ఎస్ నేత హరీశ్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నాదర్‌గుల్ భూముల్లో వాటా దక్కకపోవడం వల్లే తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున కేరళం ప్రచారానికి వెళ్లామని, తాము కేరళం ప్రచారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షనేతలు అబద్ధాలు ప్రచారం చేశారని తెలిపారు. సర్వే నంబర్ 613లోని భూములను 2014లో 3 సంస్థలకు అప్పటి గత ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసిందని అన్నారు. భూముల మ్యుటేషన్ జరిగిన 2016లోనూ వారి ప్రభుత్వమే ఉందన్నారు. 2014, 2016లో జరిగిన రిజిస్ట్రేషన్లతో ప్రస్తుత ప్రభుత్వానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. హరీశ్‌రావు చెప్తున్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభించారని, భూములు పొందిన వారు నాలా కన్వర్షన్ ఇవ్వట్లేదని 2022లోనే సుప్రీంకోర్టుకు వెళ్లారని, వాళ్లు కోర్టుకు వెళ్తే బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవి ప్రభుత్వ భూములు అని చెప్పి సుప్రీంకోర్టులో తాము కౌంటర్ వేశామని అన్నారు. ఆనాడు వాటాల ఒప్పందం చేసుకుని భూములు కట్టబెట్టి ఇవాళ తమ మీద నిందలు వేస్తున్నారని, ప్రొహిబిటెడ్ భూముల్లో ఈ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదని స్పష్టం చేశారు. హరీశ్‌రావును అబద్దాలరావు నాటకాలు ఆడుతున్నారని అంటూ విమర్శలు చేశారు. హరీశ్‌రావు చెప్తున్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులెవరూ లేరని, తన కుటుంబ సభ్యులు ఉన్నట్లు నిరూపించాలని అబద్దాలరావుకు సవాలు చేస్తున్నానని స్పష్టం చేసారు. వట్టినాగులపల్లి భూముల్లోనూ అబద్దాలరావుది పూర్తిగా దుష్ప్రచారమని కొట్టిపారేశారు. కెసిఆర్,కెటిఆర్,హరీశ్ అసత్యాలు ఆపకుంటే ఖబడ్దార్, నా తప్పులు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా అని సవాల్ చేశారు. కుటుంబ సభ్యుల వివాదాన్ని కూడా ఈ ప్రభుత్వానికి అంటగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. షా కుటుంబానికి సంబంధించిన భూమిని తన కుమారుడు సహా నలుగురు డెవలప్‌మెంట్‌కు తీసుకున్నారని, వట్టినాగులపల్లి భూములను తన కుమారుడు కొనలేదని వెల్లడించారు. హోమ్ అనే సంస్థ కొన్న భూమి కొంత ఓఆర్ఆర్‌లో పోయిందని, ఓఆర్ఆర్‌లో పోయిన కొంత భూమిని రికార్డుల నుంచి తొలగించుకోలేదని తెలిపారు. ఓఆర్ఆర్‌లో పోయినంత భూమిని పక్కవాళ్ల భూమి నుంచి కబ్జా చేసే ప్రయత్నం చేశారని, ఆనాడు ప్రభుత్వం అండతో హోం సంస్థ >>2

## నిజామాబాద్ జిల్లాలో

# భారీ సైబర్ మోసం

రూ.152 కోట్లు కొల్లగొట్టిన నేరగాళ్లు

9 మంది అరెస్టు, బ్యాంకు అధికారుల పాత్రపై విచారణ



**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లాలో మరో భారీ సైబర్ మోసం వెలుగు చూసింది. గడచిన ఏడాది కాలంగా ఈ జిల్లాలో మ్యూల్ ఖాతాల సహకారంతో విదేశాలలో వుండే బడా సైబర్ నేరగాళ్ల పదుల కోట్ల రూపాయలను కొల్లగొట్టడం తెలిసిందే. వీరికి సహకరించిన మ్యూల్ ఖాతాదారులను పోలీసులు అరెస్టు చేయడం విదితమే. తాజాగా ఇటువంటిదే మరో గోల్‌మాల్ బాగోతం రట్టయ్యింది. కేవలం మూడు నెలల వ్యవధిలో తొమ్మిది మ్యూల్ ఖాతాల ద్వారా 152 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్ల కాజేశారు. >>2

## కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు 22కు వాయిదా



**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** కాళేశ్వరం కమీషన్ నివేదికపై హైకోర్టులో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు, ఐఎఎస్ అధికారి స్మిత, మాజీ సిఎస్ ఎస్‌కె జోషి వేసిన వాజ్యంపై తీర్పును ఈనెల 22కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని భాగమైన మేడిగడ్డ పిల్లరు కుంగిపోవడం, అన్నారం సుందిళ్ళబ్యారేజిలో లోపాలు తలెత్తడంతో రిటైర్డు జస్టిస్ పిసిఘోష్‌తో ఒక కమిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసి విచారణ జరిపిoది. జస్టిస్ పిసి కమీషన్ నివేదిక రాజకీయ దురుద్దేశ్యంతో అవాస్తవంగా రూపొందించారని దానిని కొట్టివేయాలని కెసిఆర్, హరీష్ రావు, ఐఎఎస్ అధికారి స్మిత మాజీ సిఎస్ ఎస్‌కె జోషిలు హైకోర్టును ఆశ్రయించారు. కెసిఆర్ అడ్వకేట్ న్యాయమూర్తి ముందు తన వాదన వినిపిస్తూ కమిషన్ ఆఫ్ ఎక్వైరీ చట్టంను నిబంధనలు >>2

# కారెక్కనున్న జీవన్‌రెడ్డి

కెసిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరేందుకు ముహూర్తం ఫిక్స్

నేడు మాజీ మంత్రి ఇంటికి కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్8:** ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు ఆ పార్టీ >>2



న్యూఢిల్లీలోని కర్తవ్యభవన్‌లో బుధవారం కేంద్ర పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం (డిఓఎస్ఇఎల్) ప్రత్యేక అవసరాలున్న చిన్న పిల్లలకోసం కెరీర్ కార్డ్స్ విడుదలచేస్తున్న పాఠశాల విద్య కార్యదర్శి సంజయ్‌కుమార్. ఇతర అధికారులు

# నాదర్‌గుల్ భూముల్లో వాటా దక్కలేదనే నాపై నిందలు

>> భూఅక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు చూసి జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. దేవాలయం వంటి శాసనసభలో బీఆర్ఎస్ నేతలు ఎలా ప్రవర్తించారో ప్రజలు గమనించారని, ఒక్క ఆధారం చూపకుండానే వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సన్నబియ్యం పథకంపై ప్రజల స్పందన చూసి దాని మీద కూడా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హ్యామ్ రోడ్ల నిర్మాణం పూర్తయితే బీఆర్ఎస్ ఉనికి పోతుందని కోమటిరెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని, గతంలో వారికి అంటిన బురదను ప్రస్తుత మంత్రులందరికి రుద్దాలని చూస్తున్నారని అన్నారు. ఏ పాలసీ తెచ్చినా ప్రజలందరికీ సమాన న్యాయం జరిగేలా రూపొందించామని తెలిపారు. బిఆర్ఎస్ నేతల తాటాకు చప్పుళ్లకు ప్రజా ప్రభుత్వం భయపడదు, మీ పదేండ్ల అక్రమ ఆస్తుల చిట్టాలు త్వరలో బయటకు వస్తాయన్నారు. కల్వకుంట్ల కవిత చేసిన అభియోగాలకు అబద్దాలరావు సమాధానం చెప్పాలని. ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో బిఆర్ఎస్ నేతలు ఉన్నారని పేర్కొన్నారు. 2014 నుంచి మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో కోట్లాది విలువైన గ్రానైట్ సంపదను విదేశాలకు దోచుకుపోయారని,సిబిసిఐడి వాటికి సంబంధించిన అన్ని నిజాలు త్వరలో తెలుస్తాయన్నారు. అధికారంలోకి రాకముందు కల్వకుంట్ల కుటుంబం,హరీశ్‌రావు ఆస్తులు ఎన్ని? పదేళ్ల మీకు అక్రమంగా సంపాదించిన ఆస్తులు ఎన్నో చెప్పాలన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ మోచేతి నీళ్ల తాగినోళ్ల కెసిఆర్.కెటిఆర్,హరీశ్‌రావు... పార్టీ ఫండ్ కింద కోటీ రూపాయలు తీసుకుంది మరిచిపోయరా డ్రామారావు, అబద్దాలరావు అని పొంగులేటి విమర్శలు చేశారు. మీడియా సమావేశంలో ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్,చామల కిరణ్‌కుమార్‌రెడ్డి,ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్,సామేల్,బి.లక్ష్మారెడ్డి, శ్రీగణేష్, రాంమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కారెక్కనున్న జీవన్‌రెడ్డి

>> అగ్రనాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించేందుకు గురువారం మధ్యాహ్నం జగిత్యాలకు కేటీఆర్ చేరుకోనున్నారు. గురువారం మధ్యాహ్నం 2.00 గంటలకు జీవన్ రెడ్డి నివాసానికి కేటీఆర్ వెళ్తారు. ఈ సందర్భంగా ఆయనతో కేటీఆర్ సమావేశం అవుతారు. బీఆర్ఎస్ పార్టీలోకి జీవన్ రెడ్డిని కేటీఆర్ ఆహ్వానిస్తారు. కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తోపాటు పార్టీకి చెందిన పలువురు నేతలు ఈ సమావేశంలో పాల్గొనున్నారు.

సీనియర్ నాయకుడినైన తనను అధికార కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం చేస్తుందని జీవన్ రెడ్డి పలుమార్లు ఆరోపించారు. అంతేకాకుండా.. జగిత్యాలలో తనపై గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌ను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకున్నారు. ఈ సమయంలో జీవన్ రెడ్డిని సైతం కాంగ్రెస్ పార్టీ నాయకులు పక్కన పెట్టారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సంజయ్ వర్గానికి చెందిన అభ్యర్థికి చైర్మన్ పదవి కట్టబెట్టారు.

జీవన్ రెడ్డి వర్గానికి చెందిన నేతకు మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కేటాయించారు. అలాగే పార్టీలో సీనియర్ అయిన తనకు పీసీసీ పదవి కూడా కేటాయించకపోవడం పట్ల జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అందుకే ఆయన ఆ పార్టీ వీడారని తెలుస్తోంది. అయితే జగిత్యాల ప్రాంతాల్లో జీవన్ రెడ్డి బలమైన నేతగా కొనసాగుతున్నారు. ఆయన్ని పార్టీలోకి తీసుకోవడం ద్వారా జిల్లాలో మళ్లీ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని బిఆర్ఎస్ పార్టీ నేతలు భావిస్తున్నారు. కాగా మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సమక్షంలో చేరేందుకు కెటిఆర్ ముహూర్తం ఫిక్స్ చేయనున్నారు. ఈనెల 13న కెసిఆర్ సమక్షంలో జీవన్‌రెడ్డి గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉంది.

ఇప్పటికే ఎమ్మెల్యే సంజయ్ బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్‌లో ఉన్న జీవన్‌రెడ్డి బిఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. దీంతో జగిత్యాల రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి.

# జనగణన సులువు

>> కాగితాలతో పనిలేకుండా డిజిటల్ సాధనాలతో నిర్వహించడం, పౌరులకు స్వీయ ఎన్యూమరేషన్ అవకాశాన్ని కల్పించడం ద్వారా జనగణన దిగ్విజయవంతం అవుతుందని అన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ప్రజలు స్వీయ ఎన్యూమరేషన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను సమర్పించేందుకు ముందుకు వస్తుండటం సంతోషదాయకమని చెప్పారు.

ప్రతి ఒక్కరూ అధికారిక పోర్టల్‌ను సందర్శించి స్వీయఎన్యూమరేషన్ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

# హరీష్ రావు వనపర్తి సభకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్8:** మాజీ మంత్రి,బిఆరెసెల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు వనపర్తి సభకు రాష్ట్ర హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సభకు అనుమతి నిరాకరిస్తూ జిల్లా ఎస్పి ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. గురువారం నియోజకవర్గంలో హరీశ్ రావు సభ నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. వనపర్తి జిల్లాలోని గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత కొంతకాలంగా రైతులు ఆందోళనలు చేస్తున్నారు. నిర్వాసిత రైతులకు సంఘీభావం తెలిపేందుకు, వారి సమస్యలపై పోరాడేందుకు హరీశ్ రావు వనపర్తి పర్యటనకు సిద్ధమయ్యారు. దీని కోసం ముందుగా అనుమతులు తీసుకున్నప్పటికీ చివరి నిమిషంలో శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందంటూ జిల్లా ఎస్పి అనుమతులను రద్దు చేశారు. ఈ క్రమంలో అనుమతి నిరాకరణను సవాల్ చేస్తూ హరీష్ రావు హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని ఆయన తరపు న్యాయవాదులు వాదించారు. వాదనలు విన్న హైకోర్టు పోలీసుల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ సభ నిర్వహణకు అనుమతి ఇచ్చింది. అయితే, నిబంధనల ప్రకారం శాంతియుతంగా సభ నిర్వహించుకోవాలని సూచించింది.

# కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు 22కు వాయిదా

>> ఉల్లంఘించి నివేదిక తయారించారని తెలిపారు. సాక్షితో కలిపి ఎక్కడ కూడా క్రాస్‌ఎగ్జామిన్ చేయలేదని 8(బి)8(సి) నోటిసులు ఇవ్వలేదని అడ్వకేట్ న్యాయమూర్తికి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని ఏలాంటి విచారణ చేయకుండానే ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావడంకూడా రాజకీయ కక్షసాధింపులో భాగం అని అడ్వకేట్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రజా ప్రయోజనాలు కాపాడటానికి మాత్రమే జస్టిస్ పిసిఘోష్‌తో కమిషన్ వేశామని తెలిపారు. మార్చి 12న వాదనలు పూర్తికావడంతో హైకోర్టు తీర్పున రిజర్వుచేసింది. బుధవారం తీర్పు చెబుతారని ఆసక్తిగా రాష్ట్ర ప్రజలు ఎదురు చూశారు కానీ జడ్జీ మాత్రం తీర్పును ఏప్రిల్ 22కు వాయిదా వేశారు. తెలంగాణలో అధికార మార్పుకు కారణమైన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజి కుంగుబాట ఇతర బ్యారేజిలలో జరిగిన అవినీతిపై పిసిఘోష్‌తో కమీషన్ వేయడం రాష్ట్రంలోనే సంచలనం రేపింది.

# థియేటర్లపై వినోదపు పన్ను

>> చేయనువతా. అందులో భాగంగానే డేటా సేకరణ, వినోదపు పన్ను విధించడానికి సాధ్యాధ్యాలను పరిశీలించడానికి ఇప్పటకే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. అయితే గతంలో టికెట్ల ఆధారంగా థియేటర్ల నుంచి వినోదపు పన్ను వసూలు చేశారు. కాగా, రాష్ట్రంలో 450 నుండి 570 వరకు సినిమా థియేటర్లు (సింగిల్ స్క్రీన్లు, మల్టీప్లెక్స్‌లు) ఉన్నట్లు అంచనా. అయితే థియేటర్ల నిర్వహణ ఖర్చులు, తక్కువ ప్రేక్షకుల ఆదరణ కారణంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు తగ్గుముఖం పడుతున్నాయి. కరోనా తర్వాత థియేటర్లకు ఆదరణ, చిన్న సినిమాల వసూళ్ల తగ్గడం వల్ల థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితుల్లో మళ్లీ వినోదపు పన్ను వసూలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో థియేటర్లపై మరింత భారం అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## వారం - వర్జ్యం

09-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
సప్తమి రా. 9.18
మూల ఉ. 8.47
వర్జ్యం : ఉ.7.01-ఉ.8.49
దు.ఉ.10.04-ఉ.10.54, 2)మ.3.03-మ.3.53
శుభసమయం : ఉ.9.30-10.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. కోర్టు వ్యవహారాలు సానుకూల పడతాయి.

**వృషభం:** అందరిలోనూ ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. భూములు, స్థలాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగస్తులకు అనుకూలం.

**మిథునం:** జీవిత భాగస్వామితో సఖ్యత చాలా విషయాలను ప్రభావితం చేస్తుంది. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం:** రాజకీయ, పారిశ్రామిక వర్గాల వారికి అన్నివిధాలా ప్రోత్సాహం లభిస్తుంది. స్వల్ప ధనలాభం కలుగుతుంది.

**సింహం:** ఆస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. మానసిక ప్రశాంతత పొందుతారు. సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**కన్య :** వాయిదా పడుతున్న విషయములు పరిష్కారదశకు వస్తాయి. వ్యవహారాలు సాఫీగా పూర్తిచేస్తారు. వాహనసౌఖ్యం.

**తుల :** విద్యా, వైజ్ఞానిక విషయములలో సంతాన విద్యా విషయాలలో కొద్దిపాటి క్రమశిక్షణ అవసరం. బంధువుల కలయిక.

**వృశ్చికం:** నిర్మాణాత్మక సంబంధమైన పనులకు అనుకూల కాలము. భూ వివాదాలు పరిష్కారమవుతాయి. వస్త్రలాభం.

**ధనుస్సు:** కుటుంబ సంబంధిత వ్యవ హారాలలో ఇతరుల జోక్యంవలన కొద్దిపాటి భేదాభిప్రాయాలు రావచ్చు. జాగ్రత్త వహించండి.

**మకరం:** జాయింట్ వ్యవహారములు, కాంట్రాక్టులు మొదలైన వాటి సంబంధిత వ్యవహారములను వాయిదా వేయవద్దు.

**కుంభం:** మానసిక ప్రశాంతత, మనోధైర్యం ఏర్పడుతుంది. వ్యాపారాభివృద్ధి మధ్యస్థంగా ఉంటుంది. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** ఉపయుక్తం లేని కబుర్లు, సంభాషణలు కాలహరణానికి కారణమవుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇస్లామాబాద్ వేదికగా రేపు చర్చలు

>> పాయింట్ల ప్రతిపాదనకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అటు ఇజ్రాయెల్ కూడా కాల్పుల విరమణ ఒప్పందానికి ఒకే చెప్పింది.

ఇక ప్రస్తుతం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్ అమెరికా మధ్య రెండో దశ శాంతి చర్చలు జరుగనున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెరదించే దిశగా అడుగులు పడుతున్నాయి. దశాబ్దాల వైరం, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అమెరికా, ఇరాన్ చర్చలకు రావడం ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏప్రిల్ 10న ఇస్లామాబాద్ వేదికగా శాంతి చర్చలు జరుగనున్నాయి. ఈ భేటీ యుద్ధ మేఘాలు కమ్ముకున్న మధ్యప్రాచ్యంలో శాంతి కిరణంలా కనిపిస్తోంది.

దశాబ్దాలుగా ఉప్పు నిప్పులా ఉన్న అమెరికా, ఇరాన్ దేశాలు ఇప్పుడు ఒకే టేబుల్‌పై కూర్చుని చర్చలు జరపాలని నిర్ణయించుకోవడం అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక అతిపెద్ద మలుపు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాన్ని శాశ్వతంగా ముగించడమే లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది.

ఇస్లామాబాద్ వేదికగా జరగనున్న ఈ చర్చలు కేవలం రెండు దేశాల మధ్య సంబంధాలకే పరిమితం కాకుండా, మొత్తం గల్ఫ్ ప్రాంతంలో సుస్థిరతను తీసుకువస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖాముఖి చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలనే సంకల్పం యుద్ధం వల్ల నష్టపోతున్న దేశాలకు పెద్ద ఊరట.

ఈ చర్చల కోసం అమెరికా తన అత్యంత కీలకమైన అనుభవజ్ఞులైన బృందాన్ని రంగంలోకి దించింది. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, స్టీవ్ విట్కాఫ్, గతంలో మధ్యప్రాచ్య శాంతి ఒప్పందాల్లో కీలక పాత్ర పోషించిన జారెడ్ కుష్నర్ పాల్గొంటున్నారు. కుష్నర్ వంటి వ్యూహకర్తలు ఉండటం వల్ల, కేవలం కాల్పుల విరమణ మాత్రమే కాకుండా ఆర్థిక, దౌత్యపరమైన దీర్ఘకాలిక ఒప్పందాలపై కూడా అమెరికా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ బృందం ఇరాన్‌తో ఉన్న అగాధాన్ని పూడ్చేందుకు పక్కా ప్రణాళికతతో సిద్ధమైంది.

మరోవైపు ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘేర్ ఖాలీబాఫ్ నేతృత్వంలో ఈ చర్చలకు హాజరవుతోంది. అంతర్జాతీయ ఒప్పందాలపై పట్టున్న బాఘేర్, ఇరాన్ ప్రయోజనాలను కాపాడుతూనే ప్రాంతీయ శాంతికి ఎలా మొగ్గు చూపుతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పశ్చిమాసియాలో ఇరాన్ ప్రభావం దృష్ట్యా, ఆ దేశం తీసుకునే నిర్ణయాలు యుద్ధం ముగింపులో కీలక పాత్ర పోషిస్తాయి. ఆంక్షల సడలింపు, తమ దేశ భద్రత వంటి అంశాలను ఇరాన్ ప్రధానంగా చర్చకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

ఈ చర్చలు ఏప్రిల్ 10న ప్రారంభమై సుమారు రెండు వారాలపాటు కొనసాగే అవకాశం ఉందని సమాచారం. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలు సంక్లిష్టమైనవి కావడంతో ప్రతి అంశాన్ని కూలంకషంగా చర్చించి ఒక నిర్ణయానికి రావాలని భావిస్తున్నారు.

ఈ 14 రోజులు పశ్చిమాసియా భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. ఒక వేళ ఈ చర్చలు సఫలమైతే, అది ఆధునిక చరిత్రలో ఒక అతిపెద్ద దౌత్య విజయంగా నిలిచిపోతుంది.

యుద్ధం కారణంగా అతలాకుతలమవుతున్న సాధారణ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ ఇస్లామాబాద్ వైపు ఆశగా చూస్తున్నాయి.

యుద్ధం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, చమురు ధరలు, రవాణా మార్గాలు దెబ్బతింటున్న తరుణంలో ఈ చర్చలు విజయం అందరికీ అవసరం. ఇస్లామాబాద్‌లో జరిగే ఈ 'శాంతి మంత్రం' ఫలించి, పశ్చిమాసియాలో తుపాకుల మోత ఆగిపోవాలని మానవతావాదులు కోరుకుంటున్నారు. ఈ భేటీ విజయవంతమైతే, అది కేవలం రెండు దేశాల విజయం మాత్రమే కాదు. ప్రపంచ శాంతికి దక్కే గౌరవం అవుతుంది.

# 2 నెలలు కీలకం.. తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండకూడదు

## పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై మంత్రి సీతక్క సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్8:** వేసవి నేపథ్యంలో వచ్చే రెండు, మూడు నెలలు అత్యంత కీలకమని, ఈ సమయంలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ జల సరఫరా శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా అవసరానికి తగ్గట్టుగా వినియోగించేలా అవగాహన పెంచాలని సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం అమలు, ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టం అమలు అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, డైరెక్టర్ దివ్య దేవరాజన్, ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రాష్ట్రంలోని రిజర్వాయర్లలో తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు వివరించారు. కృష్ణా, గోదావరి బేసిన్ల నుంచి నీటి కేటాయింపులు కొనసాగుతున్నందున ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులు లేవని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సింగూర్, శ్రీశైలం వంటి జలాశయాల్లో తాగునీటి నిల్వలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ప్రతి రోజు నీటి సరఫరా పరిస్థితిపై నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడైనా సోర్స్ పాయింట్లలో కొరత తలెత్తితే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్ లీకేజీలు, సరఫరా లోపాలను త్వరితగతిన సరిదిద్దాలని సూచించారు. 1916 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా అందుతున్న ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించాలని, ప్రజల్లో ఈ సేవపై మరింత అవగాహన కల్పించాలని చెప్పారు. నీటి మౌలిక వసతులపై సమగ్ర డేటాను సేకరించి, భవిష్యత్ ప్రణాళికలకు ఉపయోగపడే విధంగా రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు.వేసవి ప్రత్యేక చర్యల్లో భాగంగా హ్యాండ్‌పంపులు, మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టడం, గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.ఉపాధి హామీ పథకంపై సమీక్షిస్తూ, అటవి, దూర ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల వల్ల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు కష్టంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. ఈ నిబంధనలను సడలించాల్సిందిగా కేంద్రానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. గత మూడు నెలలుగా వేతనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో పెండింగ్ చెల్లింపులను తక్షణమే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఉపాధి కల్పనలో దేశంలో రెండో స్థానంలో ఉండటం గర్వకారణమని, రోజుకు మూడు లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. పనిదినాలను పెంచేందుకు రోజువారీ సమీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టం అమలుపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు.



న్యూఢిల్లీలో బుధవారం సిక్కిం సిఎం ప్రేమ్‌సింగ్ తమాంగ్ ప్రధాని మోడీని మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం

# ఎయిర్‌పోర్టుకు మూడు నెలల్లో శంకుస్థాపన

>> మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి కేంద్రం ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్ ఉన్నందని వెల్లడించారు ఆ స్థలంలో నూతన విమానాశ్రయం కట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉందని, ఈ విషయంలో రక్షణ మంత్రి రాజ్ నాథ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి చర్చించామని తెలిపారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందన వచ్చిఇందన్నారు. మరో కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి కీలకమైన సమావేశం జరిగిందని తెలిపారు. ఎప్పటినుంచో తెలంగాణలో ఒకే విమానాశ్రయం ఉంది. కేవలం హైదరాబాద్ ఒక్కటే ఉందని, మిగిలిన ప్రాంతాల్లోనూ విమానాశ్రయాలుండాలనేది తెలంగాణ ప్రజల ఆకాంక్ష అన్నారు. దీనికి తగ్గట్లుగానే ఫీజిబిలిటీకి తగ్గట్లుగా విమానాశ్రయాలు నిర్మించాలనేది ప్రధానమంత్రి ఆలోచన అన్నారు. అందులో భాగంగా వరంగల్‌లో విమానాశ్రయానికి అడుగులు ముందుకు వేస్తున్నామని తెలిపారు. మరో మూడు నెలల్లో దీనికి ఫౌండేషన్ వేయబోతున్నామని వెల్లడించారు. తెలంగాణకు ముఖద్వారమైన ఆదిలాబాద్‌లోనూ పర్యాటకానికి, వివిధ వాణిజ్య కార్యక్రమాలను ప్రోత్సహించేలా విమానాశ్రయం రావాలని చిరకాల డిమాండ్ అని, ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో నిరంతరం చర్చిస్తూ వివిధ ఫీజిబుల్ ప్రాంతాల్లో విమానాశ్రయాల నిర్మాణంపై దృష్టిసారించాం తెలిపారు. అందులో భాగంగా ఆదిలాబాద్‌లో 360 ఎకరాలకు సంబంధించిన డిఫెన్స్ స్థలంలో విమానాశ్రయం నిర్మించాలనుకున్నాం అన్నారు. గత యేడాది కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో డిఫెన్స్ మినిస్టర్‌ని కలిశామని తెలిపారు. దీనికి డిఫెన్స్ మినిస్ట్రీ అంగీకారం తెలిపిందన్నారు. ఈ స్థలంలో ప్రజానీకం కోసం విమానాశ్రయానికి అంగీకారం తెలిపిందన్నారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయానికి అదనంగా మరో 450 ఎకరాల స్థలం అవసరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి భూసేకరణ డిమాండ్ ఇచ్చామని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని తెలిపారు. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలియజేశారని, విమానాశ్రయానికి సంబంధించి కీలకమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మొదట దీన్ని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించాలని అనుకున్నాం. కానీ డిఫెన్స్ మినిస్ట్రీకి వ్యూహాత్మకమైన ప్రాంతం కావడం, వైమానిక దళం ట్రైనింగ్‌కు కీలకమైన ప్రాంతం కావడంతో ఈ విమానాశ్రయాన్ని డిఫెన్స్ మినిస్ట్రీ నిర్మించాలని నిర్ణయించింది. దీంట్లో ఒక పక్కన సామాన్య ప్రజలకోసం విమానసేవల టర్మినల్‌ను ఎయిర్ పోర్ట్ అథారిటీ నిర్మించనుందని తెలిపారు. సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ, డిఫెన్స్ మినిస్ట్రీ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఏప్రిల్ 17 నాడు క్షేత్రస్థాయిలో ఓఎల్ఎస్ సర్వే చేసిన తర్వాత రన్ వే ఓరియంటేషన్‌పై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ ఫీల్డ్ విజిట్ తర్వాత డిఫెన్స్ తర్వాత మాస్టర్ ప్లాన్‌కు అంగీకారం తెలియజేస్తారన్నారు. ఆ తర్వాత ఫౌండేషన్‌కు ప్లాన్ చేస్తామని, ఇందుకు అవసరమైన 450 ఎకరాల స్థలాన్ని అప్పజెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అన్నారు. దీనికి సంబంధించిన సమాచారం ఇచ్చామని, వారు దానికి అంగీకారం తెలిపారన్నారు. చాలా సానుకూలంగా మీటింగ్ జరిగింది వీలైనంత త్వరగా ఈ విమానాశ్రయానికి భూమిపూజ చేసుకుంటామన్నారు. అని శాఖలు కలిసి సమావేశమైనప్పుడే ఏమైనా చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని, అందులో భాగంగానే ఈ సమావేశంలో సానుకూలంగా ఫలితం వచ్చిందన్నారు. భూసేకరణలో ఎలాంటి సమస్యలు లేవని ఎంపి నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ చెప్పారన్నారు. ఆదిలాబాద్ చాలా ఐడియల్ లొకేషన్ భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉన్న ప్రాంతం ఇది అన్నారు. ఒక కమర్షియల్ హబ్‌గా అభివృద్ధి అయ్యే అవకాశం ఉందన్నారు. జేవర్ విమానాశ్రయం యూపి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో చేసుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం డెవలప్ చేయాలంటే రాష్ట్రం భూమిని మాకు అప్పగించాలని, ఆదిలాబాద్ విషయంలో డిఫెన్స్‌కు భూమి ఉంది. కాబట్టి దాన్ని రక్షణ శాఖకు అప్పగిస్తే వారు నిర్మించి అక్కడ సివిల్ ఆపరేషన్స్‌కు అవకాశం ఇస్తారన్నారు. ఇలాంటి 36 విమానాశ్రయాలు దేశవ్యాప్తంగా ఉన్నాయి. పెద్దపల్లిలో ఒక సైట్‌ను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిందని, మా ఫీజిబిలిటీ రిపోర్టులోనూ అనుకూలంగా వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక సమాధానం వచ్చిన తర్వాత ముందుకెళ్తామన్నారు. విమానాశ్రయానికి 600 నుంచి 700 ఎకరాలు అవసరం అన్నారు.

# భారీ సైబర్ మోసం

>> జిల్లాలోని కర్నాటక బ్యాంకులో కరెంటు ఖా తాలు తెరిచిన తొమ్మిది మంది చిరు వ్యాపారులు, దినసరి కూలీలు వీటిని కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు ఇచ్చారని పోలీసుల విచారణలో తేలిం ది. ఈ ఖాతాల ద్వారా విదేశాల్లో వుండే బడా సైబర్ నేరగాళ్లు భారత్‌లో అమాయకుల నుంచి మోసం ద్వారా కాజేసిన నగదును తమ దేశాలకు మ ళ్లించినట్లు పోలీసులు తేల్చారు. ఈ కేసులో మ్యూల్ ఖాతాలు అందించిన తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. వీరి వెనుక వున్న వారి కోసం, ఎంతకాలంగా వీరు ఈ దందా సాగిస్తున్నదనే దానిపై ఆరా తీస్తున్నారు. దీంతో పాటు ఈ గోల్‌మాల్‌లో కర్నాటక బ్యాంకు అధి కారుల పాత్రపైనా ఆరోపణలు వస్తుండడంతో దీనిపైనా విచారిస్తున్నారు. ఈ కేసులో ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడయ్యే వీలుంది.

# రాష్ట్రంలో 2027 జనగణనకు సర్వం సిద్ధం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్8:** తెలంగాణలో జనగణన 2027కు ప్రభుత్వం సిద్ధమైంది. హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సర్వే మే 11 నుంచి జూన్ 9 వరకు అదే విధంగా ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ అవకాశం కల్పిస్తారు. ప్రజలు తమ వివరాలను ముందుగానే ఆన్‌లైన్ లో నమోదు చేసుకునే సౌకర్యం ఉంది. జనగణనలో పూర్తి సహకారం అందించాలని ప్రజలకు ప్రభుత్వ విజ్ఞప్తి చేసింది. సెన్సస్ చట్టం ప్రకారం సమాచారం ఇవ్వడం తప్పనిసరి, తప్పుడు సమాచారం ఇస్తే జరిమానా/శిక్షలు, సెన్సస్ అధికారులకు అడ్డంకులు కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొంది. ఇళ్లలోకి ప్రవేశానికి అనుమతి ఇవ్వాలని, గుర్తులు/నంబర్లు వేయడానికి సహకారం అవసరం అని వెల్లడించింది. పాలసీ నిర్ణయా లు, అభివృద్ధి కోసం కీలకమైనది సెన్సస్ డేటాగా పేర్కొంది. సెన్సస్ సమాచారం గోప్యం, కోర్టుల్లో కూడా ఉపయోగించరాదని వెల్లడించింది. అన్ని శాఖలు, కలెక్టర్లు, మున్సిపల్ సంస్థలకు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

# అసోం సిఎం ఫిర్యాదు...

## హైకోర్టును బెయిల్ కోరిన పవన్ ఖేరా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్8:** తన భార్యకు విదేశాల్లో ఆస్తులు ఉన్నాయని,వాటిని ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపర్చలేదన్న కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఆరోపణలపై అస్సాం సిఎం హిమంత బిశ్వశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో తనకు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయల్ ఇవ్వాలని ఖేరా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఎఫ్ఐఆర్ నమోదైన రాష్ట్రంలోని పోలీసులు అరెస్ట్ చేయకుండా కాపాడేది ఈ బెయిల్ , ఆ తర్వాత ఆయన సంబంధిత రాష్ట్రంలోని కోర్టును ఆశ్రయించేందుకు వీలు కలుగుతుంది.

# విద్యుత్ సరఫరా సంస్థ విలీనంపై హైకోర్టును ఆశ్రయించిన పాలకవర్గం

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే ఏకైక సిరిసిల్లా సహకార విద్యుత్తు సరఫరా సంస్థను కాపాడుకునేందుకు పాలకవర్గం హైకోర్టును ఆశ్రయించింది. తమ విద్యుత్ సరఫరా సంస్థ 56 ఏండ్లుగా సేవలందిస్తున్నదని, దాన్ని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) విలీనం చేసుకోవడంలో భాగంగా తమ సంస్థను స్వాధీనం చేసుకుందని పాలకవర్గం పిటీషన్ దాఖలు చేసింది. 2025 డిసెంబర్‌లోనే తాము తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలికి సహకార విద్యుత్ సరఫరా సంస్థకు సంబంధించిన లైసెన్స్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నామని తెలిపింది. ఈ నేపథ్యంలో తమ సంస్థను గత నెల మార్చి 31 లోపు రెన్యువల్ చేయాల్సి ఉండగా, నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉంచిందని పాలక వర్గం పేర్కొన్నది. ఇదే సమయంలో తమకు సమాచారం ఇవ్వకుండా ఈ నెల 1న రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు తమ విద్యుత్ పంపిణీ సంస్థను ఆధీనంలోకి తీసుకున్నట్టు ప్రకటించిందని, ఇది నిబంధనలకు విరుద్ధమని పాలకవర్గం ధర్మాసనానికి విన్నవించింది. దీనిపై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రేణుక ఎదుట సహకార విద్యుత్ పంపిణీ సంస్థ తరఫున మాజీ అడిషనల్ అడ్వొకేట్ జనరల్ రాంచందర్‌రావు, న్యాయవాదులు వాదనలు వినిపించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం లైసెన్స్‌లు ఇవ్వాలని కోర్టు డైరెక్షన్ ఇవ్వదని పేర్కొంది.

# ఇక కరెంట్ బిల్లు సూపర్ స్మార్ట్

## మొబైల్ నుంచే జెట్ స్పీడ్‌లో ప్రాసెస్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కరెంట్ బిల్లు జారీలో మరింత వేగం పెరిగింది. ఇప్పటివరకు స్పాట్ యంత్రాల ద్వారా బిల్లు అందించేవారు. కానీ ఇక నుంచి స్మార్ట్‌ఫోన్ ద్వారానే కరెంట్ బిల్లు జరీ చేయవచ్చు. సెకన్లలోనే సింపుల్‌గా పని పూర్తవుతుంది. విద్యుత్ శాఖ సిబ్బందికి కూడా శ్రమ తప్పుతుంది. విద్యుత్ శాఖ అధికారవర్గాల వివరాల ప్రకారం ఇప్పటివరకు మీటర్ రీడింగ్ చెక్ చేసి కరెంట్ బిల్లు ఇవ్వాలంటే సిబ్బంది స్పాట్ బిల్లింగ్ యంత్రాలు ఉపయోగించేవారు. మీటర్ దగ్గర వాటిని ఉంచగానే అవి రీడింగ్ నమోదు చేసి బిల్లును జనరేట్ చేసేవి. ఈ మెషిన్లలో ప్రింటర్ ఉండటం వల్ల బరువు ఎక్కువగా ఉంటుంది. బిల్లు రావడానికి కాస్త ఎక్కువ టైమ్ పట్టడం వల్ల ప్రతీ మీటర్ వద్ద ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తుంది.



# హైదరాబాద్‌లో సి130జె సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్

## సిఎం రేవంత్‌రెడ్డితో టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఎయిరోస్ట్రక్చర్స్ ఎండి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 8:** హైదరాబాద్‌లో సీ130జే సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఏర్పాటు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ముందుకొచ్చింది. ఇప్పటికే ఆదిభట్లలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌తో కలిసి విమానాల విడిభాగాలు రూపొందిస్తోంది. బుధవారం టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఎయిరోస్ట్రక్చర్స్ సీఈవో, ఎండీ టిమ్ రిఫెల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో సమావేశమయ్యారు. అంతర్జాతీయ అవసరాల కోసం భారత దేశంలో లారఖహీడ్ మార్టిన్ సంస్థ, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో కలిసి సంయుక్తంగా ఎఫ్-16 వింగ్స్ ఉత్పత్తి చేసేందుకు టీఏఎస్ఎల్‌తో ఒప్పందం కుదిరిందని తెలిపారు. రక్షణ రంగంలో ఎయిర్‌క్రాఫ్ట్ ఎంఆర్‌వో ఫెసిలిటీతో పాటు ఇతర డిఫెన్స్ హబ్‌గా విస్తరిస్తున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని టిమ్ రిఫెల్ సీఎంకు వివరించారు.

# రోహిత్‌రెడ్డి సహా ముగ్గురు నిందితులకు మళ్లీ రెండు రోజుల కస్టడీ

## మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారం, ఈ సందర్భంగా పోలీసులపై జరిగిన కాల్పుల ఘటనలో అరెస్టయిన మాజీ ఎంఎల్ఏ రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ రియల్టర్ నమిత్ శర్మలను మూడవ దఫాగా రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి రాజేంద్రనగర్ కోర్టు బుధవారం అనుమతించింది. దీనిపై మంగళవారం నాడు వాదనలు ముగియడం తెలిసిందే. వీరిని ఐదు ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని చేవెళ్ల పోలీసులు కోరగా డిఫెన్స్ న్యాయవాది దీనిని వ్యతిరేకించి తన క్లయింట్లకు వెంటనే బెయిల్ మంజూరు చేయాలని కోరడం విదితమే. ఈ కేసులో ముగ్గురి బెయిల్ పిటిషన్లు మంగళవారమే డిస్మిస్ కాగా వీరిని పోలీసులు కోరినట్లుగా ఐదు రోజులు కాకుండా రెండు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. ముగ్గురు నిందితులను ఇప్పటికే రెండు దఫాలు మూడేసి రోజుల పాటు చేవెళ్ల పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించడం తెలిసిందే. మూడవ దఫాగా గురువారం నాడు చంచల్‌గూడ జైలు నుంచి తిరిగి కస్టడీలోకి తీసుకోనున్నారు. వీరిని శనివారం నాడు తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించనున్నారు.



# సమాజమే నా కుటుంబం

## ప్రజల సమస్యల కోసం ఉద్యమిస్తా

## దుబ్బయ్య, అంజయ్య నా గురువులు

## మావోయిస్టు మాజీ కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ

**కోరుట్ల, ప్రభాతవార్త :** సమాజమే తన కుటుంబమని ఏ ఒక్క కుటుంబ సభ్యునికి సమస్య వచ్చిన అండగా నిలుస్తానని మావోయిస్టు మాజీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి తిప్పిన తిరుపతి అలియాస్ దేవ్ జి అన్నారు. 43 సంవత్సరాల ఉద్యమం తర్వాత లొంగిపోయిన మొదటిసారిగా కోరుట్ల పట్టణానికి రావడంతో ప్రజలు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. తిరుపతి తన సొంత ఇంటికి చేరుకోగానే కుటుంబ సభ్యులు హారతి ఇచ్చి ఇంటి లోనికి ఆహ్వానించారు. ఇంటిలోకి వెళ్లిన తిరుపతి తాను చదువుకునే గదిని పరిశీలించి, తన తల్లిదండ్రులు,సోదరుని చిత్రపటాలకు నమస్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు జన్మనిచ్చిన పట్టణం కోరుట్ల అని కుటుంబమని, నా కుటుంబ సభ్యులను కలవాడికి వచ్చానని, కోరుట్లకు రావడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో అంత సమానమేనని సమాజంలో ఎక్కడ సమస్య ఉన్న తాను అండగా నిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తాను పార్టీ వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చానని ప్రజలతో మమేకమై ప్రజల బాగోగులపై తన దృష్టి ఉంటుందన్నారు. కోరుట్ల ప్రజలతో పాటు దేశ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తానని అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.నలభై సంవత్సరాల తర్వాత నా ఇంటికి రావడం చాలా ఆనందంగా ఉందని, నాకు ఇల్లు ఎంత ముఖ్యమో, దేశం కూడా అంతే ముఖ్యమని భావిస్తున్నానని, దేశమంతా నా ఇంటివాళ్లలాగే అనిపిస్తుందన్నారు. తన జీవితంలో ఎన్నో పోరాటాలు ఎదుర్కొని మళ్లీ సాధారణ జీవనంలోకి వచ్చానని తెలిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, బాల్యంలో గడిచిన రోజులు గుర్తుకు వస్తున్నాయని, సమాజంలో ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్లి ప్రజల కోసం పని చేస్తానన్నారు. గత ఆరు నెలల క్రితం లొంగిపోయిన పసుల వసంత అలియాస్ గాంబాల్ అలియాస్ శాంతక్క దేవ్ జీ ని కలిసి పిడికిలి బిగించి నమస్కరించారు. అనంతరం తాను చదువుకునే సమయంలో కోరుట్ల కు చెందిన గురువులు దుబ్బయ్య, అంజయ్య గుర్తు చేసుకున్నారు. దేవ్ జీ రాక సందర్భంగా పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరై ఆయనను అభినందించారు.

# సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యదర్శికి ఎన్ఐఎ నోటీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుకు ఎన్ఐఎ నోటీసులు జారీ చేసింది. అజ్ఞాతంలో వున్న మావోయిస్టులకు సహకరిస్తున్నార నే అభియోగాలతో ఎన్ఐఎ ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీనికి సంబంధించి ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌లోని ఎన్ఐఎ కార్యాలయానికి విచారణకు రావాలని అధికారులు అందులో పేర్కొన్నారు. ఉపా చట్టం కంద కేసులు నమోదు చేసిన వారికి రంగారావు సహకరిస్తున్నారని ఎన్ఐఎ అధికారులు చెబుతున్నారు.

### గుమ్మడి నర్సయ్య ఖండన

కాగా పోటు రంగారావుకు ఎన్ఐఎ నోటీసులు ఇవ్వడంపై మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్య తీవ్రంగా ఖండించారు. తాము ఎలాంటి పోరాటం చేసినా బహిరంగంగానే చేశామని, చాటుమాటు పోరాటం చేయలేదని ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఇదే సమయం లో ఎలాంటి సంఘవిద్రోహక చర్యలకు పాల్పడలేదని, తమపై అక్రమ కేసులు నమోదు చేయడం సరైంది కాదని ఆయన తెలిపారు.

# కంటోన్మెంట్‌లో డబుల్‌బెడ్ ఇళ్ల పంపిణీ

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మారేడ్‌పల్లి, సిల్వర్ కాంపౌండ్ ప్రాంతాలలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల, ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బాలంరాయి లోని క్లాసిక్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు సభనుద్దేశించి మాట్లాడుతూ తమ సొంత స్థలాలను ప్రభుత్వానికి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం ఇచ్చి ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న పేద ప్రజలకు తమ చేతుల మీదుగా ఇళ్ళను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. పేద ప్రజలు ఇంటి పట్టాలు అందుకుంటున్న సమయంలో వారి కళ్ళల్లో ఆనందాన్ని చూశామని, కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని చెప్పారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రితో కంటోన్మెంట్ ప్రాంతంలో ఇళ్ళ నిర్మాణానికి స్థలాల ఇబ్బంది ఉందని, కంటోన్మెంట్ బోర్డు, కేంద్ర ప్రభుత్వాలతో మాట్లాడి స్థలాలను తీసుకుని ఇళ్ళ నిర్మాణం చేపట్టాలని కోరడంతో తానే స్వయంగా కంటోన్మెంట్ బోర్డుకు వచ్చి అధికారులతో మాట్లాడుతానని, పార్టీలకతీతంగా అందరం కేంద్ర ప్రభుత్వంతో కూడా మాట్లాడి కంటోన్మెంట్ స్థలాలను తీసుకుని ఇళ్ళ నిర్మాణం చేస్తామని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల దృష్టిలో కూడా ఈ స్థలాల విషయం ఉందని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పి లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిరాం, హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి, తహసీల్దార్ లు మొహమ్మద్ అసదుల్లా ఖాన్, పాండు నాయక్, బోయిన్ పల్లి మార్కెట్ ఛైర్మన్ ఆనంద్ బాబు గౌడ్, మాజీ ఛైర్మన్ ముప్పిడి గోపాల్, మోండా డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపికలతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీగణేష్

# బేగంపేటలో ట్రైనీపైలట్‌పై అత్యాచారం

## ఫొటోలు, వీడియోలు తీసి బాధిత యువతికి బెదరింపులు

**హైదరాబాద్ (బేగంపేట) ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో ట్రైనీపైలట్‌పై అత్యాచార ఘటన జరిగింది. ఈ విషయాన్ని ఎవరికైనా చెపితే పరువుతీసి కుటుంబ సభ్యులకు, కెరీర్‌కు నష్టం చేస్తానంటూ బెదరించాడు. అతని వేధింపులు అధికం కావడంతో బాధితురాలు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. నగరానికి చెందిన యువతి (20) 2025 జనవరిలో బేగంపేటలోని ఎవియా కాన్స్ పైలట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ నిమిత్తం చేరింది. అక్కడ ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేస్తున్న కేరళం రాష్ట్రం కొట్టాయం పైకోం ప్రాంతనికి చెందిన నసీముద్దీన్ అలియాస్ నసీం(30)తోపాటు సల్మాన్ సలీం(35)తో యువతికి పరిచయం ఏర్పడింది. నసీముద్దీన్‌ను ఆ యువతి సోదరుడిగా, సల్మాన్‌సలీంను తండ్రిగా భావించి సన్నిహితంగా మెలుగుతూ వచ్చింది. ఈ చనువుతోనే బేగంపేట బ్రాహ్మణవాడిలో ఉండే నసీముద్దీన్ వద్దకు తరచూ చదువుకోవడానికి వెళుతుండేది. ఈ క్రమంలోనే గత యేడాది డిసెంబరు 27న సాయంత్రం ఆ యువతి నసీముద్దీన్ వద్దకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో నసీముద్దీన్ మాత్రమే ఉన్నాడు. ఇద్దరూ కొద్దిసేపు చదువు కున్నారు. సాయంత్రం 7.30కు నసీముద్దీన్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ది లీగ్‌లో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌కు వెళ్లి అర్ధరాత్రి తిరిగివచ్చాడు. అప్పటివరకు ఒంటరిగా చదువుకున్న యువతి నసీముద్దీన్ రాగానే తన స్నేహితురాలి వద్దకు వెళ్తానని బయలుదేరింది. ఇక్కడే ఉండమని అంటూ అతను పట్టుబట్టాడు. పైగా తన కుటుంబసభ్యులు తనకు బలవంతంగా పెళ్లి చేసారని, తన భార్య తనను మోసం చేసిందని ఆమె నుంచి తరచూ వేధింపులకు గురవుతున్నానని సదరు యువతికి నమ్మబలికాడు.

నువ్వు ఇక్కడి నుంచి వెళ్లిపోతే నేను ఆత్మహత్య చేసుకుంటానంటూ యువతిని బెద రించాడు. దీంతో కొద్దిసేపు ఆమె అక్కడే ఉండి పోయింది. ఈ సమయంలో తన జీవితం గురించి ఏడుస్తూ నసీముద్దీన్ తలుపు గడియపెట్టి ఆమెను బలవంతంగా కౌగిలించుకున్నాడు. భయపడిన యువతి అక్కడి నుంచి బయటకు వెళ్లిపోవడానికి ప్రయత్నించగా ఆమె అరవకుండా నోరుమూసి ఆమెపై బలవంతంగా లైంగిక దాడి చేసాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే పరువుతీస్తానని, నీ కుటుంబం పరువు కూడా తీస్తానని, నీ కెరీర్‌కు హాని కలిగిస్తానంటూ బెదరించాడు. జరిగిన విషయాన్ని మర్చిపోయి ఏమి జరగనట్లు ఉండాలంటూ హెచ్చరించాడు. అతని బెదరింపులకు భయపడిన యువతి దమ్మాయిగూడాలో ఉండే మరో ఇన్‌స్ట్రక్టర్ సల్మాన్ ఇంటికి వెళ్తుం డేది. ఈ క్రమంలో నిందితుడు కూడా దమ్మాయిగూడాకు మకాం మార్చి అక్కడ కూడా ఆమెను బెదరించడం కొనసాగించాడు. నిరంతరం బెదరింపులకు గురిచేస్తుండటంతో మంగళవారం యువతి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నసీముద్దీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పెద్దవాగు రైల్వే బ్రిడ్జి పనుల్లో ప్రమాదం

## ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలు

## మరికొందరికి స్వల్పగాయాలు

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగుపై కొనసాగుతున్న మూడవ రైల్వేలైన్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల్లో బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. పనుల సమయంలో ఇనుప గడ్డర్‌ల మధ్య ఇరుక్కుని కాంట్రాక్ట్ కార్మికులు గాయపడిన ఘటన స్థానికంగా ఆందోళనకు గురి చేసింది. పనులు కొనసాగుతున్న సమయంలో అకస్మాత్తుగా భారీ ఇనుప గడ్డర్‌లు కదలడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు అప్రమత్తం కావడానికి ముందే ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రవి బసాక్ తీవ్రంగా గాయపడగా అతనిని ప్రస్తుతం మెరుగైన చికిత్స కోసం కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మరో కార్మికుడు కన్నయ్య (ఉత్తరప్రదేశ్) గాయపడి చికిత్స అనంతరం డిశ్చార్జ్ కావడం జరిగింది. ఇంకా ముగ్గురు కార్మికులు స్వల్ప గాయాలతో ప్రథమ చికిత్స పొందారు.

కాగా ఈ ప్రమాదంపై స్థానిక ప్రజలు, కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పనుల సమయంలో సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని కార్మిక సంఘాలు ఆరోపి స్తున్నారు. కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు అందించకుండా పనులు చేయిస్తున్నారని, గుత్తేదారులు నిరక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. హెల్మెట్లు, సేఫ్టీ బెల్టులు వంటి ప్రాథమిక రక్షణ చర్యలు కూడా సరిగా అమలు కాలేదని కార్మికులు చెబుతున్నారు. పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కూడా ప్రమాదానికి ప్రధాన కారణమైందని స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారులు సమయానికి పర్యవేక్షణ చేపట్టిఉంటే ప్రమాదాన్ని నివారించవచ్చని అభిప్రాయ పడుతున్నారు. ప్రమాదం జరిగిన తరువాత మాత్రమే అధికారులు స్పందించడం పట్ల కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు పరిస్థితిని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని ప్రజలు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు గాయపడిన కార్మికులకు తగిన పరిహారం అందించాలని కోరుతున్నారు. ప్రమాదం నేపథ్యంలో బ్రిడ్జ్ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షించిన తర్వాత మాత్రమే పనులు ప్రారంభించాలని స్థానికులు సూచిస్తున్నారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. కార్మికుల ప్రాణ భద్రతను ప్రాధాన్యంగా తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.




ఇనుప గడ్డర్ల మధ్య ఇరుక్కున్న కార్మికుడు

# డంపింగ్ యార్డు రద్దు చేసేదాక పోరాటం ఆగదు

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దీక్షను విరమింపజేసిన జెఎసి నేతలు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు ఏర్పాటు ఉత్తర్వులను నిరసిస్తూ గత 17రోజులుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలకు మద్దతుగా మంగళవారం హుజురాబాద్ అంబేద్కర్ చౌక్ వద్ద హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, అఖిలపక్ష సంఘాల నేతలు, కులసంఘాలు, మహిళా సంఘాలు భారీ ఎత్తున తరలిరాగా, డంపింగ్ యార్డు ఏర్పాటు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి జెఎసి నేతలు పెద్ద సంఖ్యలో 24గంటల దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బోయినపల్లి వినోద్‌కుమార్ హైద్రాబాద్ నుండి వచ్చి సంఘీభావం తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటల నుండి రాత్రి 11గంటల వరకు హుజురాబాద్ పరిసర ప్రాంతాల గ్రామాల నుండి పెద్ద ఎత్తున మహిళలు, పురుషులు, ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా నిరాహారదీక్ష శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. బుధవారం ఉదయం 10.00గంటల తర్వాత అశేషంగా తరలివచ్చిన ప్రజల సమక్షంలో జెఎసి కన్వీనర్ పల్కాల ఈశ్వర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గందె రాధిక శ్రీనివాస్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, జెఏసి సంఘం నేతలు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి నిమ్మరసం తాగించి 24గంటల దీక్షను విరమింపజేసారు. అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తన పోరాటం ఆగదని ఆయన తేల్చిచెప్పారు. నేను ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ నేను ప్రశ్నిస్తున్నానే తప్ప.. వ్యక్తిగతంగా ఎవరిపై తనకు సొంత ఎజెండాలేదన్నారు. తన 24గంటల దీక్షకు అశేషంగా తరలివచ్చిన సబ్బండ వర్గాల ప్రజలకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేతులెత్తి కృతజ్ఞత తెలిపారు. రెండు జిల్లాలలోని కార్పోరేషన్‌ల నుండి రోజుకు 800టన్నుల వ్యర్థపదార్థాలు హుజురాబాద్‌కు తీసుకువచ్చి విద్యుత్‌శక్తి తయారు చేస్తే.. వాతవరణ కాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యంతో ప్రజలు, పశుపక్షాదులు, పంటభూములకు ప్రమాదం పొంచి ఉందని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంలో హుజురాబాద్ ప్రజల ప్రాణాలను రక్షించేందుకు సమాలోచనలు చేసి, డంపింగ్ యార్డు ప్రతిపాదన విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. జెఎసి ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చి డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఐక్యపోరాటం నిర్వహించాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విజ్ఞప్తి చేసారు.



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న దృశ్యం

### నాపై కోపం ఉంటే అంబేద్కర్ చౌరస్తాలో నన్ను ఊరితీయండి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి వారు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తునందుకు వారికి నేను కొరకరాని కొయ్యగా మారిపోయాయని, తనపై ప్రభుత్వానికి కోపం ఉంటే.. తాను తప్పు చేస్తే.. చట్టానికి లోబడి అంబేద్కర్ చౌరస్తా వద్ద నన్ను ఊరితీయండి అంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రభుత్వానికి తేల్చిచెప్పారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రిపబ్లిక్ ఆఫ్ ఘన హైకమిషనర్ భేటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 8:** భారత్‌లో రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ ప్రొఫెసర్ క్వాసి ఒబిరి-డాన్సో బుధవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. హైకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చారు. ఈ భేటీలో పరస్పర సహకారం, సుహృ ద్భావ సంబంధాలపై చర్చించారు. ఘనా.తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని హైకమిషనర్ అభిలషించారు. ప్రధానంగా విద్య,శాస్త్ర సాంకేతిక, ఆరోగ్య,వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

# కూలి పనులకెళ్లి తిరిగి వస్తూ..

## ఆగివున్న లారీని ఢీకొన్న బైక్.. ముగ్గురి దుర్మరణం

## కామారెడ్డి జిల్లా మేనూరు వద్ద ఘటన

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లాలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. జిల్లాలోని మద్నూరు మండలం మేనూరు గ్రామం వద్ద 161 జాతీయ రహదారిపై ఆగివున్న రాజస్తాన్‌కు చెందిన లారీని రాత్రి 10 గంటల సమయంలో వెనకాల నుంచి వేగంగా బైక్ ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న పెద్ద ఎక్లారా గ్రామానికి చెందిన నాగు (48), అశోక్ (21), సచిన్ (17)లు ఘటనా స్థలంలోనే చనిపోయారు. మరణించిన వారి మృతదేహాలు రోడ్డుపై పోవడంతో పాటు వారు ప్రయాణించిన బై ముక్కలై రోడ్డు మీద పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీనిపై స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు హుటా హుటిన ఘటనా స్థలికి చేరుకుని ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చ్యురీకి తరలించారు. బుధవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం ముగ్గురి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. రోడ్డు పక్కన లారీ ఎందుకు ఆగివుందనే దానిపైనా విచారిస్తున్నారు. మరణించిన ముగ్గురు దినసరి కూలీలుగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కామారెడ్డి జిల్లా మేనూరులో జరిగిన రోడ్డుప్రమాదంలో మరణించిన ముగ్గురు వ్యక్తులు

# మద్యం మత్తులో.. ఆగిన బైక్‌ను ఢీకొట్టిన కారు

## ఇద్దరు మృతి.. ఒకరికి గాయాలు

**హైదరాబాద్ (వనస్థలిపురం), ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మద్యం మత్తులో,అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి ఇరువురు ప్రాణాలు బలిగొన్నాడు ఓ కారు డ్రైవర్.వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగి రోడ్డు ప్రమాదం గురించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా, హాలియ మండలం, అల్వాల గ్రామానికి చెందిన కంచర్ల వెంకటేశ్వర్లు కుమారుడు కంచర్ల శివ (20),హౌసింగ్ బోర్డ్ కాలనీ ,మిర్యాలగూడ కు చెందిన శ్రీరాములు కుమారుడు నకిరేకంటి సందీప్ కుమార్ (20) లు నగరంలోని మహావీర్ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్.ఈ. సి.ఈ. ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.నగరంలోని చింతలకుంట లో నివాసముంటు పార్ట్ టైం జాబ్ లో భాగంగా జుప్ట లో వస్తువులు డెలివరీ చేస్తుంటారు.అందులో భాగంగా మంగళవారం రాత్రి సుమారు 11.30 సమయంలో సాగర్ రోడ్డు లోని ఓంకార్ నగర్ పెట్రోల్ పంపు వద్ద డివైడర్ పక్కన తమ ఎలక్ట్రిక్ బైక్ పై ఉన్నారు అదే సమయంలో సాగర్ రింగ్ రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుండి హోండా సిటీ కారు ను మద్యం మత్తులో అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతున్న ఓ వ్యక్తి ,వీరి బైక్ ను ఢీ కొట్టాడు.ఈ ప్రమాదంలో శివ,సందీప్ కుమార్ లకు తలకు,కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం తో శివ,సందీప్ లు అక్కడికక్కడే మృతిచెందారు. అదేవిధంగా రోడ్డు దాటుతున్న మంచాల మండలం ,లోయపల్లి కి చెందిన సభావత్ శ్రీధర్ (23)ను సైతం అదే కారు ఢీ కొట్టడంతో గాయాలై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మద్యం మత్తులో కారు నడిపిన బి.యన్.రెడ్డి.నగర్ టీచర్స్ కాలనీకి చెందిన కనకాల రామ్ కుమార్ రెడ్డిని వనస్థలిపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి తరలించి విచారిస్తున్నారు.



కంచర్ల శివ(ఫైల్) సందీప్ కుమార్

# దేవుని దర్శనానికి వెళ్లి..

## బొలెరోను ఢీకొన్న డిసిఎం.. ఇద్దరు యువకులు మృతి



**మేళ్లచెర్వు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మేళ్ల చెరువుకు చెందిన జనిగె నరసింహారావు (35), జనిగె సతీష్ (25) దురాజ్పల్లి దేవుని మొక్కు తీర్చుకునేందుకు 20 మంది బంధు మిత్రులతో కలిసి బొలెరో వాహనములో దురాజ్పల్లి స్వామిదర్శనానిని వెళ్ళారు. తిరిగి వస్తుండగా మంగళవారం రాత్రి సూర్యాపేట సమీపంలో వెనుకనుంచి వస్తున్న డి.సి.యం. వాహనము డీకొట్టటముతో జరిగిన ప్రమాదములో ఈ ఇద్దరు యువకులు మృతిచెందారు.

# మూడు డిసిసి కార్యవర్గాల కమిటీలను ప్రకటించిన పిసిసి

**హైదరాబాద్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** రాష్ట్రంలో మూడు డిసిసిలకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ పూర్తికార్యవర్గంను బుధవారం ప్రకటించింది. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమర్‌గౌడ్ అధికారికంగా ఖమ్మం కార్పొరేషన్, రాజన్న సిరిసిల్ల సికిందరాబాద్ జిల్లా కార్యవర్గం ప్రకటించారు. సికిందరాబాద్‌లో 12 మంది ఉపాధ్యాక్షులు 26 మంది జనరల్ సెక్రటీరలను, ట్రెజరర్, ఐదుగురు స్పోక్స్ మెన్, 45మంది సెక్రటరీలు, 14 ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లు నియమించారు. సిరిసిల్లలో ఆరు ఉపాధ్యక్షులు, 16మంది జనరల్ సెక్రటరీలు, ఒకట్రెజరర్ ఇర్దరు స్పోక్స్‌మెన్, 15౼ ్సక్రటరీలు, ఐదు ఎగ్జిక్యూటీవ్ మెంబర్లు నియించారు. ఖమ్మం కార్పొరేషన్ లో నలుగురు ఉపాధ్యక్షులు 9మంది జనరల్‌సెక్రటరీలు, 2స్పోక్స్ మెన్, 23 సెక్రటరీలు, 7 ఎగ్జిక్యూటివ్ మెంబరులను నియమించారు.

వార్త


మన భవిష్యత్తు మనం పుట్టిన ఘడియలు బట్టిగాని, మరింకా దేనిమీదనో గాని ఆధారపడి లేదు. అది కేవలం మన స్వశక్తిపై ఆధారపడి ఉంది.

- రాజాజి

# అంతమా? పంతమా!


శ్వేతసౌధాధినేత డోనాల్డ్ ట్రంప్ ఎప్పుడు ఏమి మాట్లాడినా ఎవరూ పెద్ద సీరియస్‌గా తీసుకోరు. ఆయనను అభిమానించేవారు సైతం ఏదో అన్నాడులే అని సరిపెట్టేసుకుంటారు. అమెరికన్లు ఇతర దేశాల ప్రజలు సైతం ఆయనవి అసంబద్ధ ప్రేలాపనలుగా తోసిపుచ్చారు.తాజాగా పశ్చిమాసియా యుద్ధం రేపటికి 40 రోజులు ముగుస్తాయనగా ముందురోజు ఏదో మిన్ను విరిగి మీద పడిపోయినట్లు 'ఇరాన్‌లో డూమ్స్ డే' ప్రారంభమైనట్లు మాట్లాడుతూ ఈ రాత్రితో ఇరాన్‌లో నాగరికత అంతం అవుతోందని చెబుతూనే ఎన్నో వింత వ్యాఖ్యానాలు చేశారు. ఆదిలో కాల్పుల విరమణకు 5 రోజులు గడువు విధించగా మిత్రదేశం ఇజ్రాయెల్ కూడా దానిని అంగీకరించలేదు. మళ్లీ తగుదునమ్మా అంటూ మరో రెండు వారాలు సమయమిచ్చినట్లు ప్రకటించారు. 'కాల్పుల విరమణకిచ్చిన గడువు ముగిసే సమయానికి అదేదో ప్రపంచం అంతమయ్యే రోజు సమీపించినంత ఆత్రుత కనపరుస్తూ 'ఇరాన్‌పై అణుదాడి'కి సిద్ధమౌతున్న స్థాయిలో హుంకరించారు. అయినా ఎవరూ భయపడినట్లు లేదు. తాత్కాలిక కాల్పుల విరమణ సంధికి విధించిన గడువు భారత కాలమాన ప్రకారం బుధవారం ఉదయం 5.30గంటలకు ముగిసింది. కానీ ఏమీ జరుగలేదు. అంతమవబోతున్న నాగరికతను మళ్లీ వెనక్కు తీసుకురావడం సాధ్యంకాదన్నారు. అలా జరగడం తన కిష్టం లేకపోయినా తప్పేటట్లు లేదనగానే కొందరుఉలిక్కి పడ్డారేమో తెలియదు కానీ 47 ఏళ్ల నిర్బంధం, అవినీతి పాలన ఎట్టకేలకు అంతం కాబోతోందన్న పలుకులు విశ్వసించేటట్లుగా చెప్పలేకపోయారు. అదేదో ఇరాన్‌ను బూచితో భయపెడ్తున్నట్లుగానే ఉంది. తొలుత ఎందు కైనా మంచిదని ఆలోచించేవారు 'ఇరాన్‌పై అమెరికా అణుదాడి' చేయబోతోందా? అనే అనుమానంతో భయపడినా అలాంటిదేం జరుగదని సరిపెట్టుకున్నారు. తెల్లారేసరికి అదేం జరుగలేదంటే పాపం! ట్రంప్ తమాయించు కున్నట్లున్నారే అనుకుని సమాధానం పడ్డారు జనం. ఇప్పటికే 7 ఆధునిక విమానాలను సైతం నేలపాలు చేసిన ఇరాన్ ధాటికి అమెరికాతట్టుకోలేకపోతోందనుకున్న తరుణంలో ట్రంప్ ఎలాంటి అవివేక నిర్ణయంతీసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని, ఆయనదంతా మేకపోతుగాంభీర్యమే అనుకునే వాళ్లూ ఉన్నారు. ట్రంప్ ఒకడుగు వేస్తే ఇరాన్ రెండడుగులు ముందుకేస్తోందే తప్పఅసలు తగ్గలేదు. ఆదినుంచి ట్రంప్ ఎలాంటి ప్రేలాపనలు పేలినా ఇరాన్ 'సై అంటే సై' అనడమూ అందుకు సిద్ధమవడమే తప్ప మరో ఆలోచన చేయలేదు.హార్మూజ్ విషయంలో ఐక్యరాజ్యసమితి ప్రతిపాదనపై తీర్మానం వీగిపోయింది. హార్మూజ్ జల సంధిని తెరవాలంటూ ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చే తీర్మానానికి తమ 'వీటో' పవర్‌ను ఉపయోగించి రష్యా,చైనాలు తిరస్కరించాయి. తాజాగా హార్మూజ్ జలసంధి విషయంలో ట్రంప్ మాట్లాడుతున్న వ్యవహార మంతా ఓవిదూషకుడి ఇంద్రజాల మహేంద్రజాలపు ఎత్తుగడల్లాగానే ఉన్నాయి. ఇరాన్ తన అధీనంలోని హార్మూజ్ జలసంధిని నిఘా పెంచుకుంటూనే తనగుండావెళ్లే వాణిజ్య నౌకలకు వీలైనంత మేరకు 'దారి'తీస్తూనే ఉంది. ఇరాన్ తనను తాను కాపాడుకోవడానికి అమెరికా దుందుడుకు తనాన్ని తగ్గించేందుకు ఇదొక్కటే మార్గం.తాజాగా హార్మూజ్‌ద్వారా ప్రయాణించే ఇరాన్ నౌకలకు పన్ను వసూలు చేసే ఆలోచనకు ధీటుగా అదే సమయంలో తాముకూడా ఇలాంటి పన్నును హార్మూజ్ జలసంధి పేరిట అమెరికా సుంకం వసూలు చేయాలని అమెరికా ఆలోచిస్తోంది. ట్రంప్ స్వయంగానే ఈ విషయాన్ని బయటపెట్టారు. ఇరాన్‌ను యుద్ధంలోఓడించాక, ఆ తర్వాతనే అమెరికా సుంకం విధించాలని కలలు కంటున్నట్లుంది. హార్మూజ్ జలసంధిలో రోజూ 120నౌకలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్నిదేశాల నౌకలపై ఇప్పటికే ఇరాన్ రెండు మిలియన్ డాలర్ల మేరకు పన్ను వసూలుచేస్తోంది. ఇలారోజూ240 మిలియన్ డాలర్లు చేజిక్కించుకోవాలన్నది అమెరికా పాలకుల ఆశ. ట్రూత్ సోషల్ పోస్ట్‌లో ట్రంప్ పోస్టులన్నీ విచిత్రంగానే ఉంటాయి.ఏవి సాధ్యమో,ఏవిఅవాస్తవాలో, ఏవి నిజమో,ఏవి వాస్తవదూరమో, అర్థంకాక వాటిని చదివే వారు గందరగోళంలో పడతారు. అలాంటి మానసిక పరిస్థితిలో ట్రంప్ వ్యాఖ్యలు ఎవరికీ అర్థంకావు. ట్రంప్ ఇప్పటికే మూడుసార్లు గడువును పొడిగించారు. అమెరికాతో గల రాజీ అవకాశాలపై ఇరాన్ ఏమాత్రం ఆశలు పెట్టుకోలేదు.ఇరాన్ అంతటి శక్తివంతమైన దేశాన్ని ట్రంప్ చాలాచులకనగా మాట్లాడుతూ అమెరికన్లలోఆయనే చులకనౌతున్నారు. యుద్ధం మొదట్లో ఇరానీయుల్ని తమ దేశాధినేతలపై తిరుగుబాటు చేయాలని ప్రేరేపించినా పనిచేయలేదు. తాజాగా ఇరానీయులే తమ దారికి వచ్చినట్లు చెబుతూనే ప్రాచీన నాగరికత ఉన్న ఇరాన్ చరిత్ర గర్భంలో కలిసిపోతుందనే సంకేతాలతో హెచ్చరిస్తున్నారు.చివరికి తెలిసిందేమిటంటే మరో రెండువారాలు కాల్పుల విరమణకు చైనా ఇరాన్‌ను ఒప్పించిందంటున్నారు. మరోపక్క అమెరికా భూతల దాడులను ఎదుర్కొనేందుకు ఇరాన్ సిద్ధమౌతోంది. తమ దేశం కోసం 1.40 కోట్ల మంది ఇరాన్ ప్రజలు సంసిద్ధులుగా ఉన్నారని ఇరాన్ నేతలు చెబుతున్నారు. హార్మూజ్ జలసంధినుంచి ఇటీవల కాలంలో ఒక్క ఎల్ఎన్‌జి నౌక కూడా బయటకు రాకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ద్రవీకృత సహజ వాయువు కొరత తీవ్రమవక తప్పదు. ఏ దేశన్నైనా ట్రంప్ ఆదేశాలు సందిగ్ధతలో ఉంచుతున్నాయి. ఇరాన్ మాత్రం తమ సార్వభౌమత్వాన్ని కాపాడుతూ శాశ్వత యుద్ధ విరమణ షరతులకు మాత్రమే తలొగ్గుతుంది. తప్పఅ మెరికాకు సాగిలపడే పరిస్థితిలో లేదు.

విశ్వాసం అనేది కొద్దిపాటి గాలికి వాలిపోయేది కాదు. అది అచంచలమైనది. హిమాలయాల అంత స్థిరమైనది.




మహాత్మా గాంధీ

సంకల్ప బలం ఉన్నవారు అన్నిటినీ తనకు అనుకూలంగా మలచుకోగలరు.



సోక్రటీస్

# ప్రజావాక్కు



### కర్కశత్వానికి తగిన శిక్ష

తమిళనాడులో ఆరేళ్ళ క్రితం జరిగిన పాశవిక ఘటన 'లాకప్ డెత్' కేసులో ట్రయల్ కోర్టు విచారణ ముగిసి తొమ్మిది మంది పోలీసులను ముద్దాయిలుగా ఖరారు చేస్తూ వారందరికీ మరణ శిక్ష విధించడం సంచలనం కలిగించిన తీర్పు. కరోనా సమయంలో సదరు లాక్ డౌన్ నిబంధనల్ని అతిక్రమించారన్న కారణంతో చిరు వ్యాపారులైన తండ్రీకొడుకులను అరెస్ట్‌చేశారు.వారిని ఆ రాత్రంతా చిత్రహింసలకు గురిచేయగా వారిరువురూ ప్రాణా లు కోల్పోయారు.కస్టడీలోకి తీసుకున్న ఆరోగ్యవంతులైన ఇద్దరుపౌరులు ఒక్క రోజులోనే అనారోగ్యంతో మరణించడానికి పోలీసులు పెట్టిన చిత్రవధ ఏకైక కారణం అన్నది తేటతెల్లం. ఆ దుర్మార్గపు చర్య ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఆందోళన నింపగామద్రాస్ హైకోర్టు సూమోటోగా కేసుని స్వీకరించింది. సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది. ఫలితంగా పోలీసుల నేరం నిరూపణ అయ్యింది.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### నిర్ణయం తీసుకోవడంలో జాప్యం

ఆదాయానికి మించినఆస్తులు,అవినీతికేసుల్లానే ఎమ్మెల్యే, ఫిరాయింపులు కూడా ఏళ్లతరబడి సాగుతున్నాయి. చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికలవరకు పరిస్థితి ఇలానే ఉండేలా ఉంది. నిజానికి ఇది చాలా చిన్నపని. స్పీకర్ తల్చుకుంటే ఒక్కరోజులో తేలిపోతుంది. అయినా ఎటూ తేలటంలేదు. కోర్టువారు జోక్యం చేసుకుని పరిష్కారం చేయమన్నా స్పీకర్‌నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

- రాశి, హైదరాబాద్

### సైబర్ వేధింపుల ముప్పు

నేటిడిజిటల్ యుగంలోసాంకేతికత విస్తరించినకొద్దీ మహిళలకు సైబర్ వేధింపుల ముప్పు కూడా అధికమవుతోంది. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించడం,ఫోటోలను దుర్వినియోగంచేయడం, సైబర్ స్టాకింగ్ వంటివి ప్రధాన సవాళ్లుగా మారాయి. ముఖ్యంగా డీప్ ఫేక్ వంటి ఆధునిక సాంకేతికత ద్వారా మహిళల చిత్రాలను మార్ఫిడి చేయడం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతోంది. అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌ల ద్వారా స్మార్ట్‌ఫోన్‌లను హ్యాక్ చేసి బ్లాక్ మెయిల్ చేయడం వల్ల మహిళలు మానసిక వేదనకు గురవుతున్నారు. డిజిటల్ భద్రత కోసం మహిళలు బలమైన పాస్‌వర్డ్‌లు, టూస్టెప్ వెరిఫికేషన్ వంటి జాగ్రత్తలు పాటించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మాటలు ఫుల్, చేతలు నిల్

కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కేంద్ర మంత్రులు ఎమ్‌పిలు, మాజీ ముఖ్యమంత్రులు జగన్‌మోహన్ రెడ్డి ఇలా వెళ్లి అలా వచ్చేశారు. వారి కేసుల్లో ఎటువంటి పురోగతి లేదు. ఇప్పటి వరకు శిక్షపడలేదు. అప్పట్లో అంతా హడావిడి చేసి ఏవేవో కుంభకోణాలు చేశారంటూ నానా రచ్చ చేసి ఇప్పుడు వారి ఊసే ఎత్తటం లేదు. దీంతో వారు నిజంగా అవినీతి పనులు చేసి కోట్ల రూపాయలు కూడా బెట్టారా లేక వారి ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రత్యర్థులు కుట్రచేశారా అనేది సంవత్సరాలు గడిచిపోతున్నా ఎవరికి తెలియడంలేదు.ఇప్పటికీ సస్పెన్స్ వీడటంలేదు.గత 12సంవత్సరాలుగా బిజెపి అధికారంలో ఉంది. దర్యాప్తు సంస్థలన్నీ ఆ పార్టీకి విధేయులాగా ఉంటాయి. వారు కనుసన్నల్లో పనిచేస్తుంటాయి. అయినా ఏమీ చేయడం లేదు. అవినీతిపరుల అంతు చూస్తామని చెబుతుందే కానీ ఆ పని చేయలేకపోతోంది.

- శాస్త్రి, హైదరాబాద్

### ఇది అన్యాయం, అప్రజాస్వామికం

కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా సమయసందర్భం వచ్చినప్పుడు బిఆర్‌ఎస్‌పై ఎన్నో విమర్శలు చేస్తున్నారు. ఉప ఎన్నికలు వస్తే తాను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్టేషన్ ఘనాపూర్‌లో ఘనవిజయం సాధిస్తానని కడియం ఎన్నోసార్లు అన్నారు. దానం ఏకంగా కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశాడు. వారు పార్టీ ఫిరాయించారనటానికి ఇంతకన్నఆధారాలు ఏంకావాలి. అయినా స్పీకర్ పార్టీ ఫిరాయించలేదంటూ ఇద్దరు ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్ ఇచ్చారు. ఇది అన్యాయం అప్రజాస్వామికం.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### గొప్ప ముందడుగు

కేంద్రం ఉపాధి హామీలో చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలి అనినిర్ణయించడం గొప్ప ముందు అడుగు. తెలంగాణ లాంటి రాష్ట్రానికి ఇది నిజంగా మంచి అడుగు. నీళ్లను ఆగబట్టి రైతులు ఎక్కడికక్కడ పంటలు వేసుకునేందుకు అవకాశం దొరుకుతుంది. ఇది పంటల వృద్ధికి చోదక శక్తి లాగ పనిచేస్తుంది. అంత మాత్రమేకాదు రైతులకోణంలో ఆలోచించినప్పుడు ఇది నిజమైన ఆస్తి లాగ పని చేస్తుంది. కేంద్రం కొత్తగా తలపెట్టిన స్కీమ్‌లో ఎలాగూ ఆస్తుల సృష్టే ప్రదానం అన్నారు కాబట్టి ఇది ఒక మంచి ఉదాహరణ కాగలదు. దీనివల్ల మరోక ఉపయోగం నీటిని వడిసి పట్టడం కూడా వీలు అవుతుంది. ఒక్కొక్క దానికి 6.50 లక్షల ఎస్టిమేషన్ ఇచ్చారు.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# నారీశక్తి బలోపేతానికి సమష్టి కృషి!

మరికొన్ని రోజుల్లో దేశంలోని అన్ని ప్రాంతాల్లో పండగ వాతావరణంతో సందడి మొదలు కాబోతున్నది. అస్సాం ప్రజలు రొంగాలి బిహు జరుపుకొంటే, ఒడిశా ప్రజలు మహా బిషుబ పాన సంక్రాంతి నిర్వహిస్తారు. పశ్చిమ బెంగాల్లో పొయిలా బైశాఖి బెంగాలీల నూతన సంవత్సరానికి నాంది పలికితే కేరళలో సంబరంగా విషు పండగ నిర్వహిస్తారు. తమిళనాడులో పుత్తాండు పర్వదినాన్ని, పంజాబ్ సహా ఉత్తర భారతంలోని ఇతర ప్రాంతాల్లో బైశాఖీ వేడుకను చేసుకుంటారు. ఇవన్నీ ఆశాభావాన్ని, సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. దేశ విదేశాల్లో ఈ వేడుకలను నిర్వహించుకొనే వారందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ పవిత్ర ఉత్సవాలు అందరి జీవితాల్లోనూ ఆనందాన్నీ, సౌభాగ్యాన్నీ తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. ఏప్రిల్ 11 నుంచి మహాత్మా పూలే 200 జయంత్యుత్సవాలను మనం ప్రారంభించుకుంటున్నాం. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు యావత్ భారతదేశం నివాళి అర్పిస్తుంది. ఈ ప్రత్యేక సందర్భాలే కాకుండా, మన హృదయాలూ, ఆలోచనలూ పునర్నవీకరణ స్ఫూర్తితో నిండిన వేళ.. మన దేశం మరో చారిత్రక విజయం ముంగిట నిలబడింది. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్టం చేసుకోవడానికి, సమానత్వం, సమ్మిళితత్వం దిశగా మన సమష్టి నిబద్ధతను పునరుద్ఘాటించడానికి లభించిన గొప్ప అవకాశమిది. మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదించేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనిని ఓ శాసనపరమైన కార్యక్రమంగా పేర్కొంటే ఈ బిల్లు ప్రాధాన్యాన్ని తగ్గించినట్టే అవుతుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబం. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన సుదీర్ఘ నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం.దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవి, అమూల్యమైనవి. ప్రతి రంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు నేడు భారత్ కేంద్రంగా మారింది. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి కళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగాచేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్యసేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళితత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు, ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి ప్రాతినిధ్యం లభించలేదు. ఇది దురదృష్టకరం. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవుతాయి. రానున్న అంటే 2029లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం అనివార్యం. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు దశాబ్దాలుగా ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధినియంను పార్లమెంటు ఆమోదించింది. నా జీవితంలోని అత్యంత ప్రత్యేకమైన సందర్భాల్లో ఒకటిగా నేను దీనిని భావిస్తాను. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తిలో ప్రతిధ్వనిస్తోంది. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలని మన రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. ఈ ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ప్రయత్నాల్లో ప్రధానం. శాసన వ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి పౌరునికీ సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మా చిత్తశుద్ధిని ఇది ప్రతిబింబిస్తుంది. ఉపేక్షకు అవకాశం లేని సమయం వచ్చింది. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఎలాంటి జాప్యం జరిగినా ప్రజాస్వామ్య సమ్మిళిత్వాన్నీ, ప్రజాస్వామ్య స్ఫూర్తినీ మనం వాయిదా వేసినట్లే. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించారు. ఈ అంశంపై చర్చించారు. ఇలా చేయడం తప్పనిసరి అని కూడా భావించారు. ఇప్పుడు గనుక దీనిని వాయిదా వేస్తే మనం గుర్తించిన, సరిదిద్దగలిగిన అసమతౌల్యాన్ని మరింత పెంచడమే అవుతుంది. నిర్దిష్ట లక్ష్యంతో, ఆత్మవిశ్వాసంతో భారత్ ముందుకు సాగుతున్న ఈ తరుణంలో ప్రజలు, ముఖ్యంగా జనాభాలో సగభాగంగా ఉన్నవారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. సకాలంలో చేపట్టే చర్యలు దీర్ఘకాలంగా నెరవేరని వాగ్దానాలను నెరవేర్చడమే కాకుండా ప్రగతి వేగాన్ని సైతం కొనసాగిస్తాయి. మన ప్రజాస్వామ్యాన్ని మరింత ప్రాతినిధ్యం కల్పించేదిగా, స్పందించేదిగా, భవిష్యత్తుకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఇది నిజంగా చరిత్రాత్మకమైన అవకాశం. అందరూ కలిసి రావాల్సిన సమయం ఇది ఏ ఒక్క ప్రభుత్వానికో, పార్టీకో లేదా వ్యక్తికో సంబంధించిన అంశం కాదు. దీని ప్రాధాన్యాన్ని గుర్తించి,దీనిని సాకారం చేసుకునే దిశగా దేశమంతా ఏకతాటిపైకి రావాల్సిన సమయం. మన నారీశక్తికి మనం అందించాల్సింది ఇదే. అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం కావాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి కావాలి. మన కోసం కాకుండా భవిష్యత్తు తరాల కోసం పనిచేయాలనే స్ఫూర్తిని ఇలాంటి అవకాశాలు మనకు అందిస్తాయి. మార్పులను స్వీకరిస్తూ, మరింత సమ్మిళిత్వాన్ని సాధించడంలోనే అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి దాగి ఉందన్న సంగతిని గుర్తు చేస్తున్నాయి. చరిత్రాత్మకమైన ఈ పార్లమెంటు సమావేశం సమీపిస్తున్న నేపథ్యంలో భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాలని పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యులందరికీ విజ్ఞప్తిచేస్తున్నాను. బాధ్యతగా వ్యవహరించేందుకూ, ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు ముందుకు వద్దాం. అత్యున్నత ప్రజాస్వామ్య విలువలకోసం కలిసినడుద్దాం.జాతీయ ప్రయోజనాల విషయంలో విబేధాలను పక్కన పెట్టి, ఐక్యంగా వ్యవహరించగలదని భారత్ ఎల్లప్పుడూ రుజువు చేస్తూనే ఉంది.ఇది అలాంటి సందర్భమే. అందరం కలిసి కట్టుగా ముందుకు సాగుదాం. రాజ్యాంగ విలువలను బలోపేతం చేద్దాం. దేశప్రగతి కోసం నారీశక్తికి సాధికారత కల్పిద్దాం. ●

# భవితకు భద్రత బయోగ్యాస్!

ముద్దం నరసింహస్వామి

భారతదేశం విపత్కరమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు అత్యాధునిక సాంకేతికతతో దూసుకుపోతుండగా, మరోవైపు వంటగ్యాస్ (ఎల్పీజీ) కోసం ఇప్పటికీ విదేశీ దిగుమతులపైనే భారీగా ఆధారపడుతోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో, అందునా 'హార్మూజ్ జలసంధి' పరిసరాల్లో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడల్లా మన వంటగదుల్లో ఆందోళన మొదలవుతోంది. సరఫరా గొలుసు దెబ్బతినడం వల్ల ధరలు పెరగడమే కాకుండా,ఇంధన భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో స్థానికంగా లభించే వనరులతో 'బయోగ్యాస్' వ్యవస్థలను పునరుద్ధరించడం కేవలం ఆర్థిక అవసరమే కాదు, దేశ భద్రతా వ్యూహంలో భాగం కావాలి. ప్రస్తుతం భారత్ ఎల్పీజీ దిగుమతుల కోసం ఏడాదికి లక్షకోట్ల రూపాయలకు పైగా విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చిస్తోంది. దీనికితోడు ప్రభుత్వ ఖజానాపై మరో పదివేల కోట్ల రూపాయల సబ్సిడీ భారం పడుతోంది. ఇంత భారీ వ్యయం చేస్తున్నప్పటికీ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాల వల్ల సరఫరాపై పూర్తి గ్యారెంటీ లేకపోవడం ఆందోళనకరం.1980ల్లోనే బయోగ్యాస్‌ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినప్పటికీ, మధ్యలో ఎల్పీజీ సబ్సిడీలు పెరగడం వల్ల ప్రజలు ఈ సహజ ఇంధనానికి దూరమయ్యారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు వెలుగొందిన బయోగ్యాస్ ప్లాంట్లు నేడు శిథిలావస్థకు చేరాయి. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 20కోట్లకు పైగా పశు సంపద మనకు ఇంధన గని వంటిది. వీటి నుంచి వచ్చే పేడను, పంట అవశేషాలను, వంటింటి వ్యర్థాలను శాస్త్రీయంగా వినియోగిస్తే ప్రతి గ్రామం ఒక 'శక్తి కేంద్రం'గా





మారుతుంది. వ్యర్థాలను కేవలం సమస్యగా చూడకుండా, ఒక విలువైన వనరుగా మార్చుకోవాల్సిన సమయంఆసన్నమైంది. గణాంకాల ప్రకారం, ఒక సాధారణ కుటుంబం బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 15 వేల రూపాయల వరకు ఆదా చేయవచ్చు. అయినప్పటికీ, దేశంలో కేవలం 0.3శాతం కుటుంబాలే బయోగ్యాస్ వాడుతుండటం, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు ఇందులో వెనుకబడి ఉండటం శోచనీయం. బయోగ్యాస్ కేవలం వంట ఇంధనం మాత్రమే కాదు, వ్యవసాయానికి ఒక వరప్రసాదం. ప్లాంట్ నుంచి వచ్చే 'స్లరీ' భూమికి అద్భుతమైన ఎరువుగా పనిచేస్తుంది, తద్వారా రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణ ద్వారా గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. వ్యర్థాల నిర్వహణ సులభతరం కావడంతోపాటు కాలుష్యం తగ్గుతుంది. ఈ వ్యవస్థలో మార్పు రావాలంటే కేవలం రాయితీలు ఇస్తే సరిపోదు. సర్పంచులు, పంచాయతీ సభ్యులు బయోగ్యాస్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి. పట్టణవాసులు సోలార్ ప్యానెల్స్, ఇండక్షన్ స్టవ్‌లపై దృష్టి పెట్టాలి. ఐఐటీ హైదరాబాద్ రూపొందించిన రూ.500 చౌక సోలార్ కుక్కర్ వంటి ఆవిష్కరణలను ప్రభుత్వం భారీగా ప్రోత్సహించాలి. ఇంధన స్వావలంబన అనేది దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. ఎల్పీజీపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ బయోగ్యాస్, సోలార్, విద్యుత్ వంట వ్యవస్థలను ఏకోన్ముఖంగా ముందుకు తీసుకెళ్లాలి.ప్రతిగ్రామం తనవంట అవసరాలకు స్వయంసమృద్ధి సాధించినప్పుడే, దేశం నిజమైన ప్రగతి పథంలో పయనిస్తుంది. ఇది కేవలం వంటగది సమస్య కాదు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన అడుగు. ●

# కృత్రిమ మేథ ప్రజాశ్రేయస్సుకేనా?

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

పారిశ్రామిక విప్లవం నుండి ఐటీ రంగం వరకు జరిగినవన్నీ సాంకేతిక విప్లవాలు ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నూతన నాగరికత కూడా ప్రపంచ దేశాల దిశ,దశ మార్చబోయే శక్తిగా ఉన్నది. ఇప్పటివరకు ఐటీ రంగంలో ప్రపంచ దేశాలకు వెన్నెముకగా ఉన్న మన నిపుణులు ఇప్పుడు ఏఐ రంగంనుకూడా నడిపించగలగాలి.ఆనాడు ఐఐటీలను స్థాపించగలిగినందువల్లనే నేడు ఐటీ దిగ్గజ కంపెనీలకు సీఈవోలుగా మనవారు ఉన్నారు. ఈపునాదుల పైననే ఏఐ రంగాన్ని కూడా మనం శాసించగలగాలి. లేకపోతే అమెరికా చైనా ఆధిపత్య ధోరణలను అరికట్టలేం. ఏఐ ప్రపంచంలో మనుగడ సాగించేందుకు అత్యవసరమైన వివిధ రకాల నైపుణ్యాలను విద్యార్థులు ఒంటబట్టించుకునే విధంగా దేశంలోని విద్యా వ్యవస్థలను తీర్చిదిద్దాలి. ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా మనమే ముందుండాలి. మనకు కావలసినంత డెమోగ్రాఫిక్ డివిడెంట్ సాంకేతిక నిపుణత మన దేశానికి ఉంది. కావలసినదల్లా ప్రభుత్వ పాలన సహాయ సహకారాలు మాత్రమే. మన ప్రధాని ఏఐ రంగాన్ని దేశ భవిష్యత్తు కోసం ఉపయోగించాలని ఇది మానవ కేంద్రీకృతంగాను సమ్మిళిత అభివృద్ధి గాను ఉండాలని ఢిల్లీలో జరిగిన ఏఐ ప్రభావం అనే సదస్సులో నొక్కిచెప్పారు. కృత్రిమ మేధస్సు పరిశోధనా రంగంగా ప్రారంభమై, ఇప్పుడు ప్రభుత్వం, పరిశ్రమలు,ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే ప్రాథమిక సాంకేతికతగా వేగంగా అభివృద్ధి చెందింది. ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, విద్య, భద్రత ప్రజావిధానాలు వంటి కీలక రంగాల్లో ఏఐ ఆధారిత వ్యవస్థలు కీలక నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బాధ్యతాయుత అభివృద్ధి, పరిపాలన అత్యంత అవసరంగా మారింది. ఏఐ సాంకేతికత వినియోగమూ బాధ్యతాయుతంగానే ఉండాలి. బాధ్యతాయుత ఏఐ అనేది నైతికత, పారదర్శకత, సామాజిక విలువలకు అనుగుణంగా రూపకల్పన చేసి అమలు చేయాల్సిన ఒక సాంకేతిక వ్యవస్థ ప్రజాప్రయోజనాలకు హాని లేకుండా, పక్షపాతాన్ని తగ్గించే, గోప్యతను రక్షించే సమానత్వం, భద్రతను ప్రోత్సహించే విధంగా ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ఉపయోగించడం లక్ష్యంగా ఉండాలి. ఇది కేవలం సాంకేతిక పనితీరుకే పరిమితం కాకుండా, సమాజంపై విస్తృత ప్రభావం, చట్టపరమైన అనుసరణ, నైతిక సమన్వయాన్ని కూడా కలిగి ఉండాలి. ప్రధానంగా న్యాయం,మానవ హక్కులు వంటి నైతిక అంశాలపై దృష్టిపెట్టాలి. బాధ్యతాయుత ఏఐ అనేది నైతికత, ప్రమాద నియంత్రణ, అనుసరణ, కార్యాచరణ బాధ్యతలను సమగ్రంగా కలిగిన పరిపాలనా నమూనా. ఇదంతా ప్రభుత్వ నియంత్రణలోనే జరగాలి. పలువురు దేశాధినేతలతో అంతర్జాతీయ స్థాయి ఏఐ సారథులు, సీఈఓలు విద్యావేత్తలు, పరిశోధకులు, దాతలు సదస్సులో పాల్గొన్నారు. ఏఐ రంగంలో భారతన్ను సారథ్య స్థానంలో నిలిపే లక్ష్య సాధనలో భాగంగా ఈ సదస్సును కేంద్రం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంతోనే ఏఐ రంగాన్ని ఆనాటి ఐఐటీ లాగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నది. దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్యను కూడా పరిగణలోకి తీసుకోవా



ల్సి ఉన్నది. అభివృద్ధి చెందుతున్న ఏఐ ద్వారా నిరుద్యోగ సమస్య ఏర్పడకూడదు. మనప్రభుత్వ పెట్టుబడులుమాత్రం ఓమోస్తరుగానే ఉన్నాయి. గత ఏడాది రూ. 2,000 కోట్లు కేటాయిస్తే, తాజా బడ్జెట్ ప్రతిపాదనల్లో అవి అందులో సగానికి తగ్గిపోయాయి. అత్యధునాతన టెక్నాలజీపై పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉన్న సమయంలో కోత పెట్టడం నివ్వెరపరుస్తోంది. ఏఐ ప్రవేశం వలన మన దేశంలో 15లక్షల ఉద్యోగాలు పోతాయని నీతి అయోగ్ అంచనా వేసింది. దశాబ్దాలుగా సాగుతున్న సాంకేతిక అభివృద్ధినేడు పరాకాష్టకు చేరింది. మానవ శారీరక శ్రమను రోబోలు ఆక్రమిస్తుంటే, మేధా శ్రమ స్థానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కైవసం చేసుకుంటోంది. ఫలితంగా బ్లూ కాలర్, వైట్ కాలర్ రంగాల్లో మనిషికి స్థానం లేకుండా పోతోంది. ఉదాహరణకు, ఒక సంస్థలో 30వేలమంది వరకూ ఉద్యోగులను తొలగించనున్నారు. దీనికి కారణం ఆ కంపెనీ ఒక ఉద్యోగస్థుడికి సాలీనా సగటున 36వేల డాలర్ల వేతనం చెల్లించవలసి ఉంటే అదే స్థానంలో మర మనిషిని (రోబో) పెట్టుకుంటే అయ్యే ఖర్చు 3,600 డాలర్లు మాత్రమే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సే తన సంస్థకు సంబంధించిన కొత్త కోడ్‌ను గూగుల్ 2025 నాటికి 30 మేరకు రాయగలుగుతోంది. అంటే, ఆ మేరకు సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాల కోతలు అనివార్యమన్నమాట. వేలాది మంది ఉద్యోగుల తొలగింపులు సాఫ్ట్వేర్ రంగంలో పెను సంచలనాన్ని సృష్టిస్తున్నాయి. ఈ భారీ లేఆఫ్స్ వెనుక రాజకీయ కారణాల కంటే కూడా కృత్రిమ మేధస్సు రంగంలో ఆధిపత్యం సాధించాలనే కంపెనీ వ్యూహాత్మక నిర్ణయమే ప్రధానంగా కనిపిస్తోంది. దాదాపు ముప్పై వేలమంది వరకు, అంటే సంస్థలోని మొత్తం సిబ్బందిలో సుమారు పద్దెనిమిది శాతం మందిని తొలగించాలని ఓ సంస్థ నిర్ణయించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏఐ మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులను మళ్లించడమే. కంపెనీ ఆదాయం బలంగానే ఉన్నప్పటికీ, భవిష్యత్తులో గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రత్యర్థులతో పోటీ పడాలంటే ఏఐ డేటా సెంటర్ల నిర్మాణం అత్యవసరమని యాజమాన్యం భావిస్తోంది.ఇందుకోసం వెచ్చించాల్సిన వేల కోట్ల నిధులను సమకూర్చుకోవడానికి మానవ వనరుల ఖర్చును తగ్గించుకోవడం తప్పనిసరి అని కంపెనీ భావించడం వల్లనే ఈ అకస్మాత్తు తొలగింపులు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్వేర్ రంగం ఇప్పటికే ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో, ఇలాంటి దిగ్గజ సంస్థలు తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగులలో తీవ్ర ఆందోళనను నింపుతున్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితుల మధ్య ఉద్యోగులు తమ ఉనికిని కాపాడుకోవాలంటే కేవలం పాతతరం సాఫ్ట్వేర్ నైపుణ్యాలపై ఆధారపడటం సరిపోదు. ఏఐ విప్లవం వల్ల వస్తున్న మార్పులను గమనిస్తూ, కొత్త సాంకేతికతలలో నైపుణ్యాన్ని పెంచుకోవడం ఒక్కటే ప్రస్తుతానికి కనిపిస్తున్న పరిష్కారం. సంస్థలు లాభాలకోసం మనుషుల కంటే యంత్రాలకే ఎక్కువ విలువ ఇస్తున్న ఈ రోజుల్లో, సాఫ్ట్వేర్ ఉద్యోగులు నిరంతరం తమను తాము అప్‌డేట్ చేసుకోవడం ద్వారా మాత్రమే ఈ ఉపాధి గండం నుండి బయటపడగలరు. మనిషితో పని లేకుండా ఉత్పత్తుల నుండి యుద్ధరంగం వరకు ఏఐ తోనే నిర్వహించుకుంటే నిరుద్యోగ సమస్య ఎక్కువ అవుతుందని పాలకులు పెట్టుబడిదారులు గమనించాలి. ఆధునికయుగంలో ఎప్పటికప్పుడు సాంకేతికత అభివృద్ధి చెందుతూ వస్తుంది. ఆ సాంకేతికత వల్ల మానవాళి శ్రేయస్సుకు మేలు జరగాలి. వారికి కీడు జరిగే అవకాశాలుంటే ప్రభుత్వం నివారించాలి. పారిశ్రామిక విప్లవం నుండి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వరకు సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతూ వాటిని ఉపయోగించడం వలన వివిధ దేశాల ఆదాయాలు పెరిగిన మాట వాస్తవమే కానీ దీనితో పాటు నిరుద్యోగ సమస్య కూడా గణనీయంగా పెరిగింది. లాభాపేక్ష, ఖర్చులు తగ్గింపు నెపంతో కార్పొరేట్ సంస్థలు ముఖ్యంగా సాఫ్ట్ వేర్ రంగం లేఆఫ్ల మంత్రం జపిస్తోంది. ఇది మౌళికంగా మానవ శ్రేయస్సుకు విరుద్ధం. ●

# కాల్పుల విరమణలో ఇరాన్‌కు చైనా సాయం: ట్రంప్

**బీజింగ్, ఏప్రిల్ 8:** అమెరికా, ఇరాన్‌ల మధ్య 40వ రోజుకు చేరిన యుద్ధ జ్వాలలు ఎట్టకేలకు చల్లారాయి. ఇరాన్‌పై జరిపే భారీ సైనిక దాడుల నుంచి ట్రంప్ వెనక్కి తగ్గి, రెండు వారాల షరతులతో కూడిన కాల్పుల విరమణను ప్రకటించారు. ఈ నిర్ణయానికి, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికీ మార్గం సుగమం అయ్యింది. ఈ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా ఉపశమనాన్ని కలిగించింది. ఈ కాల్పుల విరమణకు పాకిస్తాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ క్రెడిట్ తీసుకుంటున్నారు. కాల్పుల విరమణకు అంగీకరించేలా ఇరాన్‌ను ఒప్పించడంలో చైనా కీలక పాత్ర పోషించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా దీనిని ప్రకటించారు. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్ వివాదం



ప్రారంభమైనప్పటి నుండి, చైనా శాంతిని ప్రోత్సహించడానికి, శత్రుత్వాలను నివారించడానికి చురుకుగా కృషి చేస్తోందని అన్నారు. కాల్పుల విరమణకు అంగీకరించడానికి ఇరాన్‌కు చైనా సహాయం చేసిందని తాను నమ్ముతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఉద్దేశించి ఆయన ఈ విధంగా స్పందించారు. కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీ కరించి, చర్చల వేదిక వద్దకు తీసుకురావడానికి ఇరాన్‌కు చైనా సహాయం చేసిందని అమెరికా అధ్యక్షుడు అన్నారు.

చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి సంబంధిత దేశాల విదేశాంగ మంత్రులతో 26 సార్లు ఫోన్ సంప్రదింపులు జరిపారని, అదే సమయంలో మధ్యప్రాచ్య సమస్యపై చైనా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి సంబంధిత పక్షాల మధ్య దౌత్యం నిర్వహించారని మావో అన్నారు. గల్ఫ్-మధ్య ప్రాచ్య ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి చైనా, పాకిస్తాన్‌లు సంయుక్తంగా ఐదు సూత్రాల ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి అని మావో తెలిపారు. ఒక బాధ్యతాయుతమైన ప్రధాన దేశంగా, గల్ఫ్ -మధ్యప్రాచ్యంలో శాంతి భద్రతలను పునరుద్ధరించడంలో చైనా తన పాత్రను కొనసాగిస్తూ, తోడ్పాటు అందిస్తుందని మావో అన్నారు.

## దాడులు నిలిపివేస్తేనే శాంతి నిర్ణయానికి మద్దతు: ఇజ్రాయెల్

**టెల్ అవీవ్, ఏప్రిల్ 8:** అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రపంచవ్యాప్తంగా ఆశలు చిగురిస్తున్న తరుణంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఒక కీలక ప్రకటన చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ శాంతి నిర్ణయానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలుపుతూనే మరో సంచలన విషయాన్ని బయట పెట్టారు. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై దాడులను నిలిపి వేయడం వంటి షరతులకు ఇరాన్ అంగీకరించిన నేపథ్యంలోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని ఇజ్రాయెల్ పేర్కొంది. ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణి ప్రయోగాలు, ఉగ్రవాద కార్యకలాపాల నుంచి ప్రపంచానికి ముప్పు కలగకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తాము సమర్థిస్తున్నట్లు నెతన్యాహు వెల్లడించారు. ఇరాన్‌తో జరగబోయే చర్చల్లో ఇజ్రాయెల్, దాని మిత్ర దేశాల ప్రయోజనాలకు భంగం కలగకుండా చూస్తామని అమెరికా తమకు హామీ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రకటనకు, ఇజ్రాయెల్ వైఖరికి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. లెబనాన్ సహా అన్ని ప్రాంతాల్లో కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని షెహబాజ్ షరీఫ్ ప్రకటించగా నెతన్యాహు మాత్రం లెబనాన్‌ను ఈ పరిధి నుంచి మినహాయించారు అని తెలిపారు. అంటే ఇరాన్‌తో యుద్ధం ఆగినా లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతాయనేది స్పష్టం అవుతోంది. మరోవైపు ఇరాన్ ప్రతిపాదించిన తన 10 సూత్రాల శాంతి ప్రణాళికలో తమ మిత్రదేశాలపై కూడా దాడులు చేయకూడదని ఒక ప్రధాన షరతును విధించింది. ఇజ్రాయెల్ మాత్రం ఈ షరతును ఏమాత్రం పట్టించుకోకుండా దక్షిణ లెబనాన్‌లోని ప్రధాన నగరాల లక్ష్యంగా ఐడీఎఫ్ దళాలతో భీకర దాడులు చేస్తోంది. కాల్పుల విరమణ చర్చలు జరుగుతున్నప్పటికీ లెబనాన్ సరిహద్దులో ఇజ్రాయెల్ తన సైనిక చర్యలను మరింత ఉధృతం చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## సీజ్ ఫైర్‌ను స్వాగతించిన భారత్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** అమెరికా- ఇరాన్ సంఘర్షణలో కాల్పుల విరమణ ప్రకటనపై భారత ప్రభుత్వం తొలిసారి స్పందించింది. బుధవారం విదేశాంగ మంత్రిత్వ శాఖ కాల్పుల విరమణను స్వాగతిస్తూ ఒక ప్రకటనను జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ పశ్చిమ ఆసియాలో శాశ్వత శాంతిని నెలకొల్పుతుందని ఆశిస్తున్నట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉద్రిక్తతలకు చర్చల ద్వారా పరిష్కారం లభించాలని భారతదేశం మొదటి నుంచీ వాదిస్తోందని విదేశాంగ ప్రతినిధి రణదీప్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత సంఘర్షణకు త్వరితగతిన ముగింపు పలకడానికి ఉద్రిక్తతలను తగ్గించడం అత్యవసరమని, శాంతిని నెలకొల్పడానికి చర్చలు, దౌత్యం కీలకమని మేము నిరంతరం చెబుతూనే ఉన్నామని ఆ ఆయన అన్నారు. నెల రోజులకు పైగా కొనసాగుతున్న అమెరికాఇజ్రాయెల్ఇరాన్ ఘర్షణ వల్ల జరిగిన నష్టంపై విదేశాంగ మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘర్షణ ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగింది. పౌరులకు తీవ్ర ఇబ్బందులు కలిగించిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. హోర్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరాలు, ప్రపంచ వాణిజ్యం ఇకపై కొనసాగుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొంది.



**తక్షణమే ఇరాన్ విడిచి వెళ్లండి:** మరోవైపు, కాల్పుల విరమణ ప్రకటన అనంతరం, ఇరాన్‌లో చిక్కుకుపోయిన తమ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లాలని భారత్ సూచించింది. ఇరాన్‌లోని తమ రాయబార కార్యాలయం అందించిన మార్గాలను ఉపయోగించుకోవాలని భారత్ తన పౌరులకు సలహా ఇచ్చింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం బుధవారం ఒక సలహాలో పేర్కొంది, ఏప్రిల్ 7నాటి సలహాకు కొనసాగింపుగా ఇటీవలి పరిణామాల దృష్ట్యా, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుని, అది సూచించిన మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా ఇరాన్‌ను విడిచి వెళ్లాలని సూచించింది. రాయబార కార్యాలయంతో ముందస్తు సంప్రదింపులు, సమన్వయం లేకుండా ఏ అంతర్జాతీయ భూ సరిహద్దును సమీపించడానికి ప్రయత్నించవద్దని పునరుద్ఘాటించిందని భారత రాయబార కార్యాలయం పేర్కొంది. ఈ సలహాలో, రాయబార కార్యాలయం తన పౌరుల కోసం అత్యవసర నంబర్లను అందుబాటులో ఉంచింది.

## లెబనాన్‌కు వర్తించదు: నెతన్యాహు

### దాడులు ఆపకుంటే మీపై దాడులుచేస్తాం: ఇరాన్

**టెల్ అవీవ్, టెహ్రాన్, ఏప్రిల్ 8:** ఇరాన్అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇంకా తగ్గినట్లు కనిపించడం లేదు. ఈ ఒప్పందాన్ని స్వాగతించిన ఇజ్రాయెల్ ఇది లెబనాన్‌కు మాత్రం వర్తించబోదని చెప్పింది. దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తూనే ఉంది. దీనిపై ఇరాన్ స్పందించింది. లెబనాన్‌పై దాడులు ఆపకుంటే ఇజ్రాయెల్‌పై తాము కూడా దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరానియన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మరికొన్ని గంటల్లోగా దక్షిణ లెబనాన్‌పై దాడులు ఆపకపోతే మేం ఇజ్రాయెల్‌పై వైమానిక, క్షిపణి దాడులు చేస్తామని హెచ్చరించింది. అమెరికాతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో ఇరాన్ తమతోపాటు లెబనాన్ వంటి తమ మిత్ర దేశాలపై కూడా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఆపాలని డిమాండ్ చేసింది. ఈ విషయాన్ని మధ్యవర్తిత్వం వహించిన పాక్ కూడా ధృవీకరించింది. లెబనాన్‌కు కూడా కాల్పుల విరమణ ఒప్పందం వర్తిస్తుందని పాక్ ప్రధాని షెహబాజ్ కూడా స్పష్టం చేశాడు. కానీ, ఇజ్రాయెల్ దీన్ని ఖండించింది. ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టం చేసింది. లెబనాన్‌లోని ఇరాన్ మద్దతుగా ఉన్న హెజ్బొల్లా తీవ్రవాద స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. తాజాగా, లెబనాన్‌లోని ఒక పట్టణానికి ఇజ్రాయెల్ హెచ్చరిక జారీ చేసింది.



అక్కడి ప్రజలందరూ నగరం నుంచి తరలి వెళ్లాలని సూచించింది. ఇప్పటిదాకా అటు ఇరాన్‌పై విరుచుకుపడుతూనే, ఇటు లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ దాడులకు బదులుగా హెజ్బొల్లా కూడా ఎదురు దాడికి దిగింది. కానీ, అమెరికాతో ఇప్పుడు కుదిరిన కాల్పుల ఒప్పందం ప్రకారం హెజ్బొల్లా కూడా కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్ కూడా బుధవారం ఉదయం దుబాయ్, సౌదీ, కువైట్ వంటి గల్ఫ్ దేశాలపై కొన్ని క్షిపణుల్ని ప్రయోగించినట్లు సమాచారం. అయితే, వాటిని క్షిపణి రక్షక వ్యవస్థలు అడ్డుకున్నట్లు ఆ దేశాలు ప్రకటించాయి.

## అటు కాల్పుల విరమణ.. ఇటు క్షిపణి దాడులు

**టెహ్రాన్, ఏప్రిల్ 8:** అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. పశ్చిమాసియాలోని పలు ప్రాంతాల్లో దాడులు కొనసాగడం ఆందోళన రేకెత్తిస్తోంది. తమ దేశానికి చెందిన లావన్ ద్వీపంపై బుధవారం దాడులు జరిగినట్లు ఇరాన్ వెల్లడించింది. ఈ దీవిలోని చమురు శుద్ధి కేంద్రాన్ని శత్రువులు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడి కారణంగా ఆయిల్ రిఫైనరీలో మంటలు చెలరేగాయని, అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఇరాన్ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడిలో ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు తెలియరాలేదు. మరోవైపు ఈ దాడులు ఎవరు చేశారన్న దానిపై కూడా స్పష్టత లేదు.



**కువైట్‌లోనూ దాడులు:** అటు కువైట్‌లోని పలు చమురు, విద్యుత్ క్షేత్రాలపైనా బుధవారం దాడులు కొనసాగాయి. దాదాపు 28 ఇరాన్ డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుందని కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. చమురు శుద్ధి కేంద్రాలు, విద్యుత్ ప్లాంట్లపై డ్రోన్ దాడులు జరగడంతో భారీ నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని కొన్ని ప్రాంతాలపై క్షిపణి దాడులు జరిగాయి. వీటిని సమర్థంగా అడ్డుకున్నట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. రెండు వారాల కాల్పుల విరమణకు అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గందరగోళానికి దారితీసింది.

## ఆందోళన రేకెత్తిస్తోన్న ఇజ్రాయెల్ చర్యలు



**టెల్అవీవ్, ఏప్రిల్ 8:** ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణకు అంగీకారమే కానీ.. లెబనాన్‌పై మాత్రం దాడులు ఆపబోమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఖండించిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 'కొన్ని గంటల్లో లెబనాన్‌లో కాల్పులు ఆపకపోతే.. టెల్అవీవ్(ఇజ్రాయెల్)లో బాంబుల మోత మోగుతుంది' అని హెచ్చరించినట్లు వెల్లడించాయి. కాల్పుల విరమణపై నెలకొన్న అనిశ్చితే ఇరువర్గాల ప్రకటనలకు కారణం. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా గ్రూప్ ఇప్పటికే కాల్పుల విరమణకు అనుకూలంగా సంకేతాలు పంపింది. కానీ ఇజ్రాయెల్ స్పందన భిన్నంగా ఉంది. ఈ సీజ్‌ఫైర్‌లో లెబనాన్ కూడా భాగమని మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ ప్రకటించింది. అమెరికాతో కుదిరే ఏ ఒప్పందంలో అయినా లెబనాన్‌లో కాల్పులు ఆగాలనే క్లాజ్ ఇరాన్ కోరుకుంది. కానీ ఇజ్రాయెల్ దానిని వ్యతిరేకిస్తోంది.

# ఎడప్పాడిలో టివికె అరుణ్ నామినేషన్ తిరస్కృతి

**చెన్నై, ఏప్రిల్ 8:** తమిళనాడు రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేయాలని తమిళగ వెట్రి కళగం పార్టీని స్థాపించిన విజయ్‌కు అదృష్టం ఈసారి అస్సలు కలిసి రాలేదు. ప్రతిష్టాత్మకమైన ఎడప్పాడి నియోజకవర్గంలో పోటీ చేసి తన సత్తా చాటాలని ఆశించిన దళపతికి, నామినేషన్ల పర్వంలోనే చుక్కెదురైంది. తన అభ్యర్థి అరుణ్ కుమార్ నామినేషన్ తిరస్కరణకు గురవ్వడమే కాకుండా, ఆయన అదృశ్యం కావడం విజయ్ అభిమానులను, పార్టీ శ్రేణులను షాక్ కు గురి చేస్తోంది. రాజకీయాల్లోకి రావడం ఒకెత్తయితే, అక్కడి క్లిష్టమైన నిబంధనలను అర్థం చేసుకోవడం మరో ఎత్తు. కనీసం 10 మంది ప్రతిపాదకుల సంతకాలు ఉండాలనే చిన్న నియమాన్ని పాటించకపోవడంతో ఎడప్పాడి టీవీకే అభ్యర్థి అరుణ్ కుమార్ నామినేషన్ వీగిపోయింది. ఎన్నికల యుద్ధ భూమిలోకి కత్తి పట్టకుండానే విజయ్ సైన్యం ఓటమిని అంగీకరించినట్లయింది. ప్రత్యామ్నాయ అభ్యర్థి నిత్యా నామినేషన్ కూడా ఇదే కారణంతో రిజెక్ట్ అవ్వడం పార్టీలోని అజాగ్రత్తను ఎత్తి చూపుతోంది. హేమాహేమీలు పోటీ పడే చోట ఇంతటి చిన్న తప్పులు చేయడం విజయ్ రాజకీయ భవిష్యత్తుపై విమర్శలకు తావిస్తోంది. అభ్యర్థి అరుణ్ కుమార్ మాయం కావడం ఈ కథలో అసలైన ట్విస్ట్. నామినేషన్ల పరిశీలన సమయంలో ఆయన కనిపించకపోవడంతో ప్రత్యర్థి పార్టీల వారు కిడ్నాప్ చేశారంటూ టీవీకే కార్యకర్తలు రోడ్లపైకి



వచ్చి ఆందోళన చేపట్టారు. సినిమాటిక్ స్టైల్లో జరిగిన ఈ అదృశ్యం వెనుక రాజకీయ కుట్ర ఉందా లేక నామినేషన్ రిజెక్ట్ అవుతుందని తెలిసి అభ్యర్థే తప్పుకున్నారా అన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది. అభ్యర్థిని కాపాడుకోలేకపోవడం విజయ్ లీడర్‌షిప్ కు పరీక్షగా నిలుస్తోంది. అన్నాడీఎంకే దిగ్గజం ఎడప్పాడి పళనిస్వామిని ఆయన సొంత గడ్డపై ఢీకొట్టాలని భావించిన విజయ్ ప్లాన్ ఇప్పుడు రివర్స్ అయింది. నియోజకవర్గంలో టీవీకే జెండా ఎగిరే అవకాశం కూడా లేకుండాపోవడంతో, విజయ్ తొలి ఎన్నికల సమరంలోనే ఒక కీలక స్థానాన్ని కోల్పోయారు. ఇది కేవలం సాంకేతిక లోపం కాదు, విజయ్ రాజకీయ ప్రయాణంలో ఎదురైన మొదటి పరాజయం అని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ప్రజల్లో విపరీతమైన క్రేజ్ ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో యంత్రాంగం లోపించడం వల్లే విజయ్ ఈ షాక్ తిన్నట్లు కనిపిస్తోంది.

## ఓటు హక్కుపై చైతన్యపరుస్తూ కేరళం సిఇఒ డ్యాన్స్

**తిరువనంతపురం, ఏప్రిల్ 8:** కేరళ సహా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేరళ ఓటర్లలో ఓటర్లలో చైతన్యం పెంపొందించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సిఇఒ) రతన్ యూ కేల్కర్ డ్యాన్స్ చేశారు. ఈ డ్యాన్స్ నెటిజన్‌లను తెగ ఆకట్టుకుంటున్నది. ఇటీవల కొచ్చిలో భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ విడుదల చేసిన వీడియోలో ఆ డ్యాన్స్‌కు సంబంధించిన దృశ్యాలు ఉన్నాయి. మొత్తం 1.33 నిమిషాల నిడివిగల ఈ వీడియోలో కేల్కర్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి సముద్ర తీరంలో డ్యాన్స్ చేస్తున్నారు. తిరువనంతపురం కలెక్టర్ అనుకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివశక్తివేల్ తదితర



అధికారులు వీడియోలో ఉన్నారు.ఇది మీ ఓటు మన రాష్ట్రానికి మీ ఓటు అవసరం ఉంది. ఒకే లక్ష్యం ఆటను మార్చగలదు. ఒక ఓటు తలరాతను మార్చగలదని ఈ వీడియో సాంగ్‌లో ఉంది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ విడియో కేరళ ఓటర్లను కూడా విపరీతంగా ఆకట్టుకుంటోంది.

## తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బదలీ

### డివిఎసి చీఫ్‌గా సందీప్ మిట్టల్

### ఎన్నికల సంఘం తక్షణ ఆదేశాలు

**చెన్నై, ఏప్రిల్ 8:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఎన్. మురుగానందంను తక్షణమే ఆ బాధ్యతల నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం. సాయికుమార్‌ను కొత్త సీఎస్‌గా నియమించింది. ఈ మార్పులను వెంటనే అమలు చేసి, బుధవారం సాయంత్రం 6 గంటలలోపు నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరి, పారదర్శకత కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. ఈ మార్పులతో పాటు పరిపాలనలో మరో కీలక మార్పు కూడా చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ




కరప్షన్ (డీవీఏసీ) చీఫ్‌గా ఉన్న డేవిడ్సన్ దేవశిర్వతంను బదిలీ చేసి, ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి సందీప్ మిట్టల్‌ను నియమించింది. మిట్టల్, డీవీఏసీతో పాటు ఆర్మ్డ్ పోలీస్ విభాగం అధిపతిగా కూడా వ్యవహరిస్తారు. బదిలీ అయిన అధికారులకు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎలాంటి ఎన్నికల సంబంధిత విధులు కేటాయించవద్దని ఎన్నికల సంఘం తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకున్న తరుణంలో అధికార యంత్రాంగం దుర్వినియోగం కాకుండా, ప్రజలకు స్వేచ్ఛాయుత ఎన్నికలపై నమ్మకం కలిగించేందుకే ఈసీ ఇలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నది.

## టిఎంసి నేతలకు సిఇసి సీరియస్ వార్నింగ్


**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఈసారి బెంగాల్‌లో ఎన్నికలు స్వేచ్ఛగా, నిర్భయంగా జరుగుతాయని పేర్కొంది. ఈసీ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ పోస్టు చేస్తూ హింస లేకుండా, బెదిరింపులు లేకుండా, తనిఖీలు లేకుండా, పోలింగ్ బూత్‌ల్లో జామ్ లేకుండా ఎన్నికల నిర్వహణ జరగనున్నట్లు ఈసీ పేర్కొన్నది. ఇక ఆ రాష్ట్రానికి చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కూడా ఈసీ గట్టి వార్నింగ్ ఇచ్చింది. టీఎంసీకి సూటిగా హెచ్చరిక చేస్తున్నట్లు తన ట్వీట్‌లో ఈసీ చెప్పింది. కచ్చితంగా ఈసారి బెంగాల్‌లో ఎన్నికలు నిర్భయంగా, స్వేచ్ఛగా జరుగుతాయని పేర్కొన్నది. బుధవారం సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తృణమూల్ నేతలు కలిశారు. అక్కడ టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ సీఈసీపై గట్టిగా అరి చినట్లు




తెలిసింది. ఆ సమయంలో సీఈసీ జ్ఞానేశ్, డెరిక్ ఒబ్రెయిన్ మధ్య వాగ్వాదం నడి చింది. తమను వెళ్లిపోవాలని సీఈసీ అరిచినట్లు ఒబ్రెయిన్ ఆరోపించారు. టీఎంసీ నేత చేసిన వ్యాఖ్యలను ఈసీ కొట్టిపారేసింది. సీఈసీని కలిసినవారిలో మేనకా గురుస్వామి, సాగరికా ఘోష్, సాకేత్ గోకలే ఉన్నారు. 27 లక్షల మంది ఓటర్ల తొలగింపు అంశంలో ఈసీతో చర్చించేందుకు టీఎంసీ ప్రయత్నించింది. ఏప్రిల్ 23, 29 తేదీల్లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

## గుజరాత్ ప్రజలకు క్షమాపణలు చెప్పిన ఖర్గే


**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** గుజరాత్ ప్రజల గురించి తాను చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే క్షమాపణలు చెప్పారు. గుజరాత్ ప్రజల పట్ల నాకు ఎప్పుడూ అత్యంత గౌరవం ఉంది, ఎప్పటికీ ఉంటుంది. వారి మనోభావాలను దెబ్బతీయడం నా ఉద్దేశం కాదని అన్నారు. ఆదివారం కేరళలోని ఇడుక్కి జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ, గుజరాత్‌లోని నిరక్షరాస్యుల వలె కాకుండా, రాష్ట్ర ప్రజలు విద్యావంతులు, తెలివైనవారని, వారిని తప్పుదోవ పట్టించలేరని అన్నారు. ఆయన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. దీంతో మల్లిఖార్జున ఖర్గే వివరణ ఇచ్చుకున్నారు. గుజరాత్ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. బీజేపీ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, ఖర్గే ప్రకటనతో రాహుల్ గాంధీ ఏకీభవిస్తున్నారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి కించిత్ ఇంగితజ్ఞానం ఉంటే, ఆయన ఆ వ్యాఖ్య నుండి తనను తాను దూరం చేసుకోవాలి, దానిని ఖండించాలి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లిఖార్జున ఖర్గే నేడు నిర్వహిస్తున్న పదవిని గతంలో జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, మౌలానా ఆజాద్, సోనియా



గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, చివరికి రాహుల్ గాంధీ వంటి నాయకులు కూడా నిర్వహించారని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఇంతటి ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి ఎలాంటి భాషను ఉపయోగిస్తున్నారు ఖర్గే వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయంటూ ఖండించారు. వివాదం ముదిరిపోతుండటాన్ని చూసి, మల్లిఖార్జున ఖర్గే బుధవారం క్షమాపణ చెప్పారు. కేరళలో ఇటీవల చేసిన ఎన్నికల ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారు. నేను బాధ్యతాయుతంగా విచారం వ్యక్తం చేస్తున్నాను. గుజరాత్ ప్రజల పట్ల నాకు ఎల్లప్పుడూ అత్యంత గౌరవం ఉంది, ఎప్పటికీ ఉంటుంది. వారి మనోభావాలను దెబ్బతీయడం నా ఉద్దేశం ఎప్పుడూ కాదంటూ వారికి క్షమాపణలు చెప్పారు.

## తమిళనాట అభ్యర్థుల్లో సూపర్‌రిచ్ లీమా రోజ్

### మొత్తం రూ.6 వేల కోట్ల విలువైన ఆస్తులున్నట్లు అఫిడవిట్




**చెన్నై, ఏప్రిల్ 8:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 58 ఏళ్ల అన్నాడీఎంకే అభ్యర్థిని లీమా రోజ్ అత్యధిక సంపన్నురాలిగా నిలిచారు. ఆమె కుటుంబ ఆస్తుల విలువ రూ.5,863 కోట్లు కాగా, స్వయంగా ఆమె ఆస్తుల విలువే రూ.1,049 కోట్లుగా ఉన్నది. తిరుచ్చి జిల్లా లాల్గుడి నియోజకవర్గం నుంచి లీమా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగారు. లీమా లాటరీ టికెట్ల విక్రయ సంస్థ అధినేత మార్టిన్ సతీమణి. ఆమె ఇటీవలే అన్నాడీఎంకే పార్టీలో చేరారు.

లీమా తన నామినేషన్‌తోపాటు సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను వెల్లడించారు. తన పేరిట 19 కిలోల బంగారం, 1,217 క్యారెట్ల వజ్రాలు, 13 కిలోల వెండి, 33 గ్రాముల ప్లాటినం ఉన్నాయని ఆమె తెలిపారు. తనకు రూ.139.63 కోట్ల చరాస్తులు, రూ.909.94 కోట్లు స్థిరాస్తులు, రూ.8.57 కోట్ల అప్పులు ఉన్నాయని తెలిపారు.

తన భర్త మార్టిన్ పేరిట రూ.4,100 కోట్ల పైచిలుకు ఆస్తులు ఉన్నాయని వెల్లడించారు. అందులో రూ.887.36 కోట్ల విలువైన చరాస్తులు, రూ.3,262 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయన్నారు. తన భర్త పేరిట 281 గ్రాముల బంగారం, 9.83 క్యారెట్ల వజ్రాలు, 21 కిలోల వెండి, 321 గ్రాముల విలువైన ముత్యాలు ఉన్నాయని లీమా తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. కుమారుడు జోస్ చార్లెస్ మార్టిన్ పేరిట కూడా రూ.655 కోట్లు విలువైన ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. తన కుటుంబం మొత్తం ఆస్తుల విలువ సుమారుగా రూ.6 వేల కోట్లు ఉంటుందని తెలిపారు.

అదేవిధంగా ఆమె ఆరో తరగతి వరకు మాత్రమే చదువుకున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తనపై నాలుగు పెండింగ్ కేసులు కూడా ఉన్నట్లు వెల్లడించారు.



## మమత నామినేషన్ దాఖలు

**కోల్‌కతా, ఏప్రిల్ 8:** పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గం భవానీ పుర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. తన జీవితం అంతా ఇక్కడినుంచే మొదలైందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. నామినేషన్ వేయడానికి ముందు ఖాళీఘాట్‌లోని నివాసం నుంచి అలీపుర్ సర్వే భవనం వరకు ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ క్రమంలో ఆమె మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆమె ఇక్కడ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆ తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ నేను పుట్టింది, పెరిగింది భవానీపుర్‌లోనే అన్నారు. ఇక బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23,29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది.



## మొహిసినా కిద్వాయ్ కన్నుమూత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి మొహసినా కిద్వాయ్ కన్నుమూశారు. ఆమె వయస్సు 94 సంవత్సరాలు. వృద్ధాప్యం, అనారోగ్య సమ స్యలతో బాధపడుతున్న ఆమె బుధవారం తెల్లవారు జామున నోయిడాలోని మెట్రో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆమె పార్థివ దేహానికి ఈ సాయంత్రం 5 గంటలకు దేశ రాజ ధానిలోని నిజాముద్దీన్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ మంత్రివర్గాల్లో కీలకశాఖలు నిర్వర్తించారు. మొహసినా కిద్వాయ్ మరణం పట్ల కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంతాపం తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి విధేయురాలిగా అభివర్ణించారు. ఈ కష్టసమయంలో ఆమె కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. 1932 జనవరి 1న ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీలో జన్మించిన మొహసినా కిద్వాయ్, చిన్న వయసులోనే ప్రజా జీవితంలోకి వచ్చారు. తొలుత రాష్ట్రం, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు.

# ప్రతి మహిళ సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలి




బుధవారం సికిందరాబాద్ బోయిగూడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన సురక్షి త మాతృత్వ దినోత్సవంలో ప్రసంగిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

### పోషణ కౌన్సెలింగ్ బలోపేతంపై దృష్టి

### మాతృ మరణాల తగ్గింపుపై ప్రత్యేకదృష్టి

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్ (సికిందరాబాద్,) ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తెలంగాణలోని ప్రతి మహిళ, ప్రతి తల్లి సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవాల సందర్భంగా బుధవారం సికిందరాబాద్ బోయిగూడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో సురక్షిత మాతృత్వ దినోత్సవం కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో మాతృ ఆరోగ్య పరిరక్షణ, పోషణ, కౌన్సెలింగ్ అలాగే సేవల బలోపేతంపై తీసుకుంటున్న చర్యలపై సంబంధిత శాఖల ఉన్నతాధి కారులు వివరించారు. ఈ సందర్భం గా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లా డుతూ మాతృత్వం ఒక గొప్ప వరమని, ప్రతి గర్భిణి సురక్షి తంగా, ఆరోగ్యంగా ప్రసవం జరిగేలా ఉండాలని వైద్యాధికారులు నిరంతరం అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. తెలంగాణలో అధికంగా ఉన్న సిసెక్షన్ శాతాన్ని తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు మిడ్‌వైఫరీ సేవలను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళా కేంద్రిత ఆరోగ్య సేవలను విస్తరించడంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. మిడ్‌వైఫరీపై ప్రత్యేక విధానాన్ని రూపొందించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తామని, శిశు మరణాల రేటును సింగిల్ డిజిట్‌కు తీసుకురావడంపై ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. వైద్య విభాగంలో వైద్యులు, సిబ్బంది అత్యధికులు మహిళలే కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేయడంతో పాటు, ఇటీవల జరిగిన సివిల్ అసిస్టెంట్ సర్జన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఎంపికలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు మహిళలు ఎంపికైన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కీలకమైన శాఖ బాధ్యతను ఒక మహిళా కమిషనర్‌కు, మహిళా ప్రధాన కార్యదర్శికి అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఆయన ధన్యవాదు తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీ వైద్య ఆరోగ్య శాఖ క్రిస్టినా చోంగ్తు మాట్లాడుతూ సురక్షి త మాతృత్వం కోసం యవ్వన దశ నుంచే ఆరోగ్య అవగాహన, పోషణ, మెన్స్ట్రువల్ హైజీన్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య మహిళ క్లినిక్‌ల ద్వారా మహిళలకు ప్రత్యేక స్క్రీనింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. స్క్రీనింగ్ అనంతరం రిఫరల్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. రాష్ట్రంలో 99.9 శాతం సంస్థాగత ప్రసవాలు ఉన్నప్పటికీ సిసెక్షన్ పెరుగుతున్న నేపథ్యంలో మిడ్‌వైఫరీ సేవలను అన్ని నర్సింగ్ కళాశాలలకు విస్తరించాలని సూచించారు. ప్రసవానంతర తొలి 14 రోజుల్లో గృహ సందర్శ నలు కీలకమని, ఈ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖతో సమన్వయంతో గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నపిల్లలకు సమగ్రమైన మెరుగైన సేవలు అందుతున్నాయని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో అనీమియా ప్రధాన సమస్యగా ఉన్నందున ఆరోగ్యలక్ష్మి ్మ పథకం ద్వారా రోజుకు 2 లక్షలకుపైగా గర్భిణీలకు పోషకాహారం అందిస్తున్నామని అన్నారు. ప్రసవానంతర తల్లులకు కూడా ఆరు నెలలపాటు పోషకాహారం అందిస్తు న్నామని, తల్లులు, శిశువులకు సరైన పోషణ, తల్లిపాలు, శిశు సంరక్షణపై కౌన్సెలింగ్ సేవలను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కమిషనర్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంగీత సత్యనారాయణ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. పిహెచ్‌సీలలో 740 ప్రత్యేక శిబిరాలు నిర్వహించి సుమారు 15 లక్షల మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు. గ్రామ స్థాయిలో 65 వేలకుపైగా హెల్త్ క్యాంపులు నిర్వహించి 1.80 లక్షల యాంటీనేటల్ చెకప్‌లు చేసినట్లు వివరించారు. 1.64 లక్షల మందికి అనీమియా స్క్రీనింగ్ చేసి ఐఎఫ్‌ఏ మాత్రలు అందించామని అన్నారు. ప్రతి గర్భిణికి హెచ్‌ఐవి, సిఫిలిస్, హెపటైటిస్, టిబి పరీక్షలు నిర్వహిస్తూ హై రిస్క్ గర్భధారణలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన మహిళలు తమ అనుభవాలను పంచుకుని ప్రభుత్వం ద్వారా అందుతున్న వైద్య సేవలను ప్రశంసించారు. అనంతరం మంత్రి గర్భిణీ స్త్రీల పోషణ, గర్భధారణలో తీసు కోవాల్సిన జాగ్రత్తలు, పోషక ఆహారం, మందుల వినియోగంపై ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలించారు. అనీమియా ముక్త భారత్ కార్యక్రమం సంబంధించిన ఈ లెర్నింగ్ మాడ్యూల్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ డా. రవీంద్ర నాయక్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యు కేషన్ డా. నరేంద్ర, తెలంగాణ వైద్య విధాన పరిషత్ డైరెక్టర్ డా. అజయ్, ఆయుష్ డైరెక్టర్ డా. శ్రీకాంత్, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ సంస్థ ఛైర్‌పర్సన్ డా. కవిత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వెంకటి, యూనిసెఫ్ ప్రతినిధులు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ మరియు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

## ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని హారీశ్‌రావు కుట్రలు

### బిఆర్‌ఎస్ దోపిడీ అడ్డుకోలేదనే జనం బిజెపికి అధికారం ఇవ్వలేదు: ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ను బదనం చేయాలని హరీష్ రావు ప్రయత్నం చేస్తున్నారనీ భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆవేదన చెందారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ఎప్పటికీ అధికారం కోల్పోదని హరీశ్‌రావు కలకన్నారనీ, బామ్మర్ది కెటిఆర్ తో ఏమి కాదని, మామ కెసిఆర్ తరువాత అల్లుడు హరీష్ రావు సిఎం కావాలని అనుకున్నారని అన్నారు. బిఆర్‌ఎస్ 2014 మేనిఫెస్టో 2018 మేనిఫెస్టో మీరు ఇచ్చిన వాగ్దానాల పై చర్చ కు మేము సిద్ధమంటు సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల మీద బిఆర్‌ఎస్ వాళ్ళు మాట్లాడిన తరువాత అదే అంశం పై బిజెపి వాళ్ళు మాట్లాడుతారనీ ఎద్దేవా చేశారు. కేంద్రం లో 2014 నుండి ఇప్పటి వరకు ప్రజలను తప్పు తోవ పట్టించి బిజెపి అధికారంలోకి వచ్చిందని అన్నారు. బిఆర్‌ఎస్ వాళ్ళు దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి ఎందుకు చేయలేదనీ ప్రశ్నించారు. ఎన్ని డబుల్ బెడ్ రూమ్ లు జనాలను ఇచ్చారనీ అడిగారు. ఎంత మంది దళితులకు మూడు ఎకరాల భూములు ఇచ్చారనీ నిలదీశారు. బిఆర్‌ఎస్ పదేండ్లలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 30 శాతం కూడా అమలు చేయలేదనీ వివరించారు. బిఆర్‌ఎస్ చేసింది ఏమైనా ఉందా అంటే లక్షల కోట్ల అప్పులు తప్ప రాష్ట్రానికి చేసింది ఏమి లేదని భాష్యం చెప్పారు. ప్రజలు మాకు అధికారం ఇచ్చారు, మీలాగా కలలో ఉండడం లేదనీ వాస్తవంలో ఉంటున్నామని అన్నారు. పేపర్ లలో రావాలని మా ప్రభుత్వం మీద బండి సంజయ్ మాట్లాడుతున్నారు. మా రాష్ట్రాన్ని దోచుకున్నారనీ పదేండ్ల తరువాత పార్లమెంట్ లో కిషన్‌రెడ్డి లేచడాని పదేండ్లు ఏమి చేశారని ఆయన నిలదీశారు. కిషన్ రెడ్డి .తెలంగాణ ప్రజల మీద ప్రేమ ఉంటే అన్ని వేల కోట్ల రూపాయలు దోచుకున్న ఎందుకు సప్పుడు చేయలేదని అడిగారు. కిషన్ రెడ్డి ,రేవంత్ రెడ్డి లాగా మీరు కూడా రాష్ట్ర పార్టీకి ప్రెసిడెంట్ గా పని చేశారు మిమ్మల్ని జనాలు ఎందుకు నమ్మలేదు. మీరు పదేండ్ల లో బిఆర్‌ఎస్ దోపిడి అడ్డుకోలేదు కాబట్టి జనాలు మిమ్మల్ని పక్కకు పెట్టారు మాకు ఓటు వేశారని అన్నారు. మీరు చేసిన దోపిడీ మేము చేయమనీ, సమాచారం లేకుండా మాట్లాడకూడదనీ మేము ఎవరికి భూములు దారాదత్తం చేయడం లేదనీ ఆయన తెలిపారు. ప్రెస్ మీట్‌ల ద్వారా ప్రభుత్వాలు కూలిపోవనీ. 5 ఏండ్ల తర్వాత ఎన్నికలు వస్తాయనీ ఆయన అన్నారు. మోడీ అధికారం లోకి వచ్చిన తరువాత నల్ల ధనం వెలికితీస్తామని చెప్పారని ఇప్పటివరకు ఏమైంది అని అడిగారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయనీ బిజెపిని ప్రశ్నించారు. శబరిమల బంగారం స్కాం విషయంలో కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్ పై బిజెపి ఎందుకు చర్యలు తీసుకోలేదనీ ప్రశ్నించారు.

### ఆర్‌ఎస్‌ఎస్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఖర్గే

## బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### బిజెపి అధికారి ప్రతినిధి ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత, రెచ్చగొట్టే మరియు అత్యంత బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండించింది. ఖర్గే తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్. వి. సుభాష్ తీవ్రంగా స్పందిస్తూ, ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలని ఖర్గే చేసిన పిలుపును చారిత్రక అజ్ఞానం, రాజకీయ ప్రేరేపితం, ప్రమాదకరమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలుగా అభివర్ణించారు. ఇలాంటి వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, దాదాపు శతాబ్ద కాలంగా దేశ నిర్మాణానికి నిస్వార్థంగా కృషి చేస్తున్న సంస్థను అపఖ్యాతిపాలు చేసే ప్రయత్నమని ఆయన అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలని కోరడమే కాకుండా, ఆ సంస్థను విషసర్పంగా సంబోధిస్తూ అత్యంత అభ్యంతరకరమైన భాషను ఉపయోగించారని సుభాష్ మండిపడ్డారు. అంతేకాకుండా, ముస్లిం మైనారిటీలు అవసరమైతే తమ నమాజ్ ప్రార్థనలను కూడా పక్కనపెట్టి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఎదురైతే వారిపై దాడి చేయాలని, చంపాలని ఖర్గే రెచ్చగొట్టారని సుభాష్ ఆరోపించారు. ఖర్గే మాటలు విద్వేషపూరిత ప్రసంగం (హేట్ స్పీచ్) మరియు బహిరంగంగా హింసకు ప్రేరేపించడం కాకపోతే ఇంకేమిటని సుభాష్ ప్రశ్నించారు. ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడం, దశాబ్దాలుగా కాంగ్రెస్ పెంచి పోషిస్తున్న ప్రమాదకరమైన మనస్తత్వాన్ని బహిర్గతం చేస్తుందన్నారు.

# వాస్తవాలకు దూరంగా రాష్ట్ర బడ్జెట్

### 'టాస్క్' రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ధ్వజం

### రాష్ట్ర భవిష్యత్తు ఆకాంక్షలపై మేధోమథనం


ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదని, కేవలం అంకెల గారడీతో వాస్తవాలకు దూరంగా ఉందని పలువురు వక్తలు విమర్శించారు. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అధ్యయన సమాలోచన కేంద్రం (టాస్క్) ఆధ్వర్యంలో 'తెలంగాణ బడ్జెట్ 2026 భవిష్యత్తు ఆకాంక్షలు'పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్‌లోని లోపాలు, ప్రజా సమస్యలపై విస్తృత చర్చ జరిగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో బీజేపీయేతర రాష్ట్రాలపై చూపిస్తున్న వివక్షను గమనించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమానికి రూ. 1.60 లక్షల కోట్లు కేటాయించామని, అయితే పాత అప్పుల వడ్డీలు, ఈఎంఐలకే రూ. 42 వేలు కోట్లు ఖర్చవుతున్నాయని తెలిపారు. రాహుల్‌గాంధీ పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు కేటాయింపులు చేస్తున్నామని, ప్రతిపక్షాలు నిర్మాణాత్మక విమర్శలు చేయకుండా కేవలం వ్యక్తిగత విమర్శలకే పరిమితమవ్వడం సరికాదని హితవు పలికారు. బిఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ ప్రభుత్వం సంపద సృష్టించడంలో విఫలమైందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ బడ్జెట్ ప్రతిపాదనలు అశాస్త్రీయంగా ఉన్నాయని, ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చే ముందు ఆర్థిక నిపుణులను సంప్రదించకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని అన్నారు. విద్యారంగానికి కనీసం 17 శాతం నిధులు ఇవ్వాలని విద్యా కమిషన్ కోరినా, కేవలం 7 శాతం కేటాయించడం దారుణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో కోతలు విధిస్తే సామాజిక సాధికారత దెబ్బతింటుందని టాస్క్ కన్వీనర్ ఎర్రోజు శ్రీనివాస్ హెచ్చరించారు. రాష్ట్రంలో రైతు బీమా అందడం లేదని, కౌలు రైతుల గుర్తింపు లేకపోవడంతో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని నిపుణుడు పులి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపాదనలకు, వాస్తవ వ్యయానికి రూ. 70 వేల కోట్ల తేడా ఉందని ఆర్థిక విశ్లేషకులు పాపారావు దీనిని ఖిభ్రమల బడ్జెట్‌ఖిగా అభివర్ణించారు. ఈ సమావేశంలో టాస్క్ కోకన్వీనర్లు హెచ్. రవీందర్, రూబీ స్టీవెన్సన్, ఆసరి రాజు, డాక్టర్ సాజిదా ఖాన్ తదితరులు పాల్గొని బడ్జెట్‌లో వికేంద్రీకరణ, ఉద్యోగ భర్తీ, వైద్య రంగాల బలోపేతానికి తగిన సూచనలు చేశారు.

# మాది ప్రజాపాలన.. మీది నిర్బంధాల పాలన

### ప్రజలు మర్చిపోయారని హారీశ్‌రావు, కెటిఆర్ భ్రమపడొద్దు

### నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** మాది ప్రజా పాలన మీది నిర్బందాల పాలన ప్రజలు మరిచిపోయారని హారీశ్‌రావు కెటిఆర్‌లు భ్రమ పడొద్దని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి ఒక ప్రకటనలో తెలిపారు. చట్ట వ్యతిరేక పనులు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగచేస్తూ రోడ్లపై రాజ కీయాలు చేస్తాం అంటే ప్రభుత్వం ఊరుకోదని హెచ్చరించారు. చట్టం తన పరిధిలో పని చేస్తుంది.. రాజకీయ లబ్ది కోసం హరీష్ రావు రోజుకొక డ్రామా చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనీ ఆరోపించారు. అబద్దాల పునాదులపై రాజకీయాలు చేస్తూ పూట గడుపుకుంటున్న బిఆర్‌ఎస్ నాయకులను ప్రజలు నమ్మరని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రుల నేతృత్వంలోని ప్రజా పాలన ఈ రెండున్నర ఏళ్లలో ఎన్నో అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ఆయన వివరించారు.

ఇచ్చిన హామీల అమలు విషయంలో గతంలో ఏ ప్రభుత్వం, ఏ రాజకీయ పార్టీ, ఏ రాష్ట్రంలో కూడా చేయనంతగా చేసి చూపెట్టామని తెలిపారు. మీ బిఆర్‌ఎస్ పాలనలో 9 ఏళ్ళు ఎంత నిర్బంధం అమలు చేశారో ప్రజలకు తెలుసనీ అన్నారు. ఇప్పుడు దయ్యాలు వేదాలు వల్లించినట్టు అక్రమ అరెస్టులు, నిర్బంధం అని మాట్లాడితే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందనీ అన్నారు. ఒక చిన్న నిరసన కార్యక్రమాలు ఇస్తే చిన్న మండల నాయకుడి నుంచి పిసిసి అధ్యక్షుడు వరకు అందరిని గృహ నిర్బంధం చేసిన చరిత్ర మీదనీ తెలిపారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన కోదండరామ్‌ని అర్ధరాత్రి ఇంటి తలుపులు బద్దలు కొట్టి అక్రమ అరెస్టులు చేశారని గుర్తుచేశారు.. లేని కేసులు పెట్టి పిసిసి అధ్యక్షులుగా ఉన్న రేవంత్ ని అర్ధరాత్రి బెడ్ రూమ్ లోనించి లాక్కెళ్లారని ఆవేదన చెందారు. ప్రజాస్వామ్య బద్దంగా ప్రజా పాలన చేస్తున్నాము. ప్రజలు మీ పాలన.. మా పాలన రెండు చూస్తున్నారు.. వాళ్లే నిర్ణయిస్తారుని ఆయన అన్నారు.

# ఎసిబి వలలో ఇద్దరు పోలీసు అధికారులు


ఎసిబి చిక్కిన పోలీసు అధికారులు

**రంగారెడ్డి అర్బన్ (శంషాబాద్), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్‌లో లంచం తీసుకుంటూ ఇద్దరు పోలీస్ అధికారులు ఎసిబి వలలో చిక్కారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్ సిద్ధేశ్వర్‌ను ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం ప్రారంభమైన ఎసిబి దాడులు రాత్రి అర్ధరాత్రి వరకు కొనసాగాయి. బుధవారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా ఎసిబి రేంజ్ డిఎస్పీ ఆనంద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కేరళకు చెందిన ఓ వ్యక్తి నకిలీపత్రాల కేసులో అరెస్టయ్యాడు. నిందితుడు ప్రతివారం పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాల్సి ఉంది. నకిలీ విద్యాసర్టిఫికెట్ల కేసులో ప్రధాననిందితుడు జైలుకు వెళ్లి ఇటీవలే విడుదల య్యాడు. అయితే ప్రతివారం హాజరుకావడం బాధితుడికి ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకున్న సిఐ కనకయ్య, ఎస్‌ఐ సిద్ధేశ్వర్ బాధితుడి కుటుంబ సభ్యులను అరెస్ట్ చేస్తామని బెదరిస్తూ, వారిని విడిచిపెట్టేందుకు రూ.15 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. చర్చల అనంతరం ఈ మొత్తం రూ.2 లక్షలకు తగ్గించగా బాధితుడు ఎసిబిని ఆశ్రయించాడు. లంచం స్వీకరిస్తున్న సమయంలో ఇద్దరు పోలీ సులను ఎసిబి అధికారులు పట్టుకు న్నారు. సిఐ కనకయ్య పారిపోవడానికి ప్రయ త్నించగా, వెంటాడి అదుపులోకి తీసుకు న్నారు. ఈ కేసులో అరెస్టయిన ఇన్‌స్పెక్టర్ కనకయ్య, ఎస్‌ఐ సిద్దేశ్వర్‌లను వైద ్య పరీక్షల తరువాత బుధవారం మధ్యాహ్నం ఎసిబి అధికారులు ఎసిబి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసు ను విచారించిన న్యాయమూర్తి ఇద్దరికి రిమాండు విధించారు. అనంతరం ఇద్దరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### ఎసిబి వలలో ఎంఇఒ, స్కూల్ అసిస్టెంట్




ఎసిబికి పట్టుబడిన ఎంఇఒ, స్కూల్ అసిస్టెంట్

**గూడూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఎసిబి వలకు చిక్కారు. ఈ నెలలో పదవీవిరమణ చేస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి నుండి లంచం తీసుకుం టూ వీరు బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వరంగల్ ఎసిబి డిఎస్‌పి సాంబయ్య తెలిపిన ప్రకారం.. గూడూరు మండలంలోని గుండెంగ శివారు వాగ్యాతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యుడిగా విధులు నిర్వహిస్తున్న రవీందర్ ఈనెల 30న పదవీవిరమణ చేయను న్నారు. కాగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కొరకు పేపర్స్ తయారుచేసి ఆడిట్ ఆఫీస్‌కు పంపించడానికి, సర్వీస్‌బుక్ సరెండర్ చేయడానికి ఇన్‌చార్జి ఎంఇఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న అయోధ్యాపురం హైస్కూల్ హెచ్‌ఎం జి రవి కుమార్ సదరు ఉపాధ్యాయుడి నుండి రూ.45 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఆ మొత్తాన్ని తన వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అదే పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రమౌళికి ఇవ్వాలని చెప్పడంతో తాను అంత మొత్తం ఇచ్చుకోలేనన్న రవీందర్ రూ.15 వేలకు ఒప్పందం చేసుకొని ఎసిబి అధికారులను ఆశ్రయించాడు.

కాగా బుధవారం అయోధ్యాపురం హైస్కూల్ ప్రాంగణంలో ఎంఇఒ రవికుమార్, స్కూల్ అసిస్టెంట్ చంద్ర మౌళికి బాధిత ఉ పాధ్యాయుడు రవీం దర్ రూ.15 వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కున్నారు. వీరిద్దరిని బుధ వారం అరెస్టు చేశామని, గురు వారం ఉదయం వరంగల్ ఎసిబి కోర్టులో హాజరు పరుస్తామని డిఎస్‌పి సాంబయ్య తెలిపారు.

## జర్మనీలో నైపుణ్య శిక్షణ విధానాలపై మంత్రి వివేక్ అధ్యయనం

### యువత నైపుణ్యాభివృద్ధికి దిశానిర్దేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తెలంగాణలో వంశపారపర్యంగా కొనసాగిస్తున్న చేతివృత్తి కళాకారుల ఉత్పత్తులకు తక్కువ ఉత్పత్తి వ్యయంతోపాటు అధిక లాభం కలిగించేందుకు చాంబర్ ఆఫ్ స్కిల్డ్ క్రాఫ్ట్స్ – హ్యాండ్వర్క్‌స్కామర్‌తో సాంకేతిక అంశాలలో శిక్షణ ఇవ్వడానికి తగిన సలహాలు సూచనలు పొందామని కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామితెలిపారు జర్మనీలోని కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి బుధవారం జర్మనీలోని హానోవర్ నగరంలో చాంబర్ ఆఫ్ స్కిల్డ్ క్రాఫ్ట్స్ – హ్యాండ్వర్క్‌స్కామర్ ముఖ్య అధికారులను కలిశారు. జర్మనీలో నైపుణ్య ఆధారిత కళల రంగ ప్రయోజనాలను పెపొందించే అటానమస్ బాడీలోని వివిధ శిక్షణలు, విధానపరమైన మార్కెటింగ్ నిర్ణయాలను ఆయనకు ప్రతినిధులు వివరించారు. దేశవ్యాప్తంగా 53 ప్రాంతీయ చాంబర్లతో కూడిన హెచ్ డబ్ల్యుకె సంస్థ క్రాఫ్ట్ వ్యాపారాలు, ఉద్యోగులు శిక్షణార్థులకు కేంద్ర సమన్వయ సంస్థగా పనిచేస్తోందనీ ఇలాంటివి రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి వారి విద్యా, శిక్షణ విధానాలు, పనితీరు పద్ధతులు, మానవ వనరుల అభివృద్ధి నైపుణ్యాల పెంపుదలకు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా హెచ్‌డబ్ల్యుకె క్యాంపస్ సిఈఓ వోల్కర్ ష్మోల్జ్‌తో మంత్రి సమావేశమై మాట్లాడారు. అనంతరం మంత్రి ఆయన ప్రతినిధి బృందం శిక్షణ కేంద్రాలను సందర్శించి, పాఠ్య ప్రణాళికను పరిశీలించారు. ట్రైనర్లు, పరిపాలన సిబ్బందితో ప్రత్యక్షంగా మాట్లాడి, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి చర్యలు, వృత్తి విద్యకు సంబంధించిన వివిధ అంశాలపై విస్తృత చర్చలు జరిపారు.

## పవన్ ఖేడా కోసం హైదరాబాద్‌లో అసోం పోలీసుల గాలింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** అసోం సిఎం హిమంత బిశ్వశర్మ సతీమణి రిణికి భూయాన్‌పై తీవ్రమైన ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేడా కోసం ఆ రాష్ట్ర పోలీసులు రెండు రోజులుగా హైదరాబాద్‌లో గాలిస్తు న్నారు. ఢిల్లీకి చెందిన ఖేడా సోమవారం నాడు రిణికి భూయాన్‌పై తీవ్రంగా ఆరోపణలు చేయడం తెలిసిందే. ఆమెకు మూడు పాస్‌పోర్టులు వున్నాయని, కోట్లాది రూపాయల అక్రమాస్తులు సంపాదించా రని ఖేడా ఆరోపించారు. దీనిపై రిణికి భూయాన్ అస్సాం పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు వెంటనే ఖేడాపై కేసు నమోదు చేసి ఆ యన కోసం ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో లేకపోవడంతో ఇంట్లో తనిఖీలు చేబట్టి కీలక పత్రాలు జప్తు చేశారు. ఖేడా హైదరాబాద్‌లో వున్నట్లు అందిన సమాచారం మేరకు అసోం పోలీసులు మంగళవారం నుంచి నగరంలో పలుచోట్ల గాలించినా ప్రయోజనం కలగలేదు. అయితే ఖేడా కోసం అసోం పోలీసులు హైదరాబాద్‌కు వచ్చిన విషయమై ఇక్కడి పోలీ సులు స్పందించడం లేదు.

## యూనియన్ బ్యాంక్ శాలరీ అకౌంట్ ఉద్యోగి మరణిస్తే పది లక్షల బీమా

### ఆర్టీసి ఉద్యోగుల భద్రతకు కీలక యుబిఐ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** యూనియన్ బ్యాంక్ శాలరీ అకౌంట్ ఉద్యోగి మరణిస్తే పదిలక్షల బీమా వర్తింపచేయాలనే విధాన పరమైన నిర్ణయంతో ఆర్టీసి ఉద్యోగులకు భద్రత మరింత పెరిగింది. తమ బ్యాంకులో శాలరీ అకౌంట్ కలిగిన ఆర్టీసీ సిబ్బందికి సామాజిక భద్రతను మరింత పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కేవలం ప్రమాదవశాత్తూ జరిగే మరణాలకు మాత్రమే వర్తిస్తున్న బీమా సౌకర్యాన్ని, ఇప్పుడు సహజ మరణాలకు కూడా వర్తింపజేస్తున్నట్లు ప్రకటించింది. యూనియన్ బ్యాంక్ శాలరీ అకౌంట్ కలిగి ఉన్న ఉద్యోగి సహజంగా మరణించినా, వారి కుటుంబానికి రూ. 10 లక్షల ఉచిత బీమా సొమ్ము అందుతుంది. ఏప్రిల్ 1 నుండి అమలు చేస్తున్నారు. ఈ నూతన నిబంధన 2026, ఏప్రిల్ 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది. ఈ సౌకర్యం కోసం ఉద్యోగులు రూపాయి కూడా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా బ్యాంకే భరిస్తుంది. గతంలో ఉన్న రూ. 1 కోటి ప్రమాద బీమా సౌకర్యం యథాతథంగా కొనసాగుతూనే, ఈ సహజ మరణ బీమా అదనంగా చేరింది. దాదాపు 38 వేలపైగా ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది.


ధర్నాలో నినాదాలు చేస్తున్న సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు

## కూల్చివేసిన స్థలంలోనే ఇళ్లు నిర్మించాలి

### సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ధర్నాలో వక్తల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఖమ్మం వెలుగుమట్ల భూదాన భూమిలోని వినోభా నవోదయ కాలనీలో కూల్చివేసిన స్థలంలోనే తిరిగి ఇళ్లు నిర్మించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు, ధర్నాచౌక్‌లో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వెలుగు మట్ల బాధితులందరికీ కూల్చిన చోటనే ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు జె.వి.చలపతిరావు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సిపిఎం రాష్ట్ర నాయ కులు బండారి రవికుమార్, సిపిఐ రాష్ట్ర నాయకులు వి.ఎస్.బోస్, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు రాజా, డాక్టర్ జతిన్‌కుమార్, న్యూడెమోక్రసీ పార్టీ నేతలు సాధినేని వెంకటేశ్వరరావు, కే.గోవర్ధన్, ఝాన్సీ, మధు, బండారి అయిలయ్య, పీఓడబ్ల్యూ సంధ్య, ఎంసీపీఐ నాయకులు వరికుప్పల వెంకన్న, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు నారాయణరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌లు హాజరై ప్రసంగించారు. వెలుగుమట్లలో కూల్చబడిన ఇళ్ల బాధితు లందరికీ పదిలక్షల నష్టపరిహారం చెల్లించాలని, బాధితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో ఇళ్లు కోల్పోయిన బాధితులు పాల్గొన్నారు.

## జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సైబర్ మోసగాడి టోకరా

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఎమ్మెల్యేకు ఒక సైబర్ మోసగాడు లక్ష రూపాయలు టోకరా వేసిన సంఘటన ఇది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో నివసించే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆదివారం ఓ వ్యక్తి ఫోన్‌చేసి తనను తాను అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకొని ప్రభుత్వంలోని ఫైనాన్స్ విభాగంలో ఫైనాన్స్ అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్నాని చెప్పాడు. వికసిత్ భారత్‌లో ఎమ్మెల్యే కోటా కింద 40 మందికి ఒక్కొక్కరికి రూ. 10 లక్షల వంతున ఇవ్వ వచ్చని నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది జాబితా ఇస్తే తాను మం జూరు చేయిస్తానని, గడువు ముగుస్తుందని, నిధులు వెనక్కి వెళ్లిపోతాయని నమ్మించాడు. ఒక్కో దరఖాస్తుకు రూ. 2,500ల వంతున రూ లక్ష తనకు ఫోన్ పే చేయాలని సూచించాడు. దీంతో ఎమ్మెల్యే అతనికి లక్ష రూపాయలు బదలీ చేశాడు. కొద్ది సమయం తరువాత ఎమ్మెల్యే అసలు విషయం గుర్తించాడు. ఆది వారం కార్యాలయం ఉండదు కదా అంటూ అసలు అధికారి ఎమ్మెల్యేకు చెప్ప డంతో కంగుతిన్న ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఎమ్మెల్యేను మోసగించిన వ్యక్తిపై బిఎన్‌ఎస్ 319(2), 318(4), ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సి.వి.ఆనంద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా

## జైళ్ల భద్రతలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలి

### హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సి.వి.ఆనంద్

**హైదరాబాద్ (ప్రభాతవార్త), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** జైళ్ల శాఖ ఆధ్వర్యంలో చంచల్‌గూడలోని సికాలో నిర్వహిస్తున్న రిట్రీట్ 2026 బుధవారం ముగిసింది. ముగింపు వేడుకలకు హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సి.వి.ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైళ్లలో డి అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. జిల్లా జైళ్లకు డి అడిక్షన్ సెంటర్లను విస్తరించాలని సూచించారు. జైళ్ల భద్రతలో డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతిక విధానాలను ఉపయోగించుకోవాలన్నారు. ఫ్యామిలి కౌన్సిలింగ్ వ్యవస్థను మరింత మెరుగు పరచాలని, వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాలను జిల్లా జైళ్లకు కూడా విస్తరించాలని సూచించారు. క్యూర్, ప్యూర్, రేర్ సిద్ధాంతాన్ని అనుసరించి జైళ్లలో పర్యావరణానికి అనుకూలమైన కార్బన్ న్యూట్రల్ వాతావరణాన్ని అభివృద్ధి చేయాలన్నారు. జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ సుశిక్షితమైన, మానవతా దృక్పథంతో కూడిన సంస్కరణాత్మక జైళ్ల వ్యవస్థ నిర్మాణానికి తెలంగాణ జైళ్ల శాఖ కట్టుబడి ఉందన్నారు. జైళ్లను సంస్కరణ, పునరావాసం, సమాజంలో పునఃప్రవేశ కేంద్రాలుగా మార్చే లక్ష్యాలను రిట్రీట్ మరింత బలపరిచిందన్నారు.

## ఉద్యాన ఆధారిత అంకుర పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్తు

### ఉద్యాన వర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ డి. రాజిరెడ్డి

**హైదరాబాద్ (అత్తాపూర్) ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఉద్యాన ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ భారీగానే పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యాన అంకుర పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజి రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన హార్టి కల్చర్ ఎంటర్‌ప్రిన్షిప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ పంటల వినియోగం, అవసరాలు కూడా రోజురోజుకు తగ్గుతుండడం, ఉద్యాన పంటల్లో పారిశ్రామికీకరణ కు ఎక్కువగా అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఉద్యాన ఆధారిత పరిశ్రమల కు, వాటి ఉత్పత్తులకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని, ఈ దిశగా ఎన్ని పరిశ్రమలు ఉన్న ఉపాధి, లాభాలు కచ్చితంగా ఉంటాయని ఆయన అన్నారు. అలాగే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రిమోట్ సెన్సింగ్, జిఐఎస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్, హైడ్రోపోనిక్స్, బయోటెక్నాలజీ వంటి రంగాలు ఉద్యాన పంటల్లో లాభసాటిగా మార్చేందుకు ఉపయోగపడతాయని, పారిశ్రామికరణకు అవకాశాలు ఉన్నాయని డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. విద్యార్థులు నైపుణ్యం పెంచుకుంటే ప్రపంచమే భవిష్యత్తు కెరీర్‌కు ఉంటుందని, ఆధునిక నైపుణ్యత పెంచుకునే దిశగా విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. శిక్షణ కార్యక్రమం డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశంపై అవగాహన ఏర్పరచుకుని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే భవిష్యత్తుకు డోకా ఉండదని తెలిపారు.

## బెంగాల్‌లో లక్షలాది ముస్లిం ఓట్లను న్యాయ పరిశీలనలో ఉంచారు: అసదుద్దీన్ ఒవైసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 8:** పశ్చిమ బెంగాల్‌లో ఆయా నియోజకవర్గాల్లో పెద్ద మొత్తంలో ముస్లింల పేర్లను న్యాయ పరిశీలన జాబితాలో ఉంచారని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. సంషేర్‌గంజ్ నియోజకవర్గంలో 55 శాతం మంది ముస్లింలు, మోతాబరిలో 54.2 శాతం, మణిక్‌చక్‌లో 50 శాతం, బెర్హంపూర్‌లో 61.6 శాతం మంది ముస్లింల పేర్లు పరిశీలన జాబితాలో నిలిచిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో లక్షలాది మంది ముస్లింల ఓటు హక్కును ప్రశ్నార్థకంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఓటు హక్కు విషయమై ఫారెనర్స్ ట్రైబ్యునల్ ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. ఆ నిర్ణయం వెలువడే వరకు వారు ఓటు వేయలేరని ఆందోళన వ్యక్తం చేశారు.

## టాలీవుడ్‌లో కొత్త వివాదం..

### టిఎఫ్‌సిసి ప్రతిపాదనపై అగ్ర నిర్మాతల తీవ్రఅభ్యంతరం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్8:** తెలుగు చిత్ర పరిశ్రమలో మరో కొత్త వివాదం రాజుకుంది. థియేటర్లలో సినిమాల ప్రదర్శనకు సంబంధించి తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (గినీదిది) ఇటీవల ప్రతిపాదించిన "పర్సంటేజ్ ఆధారిత స్క్రీనింగ్ మోడల్"పై అగ్ర నిర్మాతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని ఏకపక్షంగా తమపై రుద్దడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేస్తూ, యాక్టివ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ (తిగినీశిబి) ఏప్రిల్ 8న ఛాంబర్‌కు ఓ అధికారిక లేఖ రాసింది. మార్చి 25, ఏప్రిల్ 2 తేదీలలో టీఎఫ్ సీసీ జారీ చేసిన సర్క్యులర్‌లను ప్రస్తావిస్తూ, ఈ కొత్త విధానం తమకు ఆమోదయోగ్యం కాదని నిర్మాతలు తేల్చిచెప్పారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న పాత విధానాన్నే కొనసాగించాలని వారు కోరారు. ఎగ్జిబిటర్లతో నేరుగా చర్చలు జరిపి, తమ నిబంధనల ప్రకారమే సినిమాలను పంపిణీ చేసుకుంటామని గిల్డ్ స్పష్టం చేసింది. టీఎఫ్ సీసీ ప్రతిపాదించిన కొత్త విధానాన్ని పాటించే థియేటర్లకు తమ సినిమాలను ప్రదర్శన కోసం ఇచ్చేది లేదని నిర్మాతలు తమ లేఖలో అల్టిమేటం జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లేఖపై సంతకాలు చేసిన వారిలో టాలీవుడ్‌లోని పలు అగ్ర నిర్మాణ సంస్థల అధినేతలు ఉన్నారు. వారిలో రవిశంకర్ యలమంచిలి (మైత్రీ మూవీ మేకర్స్), సుధాకర్ చెరుకూరి (ఎస్ఎల్‌వి సినిమాస్), టీజీ విశ్వప్రసాద్ (పీపుల్ మీడియా ఫ్యాక్టరీ), నాగవంశీ (సితార ఎంటర్‌టైన్‌మెంట్స్), రవి కిశోర్ (స్రవంతి), సుప్రియ (అన్నపూర్ణ స్టూడియోస్), బాపినీడు (ఎస్‌వీసీసీ), స్వప్న దత్ (స్వప్న సినిమా), సాహు గారపాటి (షైన్ స్క్రీన్స్), రాజీవ్ రెడ్డి (ఫస్ట్ ఫ్రేమ్), వెంకట సతీష్ కిలారు (వృద్ధి సినిమాస్), నాని (వాల్ పోస్టర్ సినిమా), చిట్టూరి శ్రీనివాసరావు (శ్రీనివాస సిల్వర్ స్క్రీన్), బన్నీ వాసు (బన్నీ వాస్ వర్క్స్), ఎస్‌కేఎన్ (మాస్ మూవీ మేకర్స్), ధీరజ్ మొగిలినేని (ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్) ఉన్నారు.

## చేనేత రంగంలో టెండర్ల విధానాన్ని రద్దు చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎల్.రమణ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 8:** చేనేత రంగంలో ఏకీకృత టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ లేఖ రాశారు. పాత విధానంలోనే టీఎస్‌సీవో ద్వారా దుస్తులు కొనుగోలు చేయాలని కోరారు. మార్చి 11 న ఇచ్చిన జీవోను యథాతథంగా అమలు చేయాలని , విద్యార్థుల యూనిఫామ్ తయారీ కి సంబంధించిన 105 కోట్ల రూపాయల ఆర్డర్‌ను టీఎస్‌సీవోకు ఇవ్వాలన్నారు. వివిధ సంక్షేమ శాఖలకు అవసరమయ్యే దుస్తులను టీఎస్‌సీవో ద్వారానే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగం అనేది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాకుండా, వేలాది కుటుంబాల జీవనాధారమని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక అని వెల్లడించారు. ఈ రంగాన్ని కాపాడేందుకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చేనేత కళాకారులకు, కార్మికులకు ఎంతో మేలు చేశాయని గుర్తు చేశారు.

# ఖరీఫ్ సీజన్‌లో పౌష్టిక ఎరువుల సబ్సిడీకి రూ.41,534 కోట్లు

### జైపూర్ మెట్రో ఫేజ్‌కు రూ.13,038 కోట్ల ప్రతిపాదనలకు ఓకే

### అరుణాచల్‌ప్రదేశ్‌లో విద్యుత్ ప్లాంట్లకు భారీ నిధులు

### రాజస్థాన్‌లో హెచ్‌పిసిఎల్ రిఫైనరీ కోసం రూ.79,459 కోట్లు

### ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలకనిర్ణయాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ ఎరువుల్లో సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఖరీఫ్ న్యూట్రియెంట్స్ సబ్సిడీ గత 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ. 4,313 కోట్ల రూపాయలు అధికంగా కేటాయించారు. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. జైపూర్ మెట్రో ఫేజ్2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడిమోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్ సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రాదాదికురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి 2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఫార్మా, ఫుడ్, పాలిమర్, స్టీల్, గ్లాస్ వంటి పలు పారిశ్రామిక రంగాలకు ఇంధన కొరత అధిగమించేందుకు బల్క్ నాన్‌డొమెస్టిక్ ఎల్‌పీజీ కేటాయింపులను పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల పారిశ్రామిక యూనిట్లకు ఇధన అవసరాలు పెరగడమే కాకుండా, ఉత్పత్తి వ్యయం తగ్గడానికి అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం పారిశ్రామిక యూనిట్లకు గత మార్చి నెల నాటి వినియోగంతో పోలిస్తే 70 శాతం ఎల్‌పీజీ సరఫరాను పునరుద్ధరించాలని కేంద్రం నిర్ణయించింది. పారిశ్రామిక అవసరాల కోసం గరిష్టంగా గ్యాస్ కేటాయింపులు జరగనున్నాయి. సహజ వాయువు లభ్యం కాని లేదా ప్రత్యామ్నాయంగా వాడలేని సున్నితమైన పారిశ్రామిక ప్రక్రియలకు ఈ కేటాయింపుల్లో అగ్రతాంబూలం దక్కనుంది. పీఎన్‌జీ సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసే రాష్ట్రాలకు కేంద్రం బంపర్ ఆఫర్ ప్రకటించింది. రాష్ట్రాలకు అదనంగా 10శాతం వరకు ఎల్‌పీజీ కేటాయింపులు పెంచనున్నారు. కంప్రెస్ట్ బయో గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి త్వరితగతిన రాష్ట్ర సీబీజీ పాలసీని నోటీఫై చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఆదేశించింది. ఈ అదనపు కేటాయింపులు పొందాలనుకునే పారిశ్రామిక యూనిట్లు తప్పనిసరిగా ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వద్ద తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది.

## కేరళం, అసోం, పుదుచ్చేరిల్లో నేడే పోలింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** రెండు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో గురువారంజరిగే పోలింగ్‌కోసం విస్తృత ఏర్పాట్లు చేసింది ఎన్నికల యంత్రాంగం. కేరళలో 140 స్థానాలు, అస్సాంలో 126 స్థానాలు, కేంద్రపాలితప్రాంతం పుదుచ్చేరిలో 30 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనున్నది. ఎన్నికలకోసం కేరళలో సుమారు 40,771 పోలింగ్‌కేంద్రాలు, పుదుచ్చేరిలో 1099 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటుచేసారు. అస్సాంలో 126 స్థానాలకుగాను 31,486 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటుచేసారు. పోలింగ్‌కేంద్రాలన్నింటిలోను వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేసారు. ఓటర్లు తమతమ పోలింగ్ కేంద్రాలను ఆన్‌లైన్‌లో కూడా చెక్‌చేసుకోవచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్‌విఎస్‌పి పోర్టల్ ద్వారా కూడా చెక్‌చేసుకోవచ్చని సూచించింది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, రాజ్యాంగపరంగా సంక్రమించిన ఓటుహక్కును విస్మరించవద్దంటూ ఎన్నికల యంత్రాంగం భారీ ఎత్తునప్రచారంచేస్తోంది. ఈ ఎన్నికల్లో ఈసారి కేరళ, అస్సాంలలోనే పోటీ తీవ్రంగాకనిపిస్తోంది. ముచ్చటగా మూడోసారి అస్సాంలో తన పట్టును నిరూపించుకునేందుకుబిజెపి ప్రయత్నిస్తుంటే కేరళంలో ఎల్డీఎఫ్ అంటేప్రస్తుత అధికార కూటమి పినరయి విజయ్ సారథ్యంలోని ఎల్డీఎఫ్ మరోసారి పాలన పగ్గాలుచేపట్టేందుకు సిద్ధం అవుతోంది. ఎన్నికలకోసం సమృద్ధిగా కేంద్ర బలగాలను కూడా ఈమూడు రాష్ట్రాలకు తరలించారు. పుదుచ్చేరి కేంద్రపాలితప్రాంతంలో అయితే ప్రస్తుతం సిఎం ఎన్ఆర్ రంగస్వామి కూటమికే మళ్లీ పట్టం కట్టేట్లు ఓటర్ల నాడి ఉంది. బిజెపితో జతకట్టి ప్రభుత్వం నడిపిన సంగతి తెలిసిందే. ఈసారి కూడా అదే కూటమి పరిధిలో అధికార పగ్గాలుచేపట్టేవిధంగా రంగస్వామి వ్యూహాలు అమలుచేస్తున్నారు. ఇదిలా ఉంటే పోలింగ్‌కేంద్రాలకు ఈవీఎంలతో పాటు సిబ్బంది, ఎన్నికల అధికారులను పటిష్టమైన బందోబస్తు మధ్య తరలించారు. సమస్యాత్మక కేంద్రాలవద్ద కేంద్ర బలగాలను మొహరింపచేసారు. ఎక్కువగా ఈశాన్యరాష్ట్రం అస్సాంలోనే కేంద్ర బలగాల బందోబస్తు ఎక్కువ ఉంది. ఈ రాష్ట్రంపై ఇతర పొరుగుననే ఉన్న రాష్ట్రాలప్రభావం ఎక్కువ కనిపిస్తుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ఆదిశగా పటిష్టమైన చర్యలు తీసుకుంది.



## సోయాబీన్ పరిశోధనలు, సాగుపై వార్షిక సమావేశాలు ప్రారంభం

### రెండోరోజు సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్

**హైదరాబాద్ (అత్తాపూర్) ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** సోయాబీన్ పంట పై 56వ అఖిలభారత సమన్వయ పరిశోధన పథకం వార్షిక సమావేశాలు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, ఇండోర్ లోని జాతీయ సోయాబీన్ పరిశోధనా సంస్థ సంయుక్తంగా ఈ సమావేశాలను నిర్వహిస్తోంది. బుధవారం రెండవ రోజు సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ,సోయాబీన్ పంట విస్తీర్ణం పెంపునకు కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని వివరించారు. పంటల మార్పిడిలో భాగంగా ప్రత్యామ్నాయ పంటగా సోయాబీన్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సోయాబీన్ పంట ఉత్పాదకతలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉన్నప్పటికీ, పంట విస్తీర్ణంలో కొంత వెనుకబడి ఉందని, 2047 కల్లా సోయాబీన్ విస్తీర్ణం కూడా గణనీయంగా పెంచేందుకు తగిన కృషి చేస్తామని సోయాబీన్ పంటలో అధిక దిగుబడి, ఉత్పాదకత నిచ్చే వంగడాల రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తద్వారా రైతులకు ఆదాయం పెరగడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. అలాగే వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాల అభివృద్ధి ఎంతో అవసరమని, అధిక నీటి ఒత్తిడిని తట్టుకునే రకాల రూపకల్పన కూడా సోయాబీన్‌లో అవసరం ఉందని ఆయన వివరించారు. ఈ మూడు రోజుల సమావేశాల్లో వచ్చే సూచనలను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరిస్తుందని చెప్పారు. సోయాబీన్ అఖిల భారత సమన్వయ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కే హెచ్ సింగ్, ప్రాజెక్ట్ పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రపంచంలో సోయాబీన్ విస్తీర్ణం ఉత్పత్తిలో భారతదేశం ఐదవ స్థానంలో ఉందని, అయితే, ఉత్పాదకతలో మాత్రం వెనకబడి ఉందని తెలిపారు. సోయాబీన్ పంట సాగులో 1999 వ సంవత్సరం గోల్డెన్ పీరియడ్ అని చెప్పవచ్చని, ఆ ఏడాది ఎంతో పురోగతిని సాధించినట్లు వివరించారు.

## రైతుల దీక్షకు సంఘీభావం పేరిట రాజకీయమా?

### బిఆర్ఎస్ నేతల దుష్ప్రచారంపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రైతుల దీక్షకు సంఘీభావం పేరిట పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకునేలా రాజకీయాలు చేయడం బిఆర్ఎస్ నేతలకు తగదని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హితవు పలికారు. వికారాబాద్ జిల్లాలో జరుగుతున్న భూసేకరణపై ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు, పనిగట్టుకుని ప్రభుత్వంపై బురద చల్లేందుకే రాజకీయ యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల టిఆర్ఎస్ అలియాస్ బిఆర్ఎస్ పాలనలో తీవ్ర వెనుకబాటుకు గురైన వికారాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తోంటే ఓర్వలేకే మొసలి కన్నీరు కారుస్తున్నారని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ డెస్టినేషన్‌గా మార్చేందుకు మేం అహర్నిశలు కృషి చేస్తోంటే, చూసి తట్టుకోలేకే మాపై బురద చల్లుతున్నారని దుయ్యబట్టారు. పెట్టుబడులు రాకుండా మన యువతకు ఉపాధి దక్కకుండా అసత్యాలను వండి వార్చుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. ప్రతి రైతుకూ న్యాయం చేస్తామని, వారి త్యాగాన్ని ప్రభుత్వం తప్పకుండా గుర్తిస్తుందని సహకరించాలని కోరారు.

## 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణపై ఫోకస్: బిజెపి ఎంపి లక్ష్మణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్8:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణపై ఫోకస్ చేస్తామని బిజెపి ఓబిసి జాతీయ అధ్యక్షుడు,రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ఉన్నా.. రేవంత్ వైపు గాలి వీచిందని తెలిపారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ లక్ష్మణ్ విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ఎవరూ ఊహించలేదన్నారు.


## ఏజెన్సీ సమస్యలపై మానవతా దృక్పథం చూపండి

### గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** గిరిజన ప్రాంత సమస్యలపై అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూచించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలన్నారు. గిరిజన జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే తమ సంకల్పమని తెలిపారు. ఏజెన్సీలో సౌకర్యాల నిమిత్తం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో వైఫల్యం కనపిస్తోందన్నారు. జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలంటే శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని చెప్పారు.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

### హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్ల ఇరాన్ వెల్లడి



**టెహ్రాన్, ఏప్రిల్ 8:** కాల్పుల విరమణను ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ ఇరాన్ మళ్లీ హార్ముజ్ జలసంధిని మూసివేసింది. ఇరాన్‌తోపాటు లెబనాన్‌పైనా కాల్పులు విరమణ పాటించాలని, ఇరాన్‌తో జరిగే ప్రతి ఒప్పందంలోను లెబనాన్ అంశం పొందుపరచాలని ఇరాన్ తన పదిపాయింట్ల డిమాండ్ ఛార్టర్‌లో వెల్లడించింది. అయితే కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు ఇరాన్, అమెరికాలు అంగీకరించినా ఇజ్రాయెల్ లెబనాన్‌కు ఈ అవగాహన వర్తించదంటూ భారీ ఎత్తున దాడులకు పాల్పడింది. దీనితో ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ కాల్పుల విరమణ ఉల్లంఘించిందని అందువల్ల హార్ముజ్ జలసంధిని తిరిగి మూసివేస్తున్నట్లు ప్రకటిం చింది. ముందు మధ్యవర్తిత్వ దేశాల దౌత్యంతో రెండువారాల పాటు కాల్పు లవిరమణకు అమెరికా ఇరాన్‌లు అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే హార్ముజ్ జలసంధిని తిరిగి తెరుసానతమని ఇరాన్ ప్రకటించింది. సజావుగా నౌకల రవాణను అనుమతిస్తా మని ప్రకటించింది. ఇందుకు ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికానిర్ణయానికి మద్దతిసానతమని కూడా ప్రకటించారు. అయితే ఇందులో లెబనాన్ ఉండదని ప్రకటించారు. అయితే పాక్ ప్రధానిచేసిన ప్రకటనలో లెబనాన్‌తో సహా కాల్పుల విరమణ ఉంటుందనిప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే ఇజ్రాయెల్ లెబనాన్‌పై తీవ్రస్థాయిలో దాడులుచేసింది. బీరూట్‌లోని నివాస వాణిజ్యప్రాంతాలపై ఇజ్రాయెల్ సైనిక వైమానిక దాడులు తీవ్రతరం చేసింది. డజన్లకొద్దీపౌరులు మరణించారు. వందలాదిమంది గాయపడినట్లు లెబనాన్ ప్రకటించింది. ఈనెల 10వ తేదీనుంచి పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా శాంతిచర్చలు జరగాల్సిన తరుణంలో ఇజ్రాయెల్ జరిపిన దాడులతో చర్చలకు గండిపడుతుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాల్పుల విరమణ ప్రతిపాదనల్లో ఇరాన్ ప్రత్యేకించి పది డిమాండ్లు ఉంచిన సంగతి తెలిసిందే. ఇరాన్, లెబనాన్‌లలో దాడులు ఆపివేయాలని, సరిహద్దుల నుంచి అమెరికా దళాలు వైదొలగాలని, ఇరాన్‌పై ఇప్పటివరకూ జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని డిమాండ్‌చేసింది. అంతేకాకుండా హార్ముజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యమే కొనసాగుతుందని, ఈ జలసంధి గుండా వెళ్లే నౌకలపై టోల్ వసూలుకు అంగీకరించాలని కూడా షరతులు విధించింది. అంతేకాకుండా అటు ఇజ్రాయెల్‌కానీ, ఇటు అమెరికాకానీ భవిష్యత్తులో దాడులు జరపబోమన్న స్పష్టమైన హామీలు ఇస్తేనే చర్చలు సఫలీకృతం అవుతాయని లేనిపక్షంలో తాము యథావిధిగా అన్ని ప్రతిఘటనలకు సిద్ధం అవుతామని ఇరాన్‌ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా బృందానికి ఉపాధ్యక్షుడు జెడివాన్స్ నేతృత్వం వహిస్తుంటే ఇరాన్ ప్రతినిధి బృందానికి ఇరాన్ స్పీకర్ మహ్మద్‌బాఘేర్ ఘాలిబాఫ్ నేతృత్వంలో విదేశాంగ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ చర్చలకు హాజరవుతుంది.

## మే మొదటి వారంలో తెలంగాణ జన సమితి ప్లీనరీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 8:** తెలంగాణ జన సమితి నాలుగవ రాష్ట్ర ప్లీనరీ హైదరాబాద్ నగరంలో నిర్వహించాలని రాష్ట్ర విస్తృత స్థాయి కమిటీ నిర్ణయించింది. బుధవారం నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో టీజేఎస్ రాష్ట్ర విస్తృత స్థాయి కమిటీ సమావేశం అధ్యక్షులు ప్రొ. కోదండరాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రొ. కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కొరకు, రాజకీయ ప్రక్షాళన కొరకు ప్రతి కార్యకర్త సైనికుడుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుండి పార్టీని పటిష్టంగా నిర్మాణం చేయాలని, స్థానికంగా ప్రజా సమస్యలపై గళమెత్తాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ప్రధాన సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రజా ఆందోళనలను నిర్మించాలని అన్నారు. దళిత క్రిస్టియన్లకు రిజర్వేషన్లు ఎత్తివేసే సుప్రీంకోర్టు తీర్పును ప్రజల్లో ఎండగట్టాలని, దీని కోసం కలిసి వచ్చే శక్తులతో కలిసి దళితులైన వారి జన్మ హక్కును కాపాడడం కోసం ఉద్యమించాలని ఆయన అన్నారు.

## కాళేశ్వరం, దేవాదుల మోటార్లను కావాలనే పాడు చేస్తున్నారా?

### మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 8:** కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. భారీ నీటిపారుదల మోటార్లను ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ప్రాజెక్టుల్లోని భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంపెల్లర్స్, మోటార్స్ పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటార్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిరక్ష్యమా? లేక కావాలనే చేస్తున్న కుట్రనా? అని ప్రశ్నించారు. భారీ మోటార్లు నిరంతరాయంగా నడి చేలా డిజైన్ చేసినవి, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్‌రావు హెచ్చరించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు. మీ రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన



## దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు ఏటిఎంగా తెలంగాణ

### తెలంగాణ జాగృతిలో చేరికలు

### కండువా కప్పి ఆహ్వానించిన కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 8:** దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చిన సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు.

## నిజామాబాద్‌లో ముగ్గురు కాంగ్రెస్ నేతల సస్పెన్షన్

**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారన్న ఆరోపణలపై ముగ్గురు కీలక నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ రాష్ట్ర అధినాయకత్వం నిర్ణయ్ం తీసుకుంది. సస్పెన్షన్‌కు గురైన నేతల్లో ఎన్ఎస్‌ఐఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి వేణు రాజు, జిల్లా కార్యదర్శి నరన్ దీప్, 48వ డివిజన్ మాజీ అధ్యక్షుడు పుంద్ర సాయి కిరణ్ ఉన్నారు. అయితే, గత కొంతకాలంగా జిల్లాలోని సీనియర్ నేతల మధ్య ఉన్న వర్గ విభేదాలు ఈ యువ నాయకుల సస్పెన్షన్‌కు కారణమైనట్లుగా తెలుస్తోంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పార్టీ దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని వీరిపై ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ ఆదేశాల మేరకు వీరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## జలవిహార్ ఆర్వో ప్లాంట్‌లో భారీపేలుడు

### ముగ్గురు సిబ్బందికి గాయాలు

**హైదరాబాద్ (బేగంపేట), ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** నగరంలోని నెక్లెస్‌రోడ్డు జలవిహార్‌లో బుధవారం ఆర్వోప్లాంట్‌లో జరిగిన భారీ పేలుడు చోటు చేసుకుంది. నీటి సరఫరా కోసం ఉపయోగించే ఈ ప్లాంట్‌లో ఒక్కసారిగా సంబవించిన భారీ పేలుడు కారణంగా పరికరాలు తునాతునకలయ్యాయి. ఈ ఘటనలో ప్లాంట్ వద్ద పనిచేస్తున్న ముగ్గురి సిబ్బంది తీవ్రంగా గాయపడగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన అప్పల నాయుడు,అంజిలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన లక్ష్మణ్ ను సోమాజీగూడాలోని జాయ్ ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన వారిలో ఒకరి పరిస్థితివిషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే ఖైరతాబాద్ ఏసీపీ సంజయ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పేలుడుకు గల కారణాలపై లోతైన విచారణ చేస్తున్నారు.

# బెజవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి రూ.170 కోట్లతో భారీ ప్రణాళిక



- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- మూడు దశల్లో స్టేడియం అభివృద్ధి, క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం.
- ఖేలో ఇండియా నిధులతో స్టేడియం అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాత వార్త ప్రతినిధి:** రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి నగరం, పట్టణం, గ్రామాల్లో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ క్రీడారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం అభివృద్ధి పనులకు ఖేలో ఇండియా నిధులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించిన శుభ సందర్భంలో ఈ కార్యక్రమం జరగడం విశేషమన్నారు. విజయవాడ నగరానికి ఎంతో భావోద్వేగ అనుబంధం కలిగిన ఐజీఎమ్ఎస్ స్టేడియం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్టేడియం అభివృద్ధికి మొత్తం సుమారు రూ. 160 నుండి రూ. 170 కోట్ల వరకు మూడు దశల్లో వ్యయం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా రూ. 20 కోట్లు, మిగిలిన నిధులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరనున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వ ఐదేళ్లలో ఆగిపోయిన క్రీడా అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు వేగం పుంజుకున్నాయని, గుంటూరులో ఇప్పటికే శంకుస్థాపన జరిగిందని, త్వరలో శ్రీకాకుళంలో కూడా పనులు ప్రారంభమవుతాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుండి రూ.1000 కోట్ల నిధుల ప్రతిపాదనలు ఉన్నాయని, రెండో విడతలో రూ.100 కోట్లకు పైగా నిధులు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మంత్రి కొనియాడారు. రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఆపిఎల్) మ్యాచ్‌లను అమరావతిలో ప్రారంభించి కడపలో ముగించాలనే ప్రతిపాదనను స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాటాడుతూ... విజయవాడ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, అమరావతి రాజధానిగా శాశ్వత గుర్తింపు రావడంతో నగరానికి మరింత అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ నగరాల్లో క్రీడా వసతులు మెరుగుపడుతున్నాయని తెలిపారు. స్టేడియాన్ని సుమారు రూ.185 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలో 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, అలాగే స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2029 నాటికి విజయవాడ, అమరావతిలో నేషనల్ గేమ్స్ నిర్వహించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పార్లమెంటు సభ్యులు చెప్పారు. శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ... స్టేడియం అభివృద్ధిలో ఎంపీ కేశినేని శివనాథ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్టేడియం అభివృద్ధి కోసం పలుమార్లు సందర్శించి మార్గనిర్దేశం చేశారని చెప్పారు. ఎంపీ సూచనల మేరకు స్టేడియంలో ఒక బ్లాక్‌కు ప్రముఖ మహిళా క్రీడాకారిణి పేరు పెట్టనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నాటికి స్టేడియం పూర్తిగా రూపురేఖలు మారిపోతాయని, అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలోగ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, జిల్లా కలెక్టర్ డా. జీ. లక్ష్మీశ, నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం. ధ్యానచంద్ర,, శాప్ వీసీ అండ్ ఎండీ ఎస్. భరణి, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, మార్కోలైన్స్ పేవ్‌మెంట్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ డైరెక్టర్ వెల్లంకి రేవంత్, పాల్గొన్నారు.

## గన్నవరం,అన్నవరం రైలు మార్గంలో రూ.292 కోట్లతో 6 రైల్ ఓవర్ బ్రిడ్జిలు

**రాజంపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** విజయవాడ, విశాఖపట్నం రైల్వే డివిజన్లో కీలక రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ ఒబి) నిర్మాణాలు చేపట్టేందుకు దక్షి ణ మధ్య రైల్వే 292 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచింది. ఈ మేరకు బుధవారం దక్షి ణ మధ్య రైల్వే నిర్మాణం విభాగం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గన్నవరం ,అన్నవరం, పిఠాపురం మీదుగా రైలు మార్గంలో కీలక రైల్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలన్నారు. విజయవాడ గుడివాడ రైల్వే సెక్షన్లో నిడమనూరు ఉప్పలూరు స్టేషన్ల మధ్య రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ 16 పై రెండు వరుసల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని, గన్నవరం పెద్ద అవుటుపల్లి రైల్వే స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ 324 పై రెండు వరుసల రైల్వే ఓవర్ బ్రిడ్జిని, అలాగే పెద్ద అవుటపల్లి తేలప్రోలు మధ్య రెండు వరసల రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించేందుకు 128 కోట్ల నిధులు మంజూరు చేశారు. అదేవిధంగా విజయవాడ విశాఖపట్నం రైల్వే సెక్షన్లో మేడపాడు సామర్లకోట మధ్య లెవెల్ క్రాసింగ్ 426పై రైల్వే ఓవర్ బ్రిడ్జి, లెవెల్ క్రాసింగ్ 426 పై సామర్లకోట పిఠాపురం రైల్వే స్టేషన్ల మధ్య ఓ ఆర్ఓబి, 439 రైల్వే లెవెల్ క్రాసింగ్ పై రవికంపాడు అన్నవరం రైల్వే స్టేషన్ మధ్య మరో రైల్వే ఓవర్ బ్రిడ్జిని 168.93 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. ఈ ఆరు రైల్వే ఓవర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను18 నెలలోగా పూర్తి

## ఎపి సిఎంతో ప్రపంచ బ్యాంక్ బృందం భేటీ

- అమరావతిలో భారీగా పెట్టుబడులకు అవకాశముందన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు
- రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్ గా మారుతుందని అభిప్రాయపడ్డ వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు.
-. అమరావతి సహా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని సిఎం వెల్లడి..



సిఎం చంద్రబాబుతో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు

**విజయవాడ, ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. అమరావతి నిర్మాణ ప్రగతిని ప్రతినిధి బృందం ప్రశంసించింది. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలు, ఐటీవిద్యుత్ రంగ సంస్కరణల వల్ల ఈ నగరం భారీగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తుందని ప్రపంచ బ్యాంకు బృందం అభిప్రాయపడింది. రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్ గా మారుతుందని వెల్లడించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధితో వాణిజ్య కార్యాకలాపాలకు అమరావతి కేంద్రంగా మారుతుందని ఆశిస్తున్నట్టు బృంద ప్రతినిధులు ముఖ్యమంత్రితో చెప్పారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేపట్టడంతోపాటు.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి దిశగా తాము పని చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రపంచ బ్యాంక్ బృందానికి సీఎం చంద్రబాబు వివరించారు. మూడు రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు ముఖ్యమంత్రి చెప్పారు.

## యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం :మంత్రి సవిత

- ఎంఎస్ఎంఇల అభివృద్ధితో ఉపాధి అవకాశాలకు ఊతం - ఇడబ్ల్యూఎస్ వర్గాలకు పారిశ్రామిక అవకాశాలతో సాధికారత



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి మరికొందరికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే యువతకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. నాగార్జున యూనివర్సిటీలోని డాక్టర్ హెచ్.హెచ్. డైక్‌మన్ ఆడిటోరియంలో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు వ్యాపార, పారిశ్రామిక అవకాశాలపై నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు . జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ఎంఎస్ఎంఈ పార్కులు కీలకమని చెప్పారు. ఈడబ్ల్యూఎస్ వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి, వారిని పారిశ్రామిక రంగంలోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించగా, ఇప్పుడు ఉపాధి సృష్టిపై దృష్టి పెట్టామని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ వర్గాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సవిత స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి జరుగుతోందన్నారు. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని, కేవలం 22 నెలల్లోనే రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, పెట్టుబడిదారులకు త్వరితగతిన అనుమతులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నా మని మంత్రి చెప్పారు. ఈ పార్కుల్లో పరిశ్రమలు స్థాపిం చేందుకు ముందుకొచ్చే ఈడబ్ల్యూఎస్ యువతకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా అండగా ఉంటామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువత డీపీఆర్‌లతో ముందుకొస్తే సబ్సిడీ రుణాలు, శిక్షణ, ఉత్పత్తి నిర్వహణపై మార్గదర్శకత్వం అందిస్తామని చెప్పారు.

## మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియకు గడువు పెంపు

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్‌లోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి నిర్దేశించిన గడువును పొడిగిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విడుదల చేసిన షెడ్యూల్‌ను రద్దు చేసి, కొత్త షెడ్యూల్ అమలు చేయాలని స్పష్టం చేసింది. ఫీల్డ్ స్టాఫ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది ప్రస్తుతం 2027 జనగణన సంబంధిత పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ కారణంగా వార్డుల పునర్విభజన పనులు సకాలంలో పూర్తి చేయడం కష్టమని అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. వార్డుల సరిహద్దులు, జనాభా గణాంకాల కచ్చితత్వం, భౌగోళిక సవరణలు వంటివి క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి మరింత సమయం అవసరమని వారు తెలిపారు. తొందరపాటుతో డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేస్తే తప్పులు దొర్లే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలు తలెత్తవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. వారి సూచనలను పరిగణనలోకి తీసుకున్న మున్సిపల్ శాఖ, ప్రక్రియకు మరింత సమయం ఇస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు, ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి ముందే అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువు పెంపు నిర్ణయంతో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కూడా మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటా : మంత్రి నారా లోకేష్



**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదలు,ఇబ్బందుల్లో ఉన్న వారికి ఏ సమయంలోనైనా తాను అండగా ఉంటానని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు.తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో 87వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై పార్టీ కార్యాలయానికి తరలివచ్చిన సామాన్యులు, పార్టీ కార్యకర్తలను మంత్రి ఆప్యాయంగా పలకరించి వారి నుంచి వినతులు స్వీకరించారు. ఉదయం నుంచే టీడీపీ ఆఫీసు దగ్గర సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి సామాన్య ప్రజలు, రైతులు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మంత్రి నారా లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను ఓపికగా విన్నారు. స్వయంగా వారి నుంచి అర్జీలు తీసుకున్నారు. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా సమస్యలు పరిష్కరిస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గాలా డిపోను తరలించకుండా విజయవాడలోనే కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది మంత్రి నారా లోకేశ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడ బోర్డును కొండపల్లి నుంచి మోటమర్రికి పెంచడం వల్ల గత 17 ఏళ్లుగా విజయవాడలో ఉన్న సికింద్రాబాద్(గాలా) డిపో ఉనికి సందిగ్ధంలో పడిందని సుమారు 500 కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయనే విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు .ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ దినసరి ఉద్యోగుల కమిటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్ ను కోరారు. కోవిడ్ వల్ల నష్టపోయిన హైర్ బస్ యజమానుల బస్సులకు రీప్లేస్ మెంట్ కల్పించి ఆదుకోవాలని ఏపీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో తమకు వంశపారంపర్యంగా సంక్రమించిన 2.63 ఎకరాల భూమిని శిరిగిరి చంద్రమౌళీశ్వర రెడ్డి ఆక్రమించారని కర్నూలు జిల్లా గుండంపాడుకు చెందిన ఎస్.చిన్న శివమ్మ ఫిర్యాదుచేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ఈ వినతులన్నింటినీ మంత్రి నారా లోకేశ్ జాగ్రత్తగా పరిశీలించారు. ఏ ఒక్క అర్జీ బుట్టదాఖలు కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పష్టమైన హామీ ఇచ్చారు. మై టీడీపీ యాప్ టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ "మై టీడీపీ యాప్‌ఖ టాప్ 10 ఫెర్ఫార్మర్స్" తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ అయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. యాప్ సమర్థ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలకు సత్కారం చేశారు. పార్టీ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్ల ఉంటుంది. ఎన్నికల్లో విజయానికి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ సిద్ధాంతాలు వివరించేందుకు ఏడాదంతా శిక్షణ తరగతులు. 201924 మధ్య జగన్ ఎమ్మెల్యేలనే కలవలేదు, మనం కార్యకర్తలను కలుస్తున్నాం. నియోజకవర్గ పర్యటనల్లో కార్యకర్తలతో భేటీ అవుతున్నాం. వారాని కోరోజు పార్టీ కార్యాలయంలో సమస్యలు తెలుసుకుంటున్నాం.ఖ అని మంత్రి లోకేశ్ చెప్పారు.

## మద్యం కేసు నిందితులు వాసుదేవరెడ్డి, ప్రణయ్ ప్రకాశ్ రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసు నిందితులుగా ఉన్న వాసుదేవరెడ్డి, ప్రణయ్ ప్రకాశ్‌ను సిట్ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ గడువు నేటితో ముగియడంతో వాసుదేవరెడ్డి, ప్రణయ్ ప్రకాశ్‌ను విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల రిమాండ్ పొడిగిస్తూ విచారణను కోర్టు ఈనెల 22కు వాయిదా వేసింది. అనంతరం రిమాండ్‌లో ఉన్న నిందితులను అధికారులు గుంటూరు జైలుకు తరలించారు.

# తిరుమల సమాచారం

## శంకరంబాడి సుందరాచార్యుల విగ్రహానికి పాలాభిషేకం



**తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే గొప్ప కవి, మా తెలుగు తల్లి మల్లెపూదండ" గీతాన్ని అందించిన శంకరంబాడి సుందరాచార్యుల వర్ధంతిని బుధవారం తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్ష్మీపురం కూడలి లో ని శంకరంబాడి సుందరాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేసి కళాకారులు, సాహితీ ప్రియులు భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు సంస్కృతికి శంకరంబాడి చేసిన సేవలు అమూల్యమని, ఆయన రచనలు తెలుగు భాష యొక్క మాధుర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశాయని పేర్కొన్నారు. మా తెలుగు తల్లి మల్లెపూదండ" గీతం ద్వారా తెలుగు తల్లి మహిమాన్వితత్వాన్ని చాటిన మహాకవి శంకరంబాడి సుందరాచార్యులు తెలుగు జాతికి చిరస్మరణీయులని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కార్యదర్శి కే.ఎన్. రాజా, రంగస్థలి ప్రతినిధులు, పురోహితుడు సురేష్ స్వామి, మిట్టపల్లి బ్రహ్మానందరెడ్డి, ఎల్. కృష్ణయ్య, చిత్రపు హనుమంతరావు, మణికంఠ, వాసు, మల్లారపు రవి ప్రసాద్, లోక ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 13 నుండి 22 వరకు భాష్యకార్ల ఉత్సవాలు



**తిరుమల, ఏప్రిల్ 8ప్రభాత వార్తప్రతినిధి: :** టిటిడి ఆధ్వర్యం లోని తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో భాష్యకారులు వార్షిక ఉత్సవాలు ఈనెల 13 నుండి 22వ తేదీ వరకు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకు శ్రీ భాష్యకారులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాడ వీధులలో ఊరేగింపుగా తీసుకువెళ్తారు. సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పెద్దమాడ వీధులలో విశేష ఉత్సవం జరుగుతుంది. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, సాత్తుమొర, ఆస్థానం కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా ఏప్రిల్ 21న భోగి తేరు, 22న సాత్తుమొర వేడుకలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తనున్నాయి. అనంతరం ఏప్రిల్ 23న గంధపొడి ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పవిత్ర ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భాష్యకారుల కటాక్షాన్ని పొందాలని టిటిడి తెలిపింది.

## టిటిడి ట్రస్టులకు విరాళాలు



**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందించారు. బుధవారం మధ్యాహ్నం ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్ కు 10 లక్షలు విరాళం అందింది. తిరుపతికి చెందిన పి.సతీష్ కుమార్, పి.రోజా దంపతులు ఈ విరాళం డిడిని టిటిడి ఇఒశ్రీ ముద్దాడ రవిచంద్రకి దాత అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను టిటిడి ఇఒ అభినందించారు.

- చిన్నపిల్లల హృదయాలయంకు రూ.10 లక్షలు

అలాగే తిరుపతికి చెందిన కె.అనంతమ్మ పుట్టినరోజు సందర్భంగా, ఆమె కుమార్తె శారద తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంకు 10 లక్షలు విరాళం అందించారు. ఈ విరాళం డిడిని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం ఆసుపత్రిలో డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డికి దాత అందజేశారు.

## దత్తమందిరంలో రేపు బృందావనార్చనసేవ



**తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి శుక్రవారం ఉదయం అత్యంత భక్తిశ్రద్ధలతో అవధూత దత్తాత్రేయమందిరంలో భక్తులే నిర్వహించే బృందావనర్చన సేవ రేపు జరగనుంది. ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం మొగలిచెర్లగ్రామంలో కోలువైనదత్తాత్రేయ స్వామి బృందావనాన్ని భక్తులే శుద్ధిచేసి, అభిషేకించే అవకాశం ఉంది. ఈ సేవలో పాల్గొనడానికి ఎటువంటి రుసుములేదు. ఈ వారంలో దత్తాత్రేయస్వామి మందిరంలో రేపు ఉదయం 9గంటల నుండి బృందావనార్చన సేవ మొదలవుతుంది.శనివారం సాయంత్రం 7గంటల నుండి విశేష పల్లకీసేవ జరుగుతుంది. ఆలయం వివరాలకు పవని విష్ణు కౌశిక్ 9182882632 ,9908973699 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

## భక్తులను మరింత ఆకట్టుకునేలా ఎస్వీబిసి ప్రసారాలు: టిటిడి జె ఇ ఒ డాక్టర్ శరత్

**తిరుమల,ఏప్రిల్ 8 ప్రభాత వార్త ప్రతినిధి:** శ్రీవారి భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) ప్రసారాలను విస్తరించనున్నట్లు టిటిడి జె ఇ ఒ (వైద్యం, విద్య) మరియు ఇంఛార్జి సి ఇ ఒ డాకార్ ఎ. శరత్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా కార్యాలయానికి వచ్చిన ఆయన, బుధవారం వివిధ శాఖల ప్రతినిధులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోజువారీ కార్యక్రమాల ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందేలా కార్యక్రమాలను మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని సూచించారు. "శతమానంభవతి" కార్యక్రమాన్ని క్రమబద్ధీకరించి ప్రతి భక్తునికీ శ్రీవారి ఆశీర్వచనం, అక్షింతలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. "దివ్యానుభూతి" కార్యక్రమాన్ని మరింత సులభంగా, అందరికీ చేరువగా తీసుకువస్తామని చెప్పారు.సోషల్ మీడియా వేదికల ద్వారా ఆకర్షణీయమైన భక్తి కార్యక్రమాలు, భక్తుల అనుభవాలను, ఇతర కార్యక్రమాలను మరింత విస్తృతంగా భక్తులకు చేరవేయనున్నట్లు తెలిపారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రసారమవుతున్న కార్యక్రమాలను మరింత నాణ్యంగా అందిస్తామని పేర్కొన్నారు.ఎస్వీబీసీ ద్వారా శ్రీవారి నిత్యసేవలు, ఉత్సవాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తూ భక్తులకు ఆధ్యాత్మికానుభూతి కలిగిస్తున్నామని తెలిపారు. వేదాలు, ఉపనిషత్తులు, సనాతన ధర్మాన్ని విస్తరించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించడంతో పాటు, శ్రీవారి వైభవాన్ని మరింత పేరొందిన పండితుల వ్యాఖ్యానాల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం కార్యాలయంలో ప్రసారాల రూపకల్పన, రికార్డింగ్, కంటెంట్, కెమెరాలు, ఆడియో మిక్సింగ్, డైలీ ప్రోగ్రామ్ చార్ట్ వంటి అంశాలను పరిశీలించి, అన్ని వివరాలు క్రమబద్ధంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

## విమర్శలపై స్పందించడంలో ప్రజాస్వామ్య పంథాను అనుసరించాలి : డి సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ ,ఏప్రిల్8 ,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు ఉంటాయని, వాటిపై స్పందించడంలో ప్రజాస్వామ్య పంథాను అనుసరించాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. విమర్శలు చేసిన వారిపై దాడులు చేయడం అప్రజాస్వామికం,పిరికితనంగా ఆయన"ఎక్స్" వేదికగా వ్యాఖ్యానించారుజ. గతంలో జగన్ సీఎం హోదాలో పాఠశాల విద్యార్థుల సమక్షంలోనే హద్దులు దాటి, దిగజారుడు మాటలు మాట్లాడారని పవన్ గుర్తు చేశారు. భార్యను కారుతో పోల్చి మాట్లాడిన జగన్ తీరును ప్రజలు మర్చిపోలేదని పేర్కొన్నారు. అలాగే అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు సతీమణిపై వైకాపా ఎమ్మెల్యేలు అసభ్యంగా మాట్లాడితే జగన్ నవ్వుతూ ప్రోత్సహించారని గుర్తు చేశారు. అప్పట్లో జగన్ కార్యాలయాలపై, ఆయన సంస్థలపైగానీ జనసేన అభిమానులెవరూ దాడి చేయలేదన్నారు. ఎదుటివారు దిగజారి మాట్లాడినా, మనం వారి స్థాయికి దిగజారవద్దని ప్రజాస్వామ్య రీతిలోనే స్పందించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైకాపా నేతలు ఈ రోజుకీ దిగజారి, అభ్యంతరకర భాషలోనే మాట్లాడుతున్నారని విమర్శించారు.



# మహిళలతో సాగు చేయిస్తూ..

**శరణార్థులకు సేవ చేయడానికి వెళ్లారు కానీ, వాళ్ల ఆకలి బాధలు చూడలేక సాగు బాట పట్టారు నసీమ్ షేక్ మూడు దశాబ్దాలుగా వ్యవ సాయం చేస్తూ ఐదు వందల గ్రామాల్లో మూడు వందల మహిళలతో వ్యవసాయం చేస్తున్నారు.**

మహారాష్ట్రలోని మరాఠ్వాడ ప్రాంతం... వేసవిలో నీళ్ల లేక భూములు ఎండిపోతే, వర్షాకాలం వరదలొచ్చి పంటలు మునిగిపోతాయి. దీంతో ఎప్పుడూ పంటలకు నష్టమే. ఆకలితో అలమటి కుటుంబాలు వేలల్లోనే. ఆ పరిస్థితిని చూడలేక పోయారామె. 1993లో లాతూరులో భూకం పం వచ్చినప్పుడు సోలాపూర్ నుంచి అక్కడి ప్రజలకు సేవ చేయడానికి వెళ్లారు నసీమ్. ఆ సమయంలో చాలామంది తమ కుటుంబాలతో పాటు నివాసాలూ కోల్పోయి కనిపించారు. ఆ సమయంలో ఆర్థికంగా సాయమందిస్తే సరి పోతుంది అనుకున్నారంతా. నసీమ్ మాత్రం అక్కడి ప్రజలకు సాధికారత కల్పించాలనుకున్నారు. వాళ్ల ఆకలి తీరుస్తూనే ఆదాయ మార్గాలు సృష్టించాలనుకున్నారు. దానికి ఆమె ఎంపిక మార్గం వ్యవసాయం. కానీ అక్కడి వాతావరణ పరిస్థితులకి ఎలాంటి పంటలు వేయాలో అర్థం కాలేదట నసీమ్కి. అందుకె ఒక ఏకరం విధానంలో పంటలు పండించాలనుకున్నారట. అంటే, ఒకటికి మించి ఎక్కువ పంటల్ని ఏడాది పొడవునా పండించడం... చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు. ఇలా 36 రకాల పంటల్ని సాగుచేశారు నసీమ్. ఒకటి రెండు రకాల పంటల్లో నష్టం వచ్చినా మిగిలినవి లాభాలు తెచ్చేవి. మొత్తమ్మీద ఫలితాలు అనుకూలంగా రావడంతో అక్కడి మహిళ దీన్ని నేర్పించాలనుకున్నారీమె.



**మార్పు వల్లే సాధ్యం...** మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించగలరు. సాగులో మహిళా నాయకత్వం పెరిగితే సమాజంలో లింగసమానత్వం ఏర్పడుతుంది. వ్యవసాయం అంటే మగవాళ్ల పనే లాంటి ఆలోచనలకు తెరదించాలనుకున్నా. కానీ, ఆడవాళ్లు సాగు చేస్తారంటే అక్కడి వాళ్లు ఒప్పుకోలేదు. ఎందుకంటే అక్కడి భూములన్నీ మగవాళ్ల పేరుమీదే ఉంటాయి. దాంతో కౌలుకి ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. అందుకే అక్కడి మహిళలు తమ ఇంటి చుట్టూ ఉన్న కొద్దిపాటి ప్రదేశాల్లోనే ఎక్కువ దిగుబడితో పంటలు పండించారు. దాంతో మగవాళ్ల ఆలోచనల్లో మార్పు వచ్చింది. అలా అక్కడి మహిళలు సేంద్రియ పద్ధతిలో పంటలు పండించడం మొదలు పెట్టారు. మహిళా రైతులు స్థానిక వాతావరణం సవాళ్లకు అనుగుణంగా వైవిధ్యభరితంగా బహుళ పంటలు పండిస్తున్నా... ఆర్థిక సవాళ్లు తప్పలేదు. దాంతో అక్కడి ప్రభుత్వం స్వయం శిక్షక్ ప్రయోగ్ (ఎస్ఎస్పీ) సాయం తీసుకుంది. ఇది మూడు దశాబ్దాలుగా ఆరోగ్యం, పోషకాహారం, నీటి భద్రత, పారిశుధ్యం... వంటి రంగాల్లో మహిళలకు సాధికారత కల్పించేందుకు కృషి చేస్తోంది. నిధులను అందిస్తోంది. వ్యవసాయంతో పాటు టైలరింగ్, డెయిరీ, కోళ్ల పెంపకంతోపాటు వివిధ ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇస్తున్న సంస్థ. స్థానికులకు నసీమ్ అందిస్తోన్న తోడ్పాటుని చూసి ప్రభుత్వం 2025లో ఎస్ఎస్పీకి సీఈఓని చేసింది. తరువాత ఆమె మహిళల కోసం విమెన్ఇనిషియేటివ్ టు లర్న్ అండ్ లీడ్(విల్)ని తీసుకొచ్చారు. అక్కడ వేల కుటుంబాల్లో ఆహార భద్రత, ఆదాయం పెరిగేలా చేశారు. ఇప్పుడు మహిళలు స్వయం ఉపాధి పొందుతూ నాయకురాలుగా ఎదిగారు. ◻



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**వ్యథ**

# ఆఖరి దశలో కోడలు తల్లి లాంటిదే!

**ప్రశ్న:** కోడలిలో కూతురుని చూడాలి అంటారు. కోడలు ఒక దశలో తల్లిలాంటి దని కూడా చెబుతారు. కానీ ప్రస్తుతం చాలా కుటుంబాల్లో అత్తా-కోడళ్ళ మధ్య విభేదాలు కని పిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అత్తల్లో మార్పు తీసుకు రావడానికి మార్గం ఏమిటి? **- ఒక కోడలు, హైదరాబాద్**

**జవాబు:** అమ్మా, మన భారతీయ కుటుంబ వ్యవస్థ అనుబంధాలు, విలువలతో నిర్మితమైంది. జననం నుంచి జీవనాంతం వరకు మనిషి సుఖశాంతులకు తోడ్పడేలా ఈ వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఇందులో కోడలి స్థానం ఎంతో విశిష్టమైనది."కోడలు తల్లి లాంటిదే" అనే మాటలో ఒక గొప్ప జీవన సత్యం ఉంది. చిన్నప్పుడు తల్లి చేయి పట్టుకుని నడక నేర్పిస్తుంది. అదే జీవితం చివరి దశలో, నడవలేని స్థితిలో ఉన్నప్పుడు కోడలు చేయి పట్టుకుని నడిపిస్తుంది. ఆమె అన్నం తినిపిస్తుంది, ఆదరిస్తుంది, ఆప్యాయంగా చూసుకుంటుంది. అందుకే కోడలిని ఇంకో తల్లిగా భావి స్తారు. అయితే, ప్రతి ఇంట్లో ఈ అనుబంధం ఇంత సున్నితంగా ఉండదు. కొన్ని చోట్ల అత్తా-కోడళ్ళ మధ్య విభేదాలు తీవ్రంగా కనిపిస్తాయి. ఇవి ఒక్కసారిగా రావు; చిన్న చిన్న అపార్థాలు, అహంకారం, పరస్పర అవగాహన లోపం వల్ల మెల్లగా పెరుగుతాయి. మార్పు ఎప్పుడూ బలవంతంగా రాదు. అది మన ప్రవర్తన, మన దృక్పథంతో సహజంగా రావాలి. మొదటగా, సంభాషణ ఎంతో ముఖ్యం. మాటల్లో కఠినత కంటే మృదుత్వం అవసరం. సమస్యలను మనసులో పెట్టుకోకుండా, సరైన సమయంలో సున్నితంగా వ్యక్తపరచాలి. అత్తను గౌరవంతో చూడటం వల్ల ఆమె మనసులో కోడలి పట్ల సానుకూల భావన పెరుగుతుంది. గౌరవం ఇచ్చిన చోట ప్రేమ పెరుగుతుంది. 'నా అమ్మ ఇలా చేయదు" అనే పోలిక బంధాన్ని దెబ్బ తీస్తుంది. ప్రతి కుటుంబానికి తన ప్రత్యేకత ఉంటుంది. ఇంటి పనుల్లో, నిర్ణయాల్లో అత్తను భాగస్వామ్యం చేయడం ద్వారా ఆమెకు తన స్థానంపై నమ్మకం పెరుగుతుంది. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే మార్పు కోసం ఇద్దరూ ఎదురు చూడకుండా, ఎవరో ఒకరు ముందడుగు వేయాలి. ప్రేమ, గౌరవం, ఓపిక ఉన్న చోట విభేదాలు ఎక్కువకాలం నిలవవు. కోడలిని కూతురిలా అంగీకరిస్తే, ఆమె నిజంగానే తల్లి లాంటిదే అవుతుంది. ఆప్యాయతతో నిండిన అత్తా-కోడళ్ళ బంధం ఒక ఇంటిని స్వర్గంగా మార్చగలదు. ◻





# నమ్మకం కలిగి ఉండు..

**సాయిబాబా సన్నిధిలో దాదాపు** మూడు నెలలు ఉండిన ఏకైక తెలుగు వ్యక్తి శుద్ధానంద. ఆయన కవి, యోగి, మహర్షి. భారతదేశంలో ఆనాటి చాలామంది సమకాలిక మహనీయులను దర్శించి, వారిలో అనుబంధం ఏర్పర్చుకున్న ఏకైక తెలుగు వ్యక్తి ఈయనే అనవచ్చు. ఈయన మే 11, 1897న జన్మించారు. సాయిని గూర్చి అనేక విషయాలను తెలిపారాయన. సాయిబాబా రాం రాం అల్లారాం అని తనకు భిక్షనిచ్చిన వారిని దీవించే వారు. సాయి కోసం భక్తులు వెండి పల్లకి ఇచ్చారు. సాయిదానిలో కుక్కను నిద్రపోనిచ్చేవారు. దైవములో ఆ కుక్క ఉన్నారు అనేవాడు సాయి. సాయి తన బిక్షను మొదట కుక్కకు పెట్టిమిగిలిన దానిని పేదసాదలకు పంచేవారు. ఆయన అతి తక్కువగా తినేవారు. సాయిని కీర్తించినప్పుడు శుద్ధానంద భారతితో కీర్తి చెందవలసినది భగవంతుడే. ఆయనే మన గురువు సృష్టి. అంతా ఆయన లీల. సూర్యుడు, చంద్రుడు తరకలు, నీలాకాశం అంతా ఆయన సృష్టే. సృష్టి అంతా ఆయన చమత్కార లీల కాదా! సూర్యోదయాన్ని మించి చూపే చమత్కార లీల ఉంటుంది? చమత్కార లీలలన్నీ ఆయనవే. ఆయనే విశ్వంభరుడు. ఆయన యందు ఎనలేని నమ్మకాన్ని ఉంచుకో అనే వారు. ఇంకా సాయి నోరు మూసుకో, హృదయం తెరచుకో, భయపడకు. నీవు తుఫాన్‌నైనా ఎదుర్కొనగలవు. ఈ శరీరం త్వరలో నశింపవచ్చును నేను శరీరం కాదు. సాధకులకు సాయం చేసేందుకు నేను అన్ని చోట్లా ఉంటాను అనే వారు శుద్ధానందులతో. శుద్ధానంద భారతి ఒక సంఘటన తెలిపారు. సాయిబాబా రామాయణాన్ని, రామ నామాన్ని ప్రోత్సహిస్తున్నాడని ఒక ముస్లిం మతస్తుడు సాయిబాబాను వధించటానికి కత్తి తీసాడు. సాయిబాబా లేచి నిలబడ్డాడు. ఆ ముస్లింతో అలాగే కానివ్వు. చంపు పైన అల్లా నీవు చేసే పనిని చూస్తున్నాడు అన్నారు సాయి. అతడు నిర్ఘాంతపోయాడు. కత్తి నేల మీద పడింది. అతడు నేలపై కుప్పుకూలాడు. కదలేక పోయాడు. అల్లా హే అల్లా.. మాఫ్.. అని అర్థించాడు అతడు. అన్ని శరీరాలు ఇలా బూడిద అవవలసిందే. అలా జరిగేముందు వినయంగా, నిరాడంబరంగా నమ్మకం కలిగి ఉండు. అల్లా తనకు ఇష్టం వచ్చినట్లు మలచుకుంటాడు అన్నాడు సాయి. అల్లా అచ్చా కరేగా..

**- యం.పి.సాయినాథ్**

# ఇంటి పనులతో ఫిట్‌గా..

**ఇంటి పనులతో కూడా సాధ్యమే అంటున్నారు నిపుణులు. గిన్నెలు శుభ్రం చేసుకోవడం, బట్టలు ఉతకడం.. ఇంటిని క్లీన్ చేసుకోవడం.. ఇలా చేయడం వల్ల మన శరీరానికి వ్యాయామం ఉపయోగపడుతుంది. అదెలాగో తెలుసుకుందాం..**



**బరువు అనుకోవద్దు..** ఏ పనైనా సరే భారంగా ఫీలయితే అస్సలు చేయాలని పించదు. అందుకే రోజువారీ కాకుండా అదనంగా పనులేవైనా చేయవలసి వచ్చినప్పుడు వాటిని బరువుగా అనుకోవద్దు. ఉదాహరణకు.. పండగలు, శుభకార్యాలకు ఇంట్లో బూజు దులపడం, వస్తువులన్నీ శుభ్రం చేసుకోవడం. అయితే ఇవన్నీ చేయడం కాస్త కష్టమే అయినా వీటి వల్ల శరీరానికి అందే వ్యాయామం ఎక్కువే ఎక్సర్సైజ్ చేసేటప్పుడు ఎలా ఎంజాయ్ చేస్తామో.. ఇంటి పనులన్నీ కూడా అంతే ఉత్సాహంతో చేస్తే అలుపన్నది అంత త్వరగా దరిచేరదు. పనులు కూడా త్వరగా పూర్తవుతాయి.. ఒంటికి పైగా వ్యాయామమూ అందుతుంది.

**ఊడవడం, తుడవడం..** ఇల్లు ఊడవడం, తుడవడం.. లాంటి పనులు చేయడానికి చాలామంది ఆసక్తి చూపారు. కానీ ఈ పనుల వల్ల భుజాల కండరాలకు వ్యాయామం అవి మరింత దృఢమవుతాయి.

**నిల్చొని చేయడమూ...** ఇంట్లో మనం చేసే చాలా పనులు నిల్చొని చేయవలసి వస్తుంది. అయితే ఈ కోసం కాళ్లు లాగేస్తున్నాయ్! లేదంటే నడుం నొప్పి వస్తోంది అంటూ నీరసించి పోతుంటారు కొందరు. కానీ ఇలా నిలబడి, అటూ ఇటూ తిరుగుతూ పనులు చేయడం వల్ల కూడా శరీరానికి చక్కటి వ్యాయామం అందుతుందంటున్నారు నిపుణులు.

**బరువులెత్తడమూ మంచిదే ...** ఇంట్లో చేసే పనుల్లో బరువులెత్తడం, వస్తువులను ఒకచోట నుంచి మరోచోటుకి మార్చడం.. వంటివి సహజం. వీటి వల్ల కూడా శరీరానికి మంచి ఎక్సర్‌సైజ్ అందుతుంది. ◻

# నూనె లేని దాల్ తడకా



మనలో కొందరు కూరల్లో నూనె ఎక్కువేస్తేనే రుచి అనుకుని పైకి తేలేలా వేస్తుంటారు. నిజానికి తక్కువ నూనెతోనూ, అసలే వేయకుండా కూడా చక్కటి వంటలు చేయొచ్చు. వాటిలో మనందరికీ చాలా ఇష్టమైన 'దాల్ తడకా' ఒకటి. జీరో ఆయిల్ దాల్ తడకా కోసం.. కందిపప్పు ఒక కప్పు, ఉప్పు రుచికి సరిపోతుంది, ఉల్లి తరుగు అర కప్పు, వెల్లుల్లి 2 రెబ్బలు, పచ్చిమిర్చి 2, ముద్ద చెంచా, గరం మసాలా, కసూరీ మేథీ, పసుపు, ఆవాలు అర చెంచా చొప్పున, ఎండు అల్లికర్ర, చికారం, ధనియాల పొడి, నిమ్మరసం, ధనియాల పొడి, నిమ్మరసం, ధనియాల పొడి, నిమ్మరసం. 1, కరివేపాకు రెండు రెబ్బలు, కొత్తిమీర తరుగు పావు కప్పుతీసుకోవాలి. ఎలా చేయాలంటే. కందిపప్పును కడిగి ఉడికించాలి. ప్యాన్‌లో అల్లం, వెల్లుల్లి, ఉల్లి తరుగులను సన్న సెగ మీద వేయించాలి. అడుగంటు తున్నట్టు అనిపిస్తే నాలుగు చుక్కల నీళ్లు చిలకరించాలి. లేత గోధుమ రంగులోకి మారాక పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, కసూరీ మేథీ జతచేయాలి. అర నిమిషం వేయించాక.. దీన్ని ఊడిన పప్పులో కలపాలి. మరో పాత్రలో ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, ఇంగువ, కరివేపాకులను ఒక్కొక్కటిగా వేస్తూ వేయించాలి. మంచి వాసన వస్తుండగా సెగ తీసేసి.. ఈ దినుసులను కూడా పప్పులో కలపాలి. ఇక కొత్తిమీర తరుగు, నిమ్మరసం కూడా జోడిస్తే.. నూనె లేని దాల్ తడకగా తయారవుతుంది. ◻

# 'రాకా' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



భారతీయ చిత్ర పరిశ్రమ ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ, టాప్ ప్రొడ్యూసర్ కళానిధి మారన్ సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న చిత్రం ముందు వరుసలో ఉంటుంది. ఇక 'రాకా' టైటిల్‌తో పాటుగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఆయన బర్త్ డే సందర్భంగా ఇచ్చిన ఈ అప్డేట్‌లతో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. ఈ పోస్టర్‌లో అల్లు అర్జున్ ఇంత వరకు కనిపించని ఓ కొత్త అవతారంతో అందరినీ ఆశ్చర్య పరుస్తున్నారు. గుండుతో, వింత శరీరాకృతితో అందరిలోనూ అంచనాల్ని పెంచేశారు. అల్లు అర్జున్ చూపుల్లో వాడివేడి, పోస్టర్‌ను డిజైన్ చేసిన తీరు అందరిలోనూ అంచనాల్ని రెట్టింపు చేసింది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అభిమానులు ఐకాన్ స్టార్ పుట్టినరోజును ఈ అప్డేట్లతో ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకుంటున్నారు. దాదాపు ఏడాది పాటు అభిమానులను ఎదురుచూసేలా చేసిన తర్వాత అట్లీ, అల్లు అర్జున్ ఈ అప్డేట్‌లతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. 'రాకా'తో సిల్వర్ స్క్రీన్ మీద ఏం క్రియేట్ చేయబోతోన్నారో అనే చర్చను మరోసారి లేవనెత్తారు. పుష్ప: 'ది రూల్' ప్రపంచవ్యాప్త విజయం తర్వాత జాతీయ అవార్డు గ్రహీత నటుడు అల్లు అర్జున్ 'రాకా'తో అందరినీ మెప్పించేందుకు రెడీ అవుతున్నారు. 'రాకా' ఒక భారీ సాంకేతిక చిత్రంగా ఉంటుందని, హాలీవుడ్ దిగ్గజాలకు దీటుగా విజువల్ ఎఫెక్ట్స్, ప్రపంచ నిర్మాణాన్ని సృష్టించాలని అట్లీ లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే.

# తెర

## 'డెకాయిట్' ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది: విక్టరీ వెంకటేష్




బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ పాన్‌ఇండియా యాక్షన్ రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతు న్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలు సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. డెకాయిట్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. డెకాయిట్ ఈవెంట్‌కు అందరూ నేను సుప్రియ కోసం వచ్చాను అనుకుంటున్నారు. కానీ నేను సురేంద్ర మావయ్య కోసం వచ్చాను. హీరో అడివి శేష్ మాట్లాడుతూ... డెకాయిట్ సినిమా ఎట్మాస్లో చూశాక చాలా నచ్చింది, ప్రాణం పెట్టి చేశాను. చాలా గ్రేట్ ఫుల్‌గా అనిపించింది. హీరో సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ.. సుప్రియకి సుమంత్ అన్నకి థాంక్యూ సో మచ్. శానిల్ కృష్ణ అండ్ లీల షూట్ చేశాడు. హీరోయిన్ మృణాల్ ఠాగూర్ మాట్లాడుతూ.. వెంకటేష్‌కి ధన్యవాదాలు. ఈ సినిమా నేను చేయడానికి మొదటి కారణం డైరెక్టర్ శౌర్య . హీరో సుమంత్ మాట్లాడుతూ.. సుప్రియ మనసు వెన్న. తను చాలా కష్టపడే తత్వం ఉన్న మనిషి. తన విషయంలో నాకు ఎప్పుడూ గర్వంగా ఉంటుంది.

# మహిళలకు 'డైమండ్ డెకాయిట్' చిత్రం ఉచితం



ట్రైలర్‌ను వీక్షించి అభినందించిన కె. రాఘవేంద్రరావు రిలీజ్ అయ్యే థియేటర్‌లలో మహిళలకు 4 షోలు ఉచిత ప్రదర్శన ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కంప్లీట్ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా 'డైమండ్ డెకాయిట్' చిత్రం ఈ నెల ఏప్రిల్ 10న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఘనంగా థియేటర్‌లలో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా దర్శకేంద్రుడు కే. రాఘవేంద్ర రావు ట్రైలర్‌ను వీక్షించి చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ ప్రత్యేక సందర్భంలో చిత్ర యూనిట్ మహిళా ప్రేక్షకులకు ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విడుదల కానున్న థియేటర్లలో 4 షోలు మహిళలకు ఉచితంగా ప్రదర్శించనున్నట్లు వెల్లడించింది. మహిళలు ఎక్కువ సంఖ్యలో థియేటర్లకు వచ్చి సినిమా ఆస్వాదించాలని చిత్ర బృందం కోరుతోంది. ఈ చిత్రంలో పార్థా గోపాల్ హీరోగా నటించడమే కాకుండా నిర్మాతగా వ్యవహరించగా, మేఘనా రెడ్డి హీరోయిన్‌గా నటించారు. రచయిత-దర్శకుడు సూర్య జి.యాదవ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పూర్తి కుటుంబ వినోదంతో పాటు హృద్యమైన భావోద్వేగాలతో కూడిన ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కింది. ఇప్పటికే నిర్వహించిన ప్రివ్యూ షోలలో పలువురు సినీ ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసించినట్లు చిత్ర యూనిట్ తెలిపింది. "డైమండ్ డెకాయిట్ ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా. ప్రతి కుటుంబం కనెక్ట్ అయ్యేలా కథ ఉంటుంది. కడపలో చిత్రీకరించిన అందమైన లోకేషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మహిళలకు 4 షోలు ఉచితంగా ఏర్పాటు చేశాం. అందరూ థియేటర్లకు వచ్చి సినిమా చూడాలి" అని అన్నారు.

# బెల్లంకొండ శ్రీనివాస్ కావ్యరెడ్డి నిశ్చితార్థం



యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య రెడ్డి నిశ్చితార్థం హైదరాబాద్ శంకర్‌పల్లిలోని ఓ విశాలమైన ఫామ్‌హౌస్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో సినీ పరిశ్రమ మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొనున్నారు. నిశ్చితార్థ వేడుకలో సాయి కావ్య జంట తమ ప్రత్యేక బంధాన్ని ప్రతిబింబించేలా కస్టమైజ్డ్ జువెలరీను ధరించారు. ఆ అందాన్ని మరింత పెంచుతూ వారి ఎంగేజ్‌మెంట్ లుక్స్‌ను ఢిల్లీకి చెందిన ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ అభిషేక్ శర్మ డిజైన్ చేశారు. సంప్రదాయం, ఆధునికత కలిసిన ఈ లుక్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అభిమానులు, నెటిజన్లు సాయి కావ్య జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. సాయి శ్రీనివాస్ కావ్య రెడ్డి వివాహ వేడుకకు శ్రీనివాసకావ్యాణం అని పేరు పెట్టారు. వివాహ వేడుక ఏప్రిల్ 29న దివ్యమైన తిరుమలలో జరగనుంది. అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రదేశం చిరస్మరణీయమైన కలయికకు అపూర్వ వేదికగా నిలుస్తుంది.

# 'కోర్ట్' రీమేక్‌లో దేవయాని వారసురాలి



పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించేలా దర్శకుడు రామ్ జగదీశ్ తెరకెక్కించిన కోర్ట్ సినిమా (కోర్ట్ మూవీ) మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ లీగల్ డ్రామా మూవీ.. కోలీవుడ్లో రీమేక్ అవుతోంది. చెన్నైలో సోమవారం ఈ చిత్ర ప్రారంభోత్సవం సందడిగా జరిగింది. ఈ వేడుకకు నటుడు విశాల్, వెట్రిమారన్ ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. రంజన్: ది అడ్వకేట్ టైటిల్ తో త్యాగరాజన్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. జీన్స్ ప్రశాంత్.. టైటిల్ పాత్రను పోషిస్తున్నారు. ఆయన తండ్రే ఈ మూవీ డైరెక్టర్. నటి దేవయాని కుమార్తె ప్రియాంక రాజ కుమారన్ (దేవయాని కుమార్తె), నిర్మాత ఎస్. కదిరేశన్ తనయుడు హరి ఈ సినిమాతోనే కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వడం విశేషం. తెలుగులో హర్ష్ రోషన్ పోషించిన పాత్రలో హరి నటించనున్నాడు. శ్రీదేవి రోల్లో ప్రియాంక సందడి చేయనుంది. మరో కీలక పాత్ర మంగపతిగా కోలీవుడ్లో ఎవరు కనిపిస్తారా? అన్నది ఆసక్తికరం. దేవయాని మరెవరో కాదు హిటమూవీ సుస్వాగతం హీరోయిన్. చెన్నకేశవరెడ్డి, అరవింద సమేత తదితర చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు.

# 'పల్లిచట్టంబి' ట్రైలర్ రిలీజ్



ఈ నెల 10న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న సినిమా "పల్లి చట్టంబి". మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ "పల్లిచట్టంబి'. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహార్ హీరోయిన్ గా నటిస్తోంది. "పల్లి చట్టంబి" సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఈ నెల 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ రోజు 'పల్లిచట్టంబి' సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ఎలా ఉందో చూస్తే కున్నుంపురంలో పేదల భూములపై కొందరు స్వార్థపరులు కన్నేస్తారు. ఎదురు తిరిగిన ప్రజలను హింసించేందుకు అవినీతిపరుడైన ఓ పోలీస్ ఆఫీసర్‌ను ఉపయోగించుకుంటారు. ఈ భూమిని, తమను కాపాడే ఓ వ్యక్తి కోసం అక్కడి ప్రజలంతా వేచి చూస్తుంటారు. ఆ సమయంలో వీరుడు లాంటి వ్యక్తి కున్నుం పురంలో అడుగుపెడతాడు. అక్కడి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాడు. ఆ ఊరి మట్టినే ఆయుధంగా మలచి, పెను తుఫాన్ లాంటి దాడులను ఎదుర్కొంటాడు. ప్రజలతో కలిసి ఎంతో ధైర్య సాహసాలతో ఈ వ్యక్తి చేసిన పోరాటం ఫలించిందా?, ఆ భూమి ఊరి ప్రజలకే దక్కిందా? లేదా ? అనేది ట్రైలర్ ఆసక్తిని కలిగించింది. ఈ ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్ టైనర్‌లో ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ కూడా ఉన్నట్లు ట్రైలర్ తో తెలుస్తోంది. టొవినో థామస్ పర్ ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్సులు చేసిన విధానం, కయదు లోహార్ మేకోవర్, స్క్రీన్ ప్రెజెన్స్ ట్రైలర్ కు హైలైట్స్‌గా నిలుస్తున్నాయి. 50, 60 దశకాల నేపథ్య కథను దర్శకుడు డిజో జోస్ ఆంటోనీ ఎంతో సహజంగా తెరకెక్కించారు.

## రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# సెహ్రావత్‌కు రజత పతకం



**న్యూఢిల్లీ:** ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో లలిత్ సెహ్రావత్ తొలి గ్రీకోరోమన్ రజత పతకాన్ని సాధించాడు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన ఈ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సెహ్రావత్ గ్రీకోరోమన్ రెజ్లింగ్‌లో పురుషుల 55 కేజీల విభాగంలో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మూడేళ్లలో ఖండాంతర ఛాంపియన్‌షిప్‌లలో గ్రీకోరోమన్ విభాగంలో భారతదేశానికి ఇదే తొలి రజత పతకం. 2023 ఎడిషన్‌లో ఇదే వెయిట్ క్లాస్‌లో రూపిన్ గహ్లావత్ చివరిసారిగా ఈ పతకాన్ని సాధించాడు. సెమీఫైనల్‌లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత హుయోయింగ్ షీపై లలిత్ ఘన విజయం సాధించినప్పటికీ, ఆ ఊపును కొనసాగించలేక ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ఇఖ్తియార్ బోటిరోవ్ చేతిలో 0-9 తేడాతో స్వర్ణ పతక పోరులో ఓడిపోయాడు. ముహమెట్ మాలో ర్యాంకింగ్ సిరీస్‌లో కాంస్య పతకం సాధించిన తర్వాత, వరుసగా రెండవ టోర్నమెంట్‌లోనూ పతకం గెలుచుకొని, ఈ 23 ఏళ్ల యువకుడు ఈ ఏడాదిలో ఇప్పటివరకు అద్భుతంగా రాణించాడు. మరోవైపు, భారతదేశపు అత్యంత ప్రతిభావంతులైన గ్రీకోరోమన్ రెజ్లర్లలో ఒకరైన సునీల్ కుమార్, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో తన ఆరవ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పురుషుల 87 కేజీల విభాగంలో మాజీ ఛాంపియన్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ముఖమ్మద్‌కోదిర్ రసూలోవ్‌పై 5-4 తేడాతో హోరాహోరీగా గెలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే 19 ఏళ్ల అమన్ బరోనియా తీవ్ర నిరాశకు గురయ్యాడు. దక్షిణ కొరియాకు చెందిన యోంగ్‌హున్ నోహ్‌తో జరిగిన అధిక స్కోరింగ్ పోరులో, 77 కేజీల కాంస్య పతకం కోసం జరిగిన హోరాహోరీ పోరులో అతను 14-15 తేడాతో ఓడిపోయాడు.

## మహిళల ఆసియా కప్‌లో
# చైనీస్ తైపీపై భారత్ విజయం



**న్యూఢిల్లీ:** ఏఎఫ్‌సి అండర్ 20 మహిళల ఆసియా కప్‌లో చైనీస్ తైపీపై భారత్ ఘన విజయం సాధించింది. 22 ఏళ్లలో భారత్ మహిళలకు ఇదే తొలి విజయం. బుధవారం థాయ్‌లాండ్‌లోని పతుమ్ థాని స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్, చైనీస్ తైపీని 3-1 తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. భారత్ తరఫున భూమిక దేవి ఖుముఖ్‌చమ్ (26వ నిముషం), శిబానీ దేవి (32, 87) గోల్స్ చేయగా, తైపీ తరఫున కావో సిన్ (90+3వ నిముషాల్లో) ఒక గోల్ చేసి ఓటమి అంతరాన్ని తగ్గించింది. భారత్ దాదాపు 69 శాతం బంతి నియంత్రణతో ఆధిపత్యం చెలాయించింది.
దాడి విభాగంలో కూడా, బ్లైగ్రెసెస్ తాము సంధించిన 18 షాట్లలో 10 షాట్లను లక్ష్యం వైపు సంధించింది. రిబన్సీ జమున గోల్ కీపర్‌గా ప్రారంభ దశలలో కొన్ని సేవ్‌లు కూడా చేసింది. ఆ తర్వాత 26వ నిమిషంలో, భూమిక కొట్టిన షాట్‌తో భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. ఆరు నిమిషాల తర్వాత, భారత హాఫ్ లోపలి నుండి వచ్చిన క్రాస్‌ను అందుకున్న బంతిని శిబాని చాకచక్యంగా అవతలి పోస్ట్‌లోకి కొట్టి, తన జట్టు ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. రెండు గోల్స్‌తో వెనుకబడిన తైపీ, రెండవ అర్ధభాగంలో భారత్ గోల్‌పైకి బంతిని నెట్టినా దాన్ని ఎదుర్కొని దృఢంగా నిలిచింది. 53వ నిమిషంలో చువాన్ త్జుయు ఒక క్రాస్‌ను అందుకుని హెడర్ కొట్టగా, వెనుకబడిన జట్టుకు ఖాతా తెరిచేందుకు ఒక అద్భుతమైన అవకాశం లభించింది. అయితే బాక్స్ లోపల లిన్ పిన్‌సిన్ చేతితో బంతిని తాకడంతో లభించిన పెనాల్టీని సిబానీ గోల్‌గా మలచడంతో భారత్ తన మూడవ గోల్‌ను నమోదు చేసింది. ఆ తర్వాత స్టాపేజ్ టైమ్ చివరిలో హ్సిన్ గోల్ చేసి తైపీ ఖాతాను తెరిచింది, కానీ అప్పటికే ఆమె జట్టు పోటీ నుండి దాదాపుగా నిష్క్రమించింది.

## బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో
# వరల్డ్ నం.7ను మట్టికరింపించిన ఆయుష్
### తొలి రౌండ్‌లో నిష్క్రమించిన మాళ్వికా

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ ప్రారంభ రౌండ్‌లో ఆయుష్ శెట్టి, ప్రపంచ నంబర్ 7, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేతను మట్టికరిపించాడు. బుధవారం చైనాలోని నింగ్బోలో జరుగుతున్న ఆసియా ఛాంపియన్‌షిప్స్ ప్రారంభ రౌండ్‌లో చైనాకు చెందిన ఐదవ సీడ్, 20 ఏళ్ల లీ షి ఫెంగ్‌ను వరుస గేమ్‌లలో 21-13, 21-16 తేడాతో ఓడించి, 51 నిమిషాల్లో మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. ఆయుష్ ఆరంభంలోనే పుంజుకుని 4-4తో స్కోరును సమం చేయగా, 7-7 వరకు లీ స్వల్ప ఆధిక్యంలో నిలిచాడు. అక్కడి నుంచి, భారత షట్లర్ పట్టు సాధించి గేమ్‌ను 21-13 తేడాతో కైవసం చేసుకున్నాడు. రెండవ గేమ్ కూడా అదే రీతిలో సాగింది. లీ మొదట్లో ఒత్తిడి తెచ్చి మధ్య దశలో ఆధిక్యం సాధించాడు. అయితే, ఆయుష్ పలుమార్లు స్కోరును సమం చేసినప్పటికీ, 13-13 వద్ద గేర్లు మార్చాడు.
వరుసగా ఆరు పాయింట్లు సాధించి దూసుకుపోయి, 51 నిమిషాల్లో 21-16 తేడాతో మ్యాచ్‌ను ముగించాడు. ఈ ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఇదే తొలి పోరు. ఈ విజయంతో ఆయుష్ ఇప్పుడు రౌండ్ ఆఫ్ 16లో చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ నంబర్ 20 చి యు జెన్‌తో తలపడనున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో భారత్‌కు చెందిన మాళ్విక బన్సోద్ 41 నిమిషాల పోరులో థాయ్‌లాండ్‌కు చెందిన బుసనన్ ఒంగ్‌బమ్రుంగ్‌ఫాన్ చేతిలో 10-21, 19-21 తేడాతో ఓడిపోయి, మొదటి రౌండ్‌లోనే ఛాంపియన్‌షిప్‌ల నుండి నిష్క్రమించింది. మరోవైపు, స్టార్ షట్లర్ పివి సింధు తనకంటే చాలా తక్కువ ర్యాంకులో ఉన్న మలేషియాకు చెందిన లింగ్ చింగ్ వాంగ్‌ను ఓడించింది.





ఆట



# పేరుకే మోనార్క్‌లు
## ఐపిఎల్‌లో ఫ్లాప్ పేయర్లు

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌లో ఒక వారం ముగిసింది. ఈ మొదటి వారం కొంతమంది కొత్త ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకోగా, మరికొందరు విఫలమయ్యారు. కొంతమంది స్టార్ ఆటగాళ్లు పేలవ ప్రదర్శనలు కనబరచడంతో తొలి వారంలో ఫ్లాప్ ప్లేయర్స్ జాబితాలో చేరారు. అలాంటి ఐదుగురు స్టార్ ఆటగాళ్లలో పంజాబ్ కింగ్స్ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ సీజన్‌లో అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లలో 42 పరుగులు ఇచ్చి వికెట్లేమీ తీయలేదు. తర్వాత చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో కూడా ధారాళంగా పరుగులు ఇచ్చి, 4 ఓవర్లలో వికెట్ తీయకుండా 41 పరుగులు ఇచ్చాడు. ముఖ్యంగా, అతను గుజరాత్ టైటాన్స్‌పై 11 బంతులతో ఒక ఓవర్ వేసి, ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన ఓవర్‌ను నమోదు చేశాడు. ఇక వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ సంజు శాంసన్ ఇప్పటివరకు చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఇబ్బంది పడుతున్నాడు. 3 మ్యాచ్‌లలో 6, 7, 9 పరుగులు మాత్రమే చేసి, అతని ఫామ్‌పై ప్రశ్నలను లేవనెత్తుతున్నాడు. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో సంజు భారత జట్టుకు మ్యాచ్ విన్నర్‌గా నిరూపించుకున్నాడు. కానీ, ఇప్పుడు అతని ఫామ్ సీఎస్‌కేకు తలనొప్పిగా మారింది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఖరీదైన విదేశీ ఆటగాడైన కామెరాన్ గ్రీన్ పేరుకు తగ్గట్టుగా రాణించలేకపోయాడు. అతను బౌలింగ్ చేయలేకపోగా, బ్యాటింగ్‌లో కూడా పెద్దగా సహకరించలేదు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో గ్రీన్ 18 పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో 2 పరుగులకే రనౌట్ అయ్యాడు. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ సీనియర్ బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్ ప్రదర్శన కూడా నిరాశపరిచింది. జట్టు అతని నుంచి భారీ స్కోరును ఆశించగా, రెండు ఇన్నింగ్స్‌లలో కేవలం 1 పరుగు మాత్రమే చేయగలిగాడు. లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లో రాహుల్ ఖాతా తెరవడంలో విఫలమయ్యాడు. ముంబై ఇండియన్స్‌పై 1 పరుగు మాత్రమే సాధించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా తొలి రెండు మ్యాచ్‌లలో ప్రభావం చూపడంలో విఫలమయ్యాడు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో 4 ఓవర్లలో 48 పరుగులు ఇవ్వగా, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 2 ఓవర్లలో 31 పరుగులు ఇచ్చాడు. అతని బౌలింగ్‌లో స్పష్టంగా నిలకడ లోపించింది. అతని లెంగ్త్, లైన్ కూడా స్థిరంగా లేవు.

## ఫిడే కాండిడేట్స్‌లో
# దివ్య సంచలన విజయం
### ప్రజ్ఞానంద రెండో ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల కాండిడేట్స్-2026 టోర్నమెంట్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్, టోర్నమెంట్ లీడర్ అయిన ఉక్రెయిన్‌కు చెందిన అన్నా ముజిచుక్‌ను ఓడించి సంచలనం సృష్టించింది. ఈ విజయంతో దివ్య లీడర్‌బోర్డ్ అగ్రస్థానంలో పోటీకి రంగం సిద్ధమైంది. దీంతో భారతీయ క్రీడాకారిణులు దివ్య, వైశాలిలతో సహా ఐదుగురు చెరో 4.5 పాయింట్లతో సమంగా నిలిచారు. సైప్రస్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో సమయ ఒత్తిడిలో అన్నా తన బంటును పొరపాటున కోల్పోవడంతో, దివ్య నల్ల పావులతో గెలిచే స్థితికి చేరుకుంది.
దీంతో ఆమె అన్నాపై కష్టపడి ఒక పెద్ద విజయాన్ని సాధించింది. ఇంతలో, కజకిస్తాన్‌కు చెందిన బిబిసారా అసౌబాయేవా, నల్ల పావులతో డ్రా సాధించి, వైశాలి యొక్క రెండుమ్యాచ్‌ల విజయ పరంపరకు బ్రేక్ వేసింది. గ్రాండ్ స్విస్ ఛాంపియన్ 8వ రౌండ్‌లో ఇటాలియన్ గేమ్‌లో పురోగతి సాధించలేక, టోర్నమెంట్‌లో ఏకైక ఆధిక్యాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయింది. అలాగే ఓపెన్ విభాగంలో గత రౌండ్లలో వరుసగా నాలుగు డ్రాలు చేసుకున్న జీఎం రమేష్‌బాబు ప్రజ్ఞానంద పేలవ ఫామ్ కొనసాగింది. అతను ఈ టోర్నమెంట్‌లో తన రెండవ ఓటమిని చవిచూశాడు. నల్ల పావులతో ఆడుతూ నెదర్లాండ్స్‌కు చెందిన అనీష్ గిరి చేసిన కింగ్‌సైడ్ దాడిని ఆపలేక 44 ఎత్తుల తర్వాత ఓటమిని అంగీకరించాడు.





## బులియన్ మార్కెట్లో
# ధరలు పైపైకి!
### తులం బంగారం రూ.3650 పెరుగుదల
### రూ.10వేలు పెరిగిన కిలో వెండి



**ముంబయి, ఏప్రిల్ 8:** బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గిపోవడం ఖరీదైన లోహాలపై ఒత్తిడిని తగ్గించింది. అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాల పాటు యుద్ధ విరమణకు అంగీకారానికి రావడంతో బులియన్ మార్కెట్లు ప్రభావితం అయ్యాయి. బంగారం, వెండి అనూహ్యంగా పుంజుకున్నాయి. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం రూ.3,650 పెరగగా, కిలో వెండి రూ.10 వేలకు పైగా పెరిగింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం నిన్నటితో పోలిస్తే రూ.1,53,800కు, 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ.2,999 పెరిగి రూ.1,41,000కు చేరింది. కిలో వెండి రూ.10 వేలు పెరిగి నిన్నటితో పోలిస్తే రూ.2.65 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రూ.1,53,970 వద్ద ఉండగా, 22 క్యారెట్ల పసిడి రూ.1,41,150 వద్ద కొనసాగుతున్నాయి. అలాగే ముంబయి, కోల్‌కత్తా, బెంగళూరు, హైదరాబాద్‌లలో ఇంచుమించు ఒకేధరలు కొనసాగుతున్నాయి. రూ.1,53,820గా కొనసాగాయి. చెన్నైలో మాత్రం 1,54,910 రూపాయలుగా కొనసాగింది. అలాగే వెండిధరల్లో కూడా గణనీయంగా మార్పులు వచ్చాయి. చెన్నైలో 2.65 లక్షలుకాగా ముంబయి, ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూరుల్లో మాత్రం 2.60 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండిధరలు రూ.2.65 లక్షలుగా కొనసాగినట్లు బులియన్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. వెండిధరలు ఒకేరోజు పదివేలకుపైగా పెరగడం విశేషం.




# ఒక్కరోజులోనే రూ.2350 పెరిగిన షేరు ధర
### ఫోర్స్‌మోటార్స్ షేర్లు పైపైకి

**ముంబయి, ఏప్రిల్ 8:** స్టాక్ మార్కెట్లలో మల్టీనేషనల్ ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్ ఫోర్స్ మోటార్స్ అదరగొట్టింది. ఈ స్టాక్ బుధవారం సెషన్‌లో భారీగా పెరిగింది. ముందురోజు ఈ స్టాక్ ధర రూ. 19,920 వద్ద ముగియగా ఇవాళ నేరుగా దాదాపు రూ.1000 మేర పెరిగిరూ. 20, 900 వద్ద ఓపెన్ అయింది. ఇంట్రాడేలో దాదాపు 12 శాతం పెరిగింది. దీంతో ఒక్కో షేరుపై సుమారు రూ. 2350 కు పైగా పెరగడంతో రూ. 22,290 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 11.10 శాతం లాభంతో రూ. 22,131 వద్ద స్థిరపడింది. ఇక్కడ ఒక్కో షేరుపైనే రూ. 2,211 పెరిగింది.
దీంతో ఇందులో ఇన్వెస్ట్ చేసిన వారికి కాసుల పంట పండింది. స్టాక్ మార్కెట్లో సానుకూలతలు సహా కంపెనీ పెర్ఫామెన్స్ ఇన్వెస్టర్లను ఆకర్షించింది. ఫోర్స్‌మోటార్స్ గత ఆర్థిక సంవత్సరంలో (2025-26) దేశీయంగా ఏకంగా 36,536 యూనిట్లను విక్రయించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే కార్ల సేల్స్ 20 శాతం పెరిగాయి. దీంతో ఇన్వెస్టర్లలో జోష్ నెలకొంది. సెంటిమెంట్ బలపడింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 26,450 కాగా కనిష్ఠ ధర రూ. 8300 గా ఉంది. సంస్థ మార్కెట్ విలువ రూ. 29.10 వేల కోట్లుగా ఉంది.

వాణిజ్యం

# ఇన్వెస్టర్లకు లాభాల పంట!
### ఇరాన్‌వార్‌కు బ్రేక్.. ఆర్బీఐ రెపోరేట్లే కీలకం
### రూ.16 లక్షలకోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద




**ముంబయి, ఏప్రిల్ 8:** పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు సద్దుమణగడంతో భారత స్టాక్ మార్కెట్లు బుధవారం సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళ్లాయి. ఇరాన్ - అమెరికా మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు వెలువడిన వార్తలతో ఇన్వెస్టర్లలో ఒక్కసారిగా ఉత్సాహం పెరిగింది. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే సూచీలు భారీ లాభాల్లోకి వెళ్లాయి. ఈ రోజు మార్కెట్లో సెన్సెక్స్ ఒకదశలో దాదాపు 2,900 పాయింట్లకు పైగా పెరిగి 77,600 మార్కును తాకింది. నిఫ్టీ దాదాపు 890 పాయింట్ల భారీ పెరుగుదలతో 24,000 మైలురాయిని అధిగమించింది. కేవలం ఒక్క రోజులోనే ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.16 లక్షల కోట్ల మేర పెరగడం గమనార్హం. మార్కెట్ ర్యాలీకి ప్రధాన కారణాలుగా అమెరికా ఇరాన్‌లు రెండువారాల పాటు కాల్పుల విరమణకు పరస్పర అంగీకారానికి రావడమేనని తెలుస్తోంది. హార్ముజ్ జలసంధిని పూర్తిస్థాయిలో తెరుస్తామని ప్రకటించడం కూడా మార్కెట్ల లాభాలకు కారణం కాగా ఇన్వెస్టర్లలో యుద్ధ భయాలను తాత్కాలికంగా తొలగించింది. హార్ముజ్ జలసంధి గుండా రవాణాకు ఇరాన్ అంగీకరించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర భారీగా తగ్గింది (దాదాపు 13 పతనమై 95 వద్దకు చేరింది). ఇది భారత్ లాంటి దేశాలకు భారీ ఊరట కలిగించే విషయం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేట్లను యథాతథంగా 5.25 వద్దనే కొనసాగిస్తూ తీసుకున్న నిర్ణయం కూడా మార్కెట్‌కు సానుకూలంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 50 పైసల మేర పెరిగి 92.56 వద్దకు చేరింది. ఇవన్నీ భారీ లాభాలకు కారణం అయ్యాయని మార్కెట్ నిపుణుల అంచనా. ఈ రోజు మార్కెట్లో అదానీ గ్రూప్ షేర్లు 13 వరకు లాభపడగా, ఇండిగో, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు భారీ లాభాలను ఆర్జించాయి. బిఎస్ఇలో 3859 కంపెనీల షేర్లు లాభపడ్డాయి.537 షేర్లు క్షీణించగా 101 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 3.97శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 3.88శాతంచొప్పునపెరిగాయి. ఎంసిఎక్స్‌పసిడిధరలు జూన్ 5నాటి సెటిల్‌మెంట్‌ధరలు 1.76శాతంపెరిగి రూ.1,52,900కి చేరింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జూన్ సెటిల్‌మెంట్లు 14.48 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 94.79 డాలర్లుగా కొనసాగింది. గ్లోబల్ మార్కెట్లన్నీ లాభాలతో ర్యాలీ తీసాయి. అమెరికా డౌజోన్ ఫ్యూచర్స్, యూరోపియన్‌ఆసియా మార్కెట్లు కూడా ఇరాన్‌ట్రంప్ నిర్ణయాలకు మద్దతుగా ర్యాలీ తీసాయి. నాస్‌డాక్ కాంపోజిట్, ఎస్అండ్‌పి 500 కూడా లాభాలతో ర్యాలీతీసాయి.

# అమెరికా కోర్టులో అదానీకి ఊరట

**న్యూయార్కు, ఏప్రిల్ 8:** పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి అమెరికా కోర్టులో ఊరట లభించింది. ఆదానిగ్రూప్‌పై యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) నమోదు చేసిన ఫ్రాడ్ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టు అంగీకరించింది. ఈ కేసు అమెరికా చట్టాల పరిధిలోకి రాదని, ఇది పూర్తిగా దేశం వెలుపల జరిగిన వ్యవహారమని అదానీ తరఫు న్యాయవాదులు వాదిస్తున్నారు. భారత్‌లో సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు భారత అధికారులకు 250 మిలియన్ డాలర్లకు పైగా లంచాలు ఇవ్వజూపారని, ఈ విషయాన్ని అమెరికా పెట్టుబడిదారుల నుంచి దాచిపెట్టి నిధులు సేకరించారని ఆరోపిస్తూ 2024 నవంబర్‌లో ఎస్ఈసీ ఈ కేసును దాఖలు చేసింది. ఈ కేసులో గౌతమ్ అదానీతోపాటు ఆయన బంధువు సాగర్ అదానీని కూడా ప్రతివాదిగా చేర్చింది. ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తీవ్రంగా వ్యతిరేకించింది. తమ పిటిషన్‌లో కీలక అంశాలను ప్రస్తావించింది. ఈకేసు పూర్తిగా భారత్‌కు సంబంధించినదని దీనిపై విచారణ జరిపే అధికారం అమెరికా కోర్టులకు లేదని స్పష్టంచేసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ 2021లో జారీ చేసిన బాండ్ల అమ్మకం అమెరికా వెలుపల జరిగిందని, ఈ బాండ్ల కాలపరిమితి కూడా ముగిసిందని తెలిపింది. 2024లో అసలు, వడ్డీతో సహా పెట్టుబడిదారులకు పూర్తి సొమ్మును తిరిగి చెల్లించామని, ఎవరికీ ఆర్థిక నష్టం జరగలేదని కోర్టుకు వివరించింది. ఈ నేపథ్యంలో కేసును ప్రాథమిక దశలోనే కొట్టివేయాలని అదానీ న్యాయవాదులు అభ్యర్థించారు. ఆఅభ్యర్థనను పరిగణన లోకి తీసుకున్న కోర్టు పిటిషన్‌పై విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది.





# రెపోరేట్లు యధాతథం
### పశ్చిమాసియా ఉద్రిక్తతలే కారణం.. 5.25% వద్దనే రెపోరేట్ల స్థిరీకరణ

**ముంబయి, ఏప్రిల్ 8:** భారతీయ రిజర్వు బ్యాంకు మరోసారి రెపోరేట్ల జోలికి వెళ్లలేదు. మూడు రోజులపాటు నిర్వహించిన పాలసీ కమిటీ సమీక్షా సమావేశంలో రెపోరేట్ల పాలసీనిర్ణయాన్ని 5.25శాతం వద్దనే కొనసాగించాలనినిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. పశ్చిమాసియా యుద్ధ వాతావరణంలో ముడిచమురుధరలు విపరీతంగా పెరగడం, రూపాయి కనిష్టస్థాయికి పతనం చెందడం వంటి పరిణామాల నేపథ్యంలో ఆర్బీఐ రెపోరేట్లను యధాతథంగానే కొనసాగించాలని నిర్ణయించింది. అంటే ఇప్పటివరకూ కొనసాగిన 5.25శాతం వద్దనే కొనసాగిస్తుంది. 2025లో మొత్తంగా 125 బేసిస్ పాయింట్లు సవరించింది. ఇక స్థిరమైన డిపాజిట్ సౌకర్యం రేట్‌ను ఐదుశాతం వద్దనే ఉంచింది. అలాగే బ్యాంకులకు ఇచ్చే స్వల్పకాలిక నిధుల సర్దుబాటు ఎంఎస్ఎఫ్‌రేట్‌ను కూడా 5.5శాతంగానిర్ణయించింది. ఎంఎస్ఎఫ్‌రేట్, బ్యాంక్ రేట్ రెండింటినీ ఒకే స్థాయిలో కొనసాగించాలనినిర్ణయించింది.
పాలసీ సమీక్ష అనంతరం వివరాలను వెల్లడించిన ఆర్బీఐ గవర్నర్ మాట్లాడుతూ జిడిపి వృద్ధి ఈ ఏడాది 6.9శాతంగా ఉంటుందని అంచనావేసారు. ఇక హార్ముజ్ మూసివేయడంతో ఎగుమతులు,దిగుమతులకు కూడా భరీ విఘాతం కలిగింది. బీమా వ్యయాలుపెరిగాయి. పశ్చిమాసియా యుద్ధం కారణంగా గ్లోబల్ డిమాండ్‌కూడా తగ్గిందని ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. వాణిజ్య ఎగుమతులు ఇటీవలి వాణిజ్య ఒప్పందాలతో కొంతమేర ప్రయోజనకారి అవుతున్నదని అన్నారు. ఈ ఏడాదిచేసుకున్న స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందాలన్నీ కూడా ఈ ఏడాది అమలుకు వస్తాయని ఆయన అన్నారు. ఇక సేవలరంగ ఎగుమతులు కూడా సానుకూలంగానే ఉన్నట్లు సంజయ్‌మల్హోత్రా చెప్పారు. ఈ ఏడాది తొలిత్రైమాసికంలో 6.8, రెండో త్రైమాసికంలో 6.7, మూడవ త్రైమాసికంలో 7శాతం, నాలుగోత్రైమాసికంలో 7.2శాతంగా ఆర్థికవృద్ధి ఉంటుందని ఆర్బీఐ అంచనావేసింది. ఇక రిటైల్ ద్రవ్యోల్బణం 2027 ఆర్థికసంవత్సరంలో 4.6శాతంగానే ఉంటుందని వెల్లడించారు. ఇంధన ధరలు పెరగడం, నిర్వహణ వ్యయం పెరగడం వంటివి ద్రవ్యోల్బణం పెరుగుదల భయాలను పెంచిందని సంజయ్ అన్నారు.
యుద్ధభయాలు కొనసాగినా పెట్రోలు, డీజిల్ రిటైల్‌ధరలు ఎక్కడా పెరగకపోవడం కొంత మేలుచేసిందని, ఆహార ఉత్పత్తులధరలు కూడా కొంత సానుకూలంగానే ఉన్నాయని, రబీ ఉత్పత్తి పెరగడం వల్ల దిగుబడులు కూడా ఆశాజనకంగానే ఉంటాయని ఆయన చెప్పారు. ఇక ద్రవ్యోల్బణంపరంగా నాలుగు త్రైమాసికాల్లో వరుసగా నాలుగుశాం, 4.4, 5.2, 4.7శాతంగా ఉంటుందని ఆర్బీఐ ఎంపిసి సమావేశంలో అంచనావేసారు. ఇక తదుపరి ఎంపిసి సమీక్ష జూన్ మూడునుంచి ఐదోతేదీవరకూ ఉంటుందని ఆర్బీఐ ప్రకటించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.